సంపుటి : 16 సంచిక : 11,12

# స్వర్ణదీపిక

గౌరవ సంపాదకులు
**శ్రీ సి.యస్.సి.బోస్,** సీనియర్ జర్నలిస్ట్

ప్రధాన సంపాదకులు
**బ్రదర్ బి. శివాజి రాజు**

సబ్ ఎడిటర్
**మద్దాల అలెగ్జాండర్**

అసోసియేట్ ఎడిటర్స్
**డా॥ కొండెపోగు బి. డేవిడ్ లివింగ్‌స్టన్**
**బ్రదర్ వంగూరి సురేష్**

గౌరవ సలహాదారులు
**డా॥ యన్. జయకుమార్ రావు**

సంవత్సర చందా : రూ.200/-
జీవిత సభ్యత్వం : రూ. 2000/-

Swarna Deepika,
A/C. No. 1216888517
IFSC CODE No CBI N 0282336
Central Bank of India
Mango Market Branch, Vijayawada - 3

**Swarna Deepika,**
D.No.26-14-17, 3rd Floor, Lavanya Residency Opp Zymkhana Ground,
**Vijayawada-3**
Ph: 0866- 2578897
srisri032003@yahoo.com



హితవు చెప్పు నీకు హితమతి ఇలలోన
ఆత్మకుమ్మరించు ఆత్మరూపి
సాత్వికమ్ము నిచ్చు సర్వజనులకును
వినుము యేసుమాట వెలుగుబాట.

- డా॥శ్రీమతి డి.యం.యఫ్. విజయకుమారి

## రచయిత(త్రు)లకు ఆహ్వానం

దళిత క్రైస్తవులు (క్రైస్తవులు) లేకుండా దళితులకు రాజ్యాధికారం వస్తుందా?
అనే అంశంపై రచయిత(త్రు)ల నుండి వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం

- ఎడిటర్

## ఈనెల పత్రికలో...

సంపాదకీయం 2
ఉత్తరాలు 3
వార్తలు 4
అపుత్రా గతిర్నాస్తి! 5
అవిశ్వాసి నిస్సహాయత 6
ఇప్పుడిక వేడి బిర్యాని లేదు 9
దైవభక్తిగల లూదియా 10
ఉత్తమ ఉపాధ్యాయిని జాల మంగమ్మ 12
రెవ. పురుషోత్తమ చౌధరి పద్యాలు 14
స్వాతంత్ర్యాన్నిచ్చే క్రీస్తు 15
భారత స్వాతంత్ర్య పోరాటంలో క్రైస్తవులు 17
వాక్యలోతుల్లోకి...... 20
బైబిల్లో అ, ఆఅఆ..........లు 22
చదువుల నిలయం స్టెల్లా విద్యాలయం 24
అజరామరం ఆరార్కే కీర్తి 26
సామాన్యుడి గోడు 27
మరియ (కథ) 28
తప్పితే దారి - పడతారు జారి 34
ప్రార్థనలో రహస్యం 36
క్రైస్తవ సంఘ క్రమశిక్షణ 37
జగమెరిగిన బాపడు 39
విశ్వవిఖ్యాత - విలియం కేరి 44
ఫ్రాంక్లిన్ పుల్లా ఫౌండేషన్ 46
ఆరాధన టి.వి. కార్యక్రమాలు 48



స్వర్ణదీపిక టి.వి కార్యక్రమాలు; ఆరాధన టి.విలో ప్రతి శుక్రవారం ఉదయం 10.00 నుండి 10.30 వరకు **అపో॥ ఆర్. సుధాకర్ గారు** వాక్యోపదేశము చేయుదురు.

సెప్టెంబర్ 1నుండి అక్టోబర్ 15వరకు, 45 దినాలు బైబిల్ తరగతులు నిర్వహించబడును. దేవుని సేవచేయువారికి గొప్ప ఆవకాశం. పాత ఇసుకపల్లి, పిఠాపురం, తూ.గో.జిల్లా. సంప్రదించండి: 9440889304, 9440493180

# సంపాదకీయం

# పచ్చి అబద్ధం

భారతదేశ స్వాతంత్ర్యానికి పునాదులు వేసిన క్రైస్తవునికి ఈ దేశంలో స్వేచ్ఛగా తన భావాన్ని ప్రకటించే పరిస్థితులు కనుమరుగవుతున్నాయి. ఈ దేశంలో పేదవాడు తను నమ్ముకొన్న దైవాన్ని కూడా ఆరాధించ కూడదు, ప్రబోధించకూడదు అనే దురహంకార దుర్దినాల్లో బ్రతుకుతున్నాడు. మత మూర్ఖుల పన్నాగాలతో, బలవంతపు దౌర్జన్యాలతో పేదవాడు క్రమేణా మాట్లాడే హక్కును కోల్పోతున్నాడు. మానవుని ప్రాధమిక హక్కును కోల్పోతున్న సంగతి ఈదేశ మేధావులకు అక్కరలేదు. కేవలం అధికారం, ధనదాహం, వర్గవైషమ్యాలు, మత కల్లోలాలు, ప్రాంతీయ వాదాల ముచ్చట్లలో మన మేధో మీడియా తలమునకలైంది. ఈ మాట్లాడే ప్రాధమిక హక్కే మీడియాది కూడా. మీడియాకంటూ ప్రత్యేక చట్టంలేదు.

ఇంతలో మనకు తెలియకుండానే మరో భయంకర స్వార్ధ రాజకీయ మత కేన్సర్ చాపక్రింద నీరులా పేదవాడి భావప్రకటనా స్వేచ్ఛను హరించే దిశగా పాకుతూ వచ్చేస్తుంది. మానవ హక్కుల సంఘాలు మౌన రోదనలో పడిపోయాయి. గత 18 సంవత్సరాలుగా 'స్వర్ణదీపిక' ఈ విషయంలో గగ్గోలు పెడుతున్నా కనీసం క్రైస్తవ సంఘాలు సహితం సీరియస్‌గా తీసుకున్న నేపధ్యాలు అరకొరగా మాత్రమే కనబడుతున్నాయి. ఇది దురదృష్టకరం. కొన్ని క్రైస్తవ సంఘాలు పుట్టాయి. తమ వంతు ప్రయత్నాలు చేశాయి. కొన్ని చల్లారి పోయాయి. మరికొన్ని చల్లారి పోతున్నాయి. ఊపిరి పోయండి. నడుం కట్టండి. మత మూర్ఖుల ఆగడాలకు అడ్డుకట్టవేయండి లేదా మతకేన్సర్ కాటుకు మీరూ బలికావచ్చు. బలికావడం దేవుని చిత్తం. హతసాక్షులవుతాం అంటారా మీ యిష్టం. వివేకహీనులు మాత్రం కావద్దు. ఇంతకీ ఎందుకీ ఆవేశం అనుకుంటున్నారా! క్రైస్తవ పాస్టర్లను, నన్స్‌ను, బైబిల్ గ్రంధాలను భారతదేశంలో ఏదోమూల తగలబెడుతూనే వున్నారు. మనదాకా వార్తలు అందకపోవచ్చు. కాని ఇది నిజం. మొన్న అగ్నికీలల్లో దేవుని వాక్యం, నిన్న నన్స్‌పై దాడి, నేడు నల్గొండజిల్లా మునుగోడు ప్రాంతంలో పాస్టర్‌పై మూకుమ్మడి దాడి. చావు బ్రతుకుల మధ్య కొట్టమిట్టాడుతున్న పాస్టర్. ఇంతకీ పాస్టర్ చేసిన తప్పేమిటని ప్రశ్నిస్తే "మతమార్పిడి చేస్తావురా లంజకొడకా" అంటూ ఆదివారం ఆరాధనా కార్యక్రమం ముగించుకొని వెళ్తున్న చర్చి పాస్టరుపై దాడి. భావ ప్రకటనా స్వేచ్ఛ ఉన్నప్పుడు మత మార్పిడి అనేమాట పచ్చి అబద్ధపు మూట. ఆమూటను చూపి మత మార్పిడి భూతమని ప్రజలను భయపెడుతున్నది మన మేధో మీడియాయే. మీడియా ఏమాటను నొక్కి చెబితే ఆ మాటనే పోలీసు, ప్రభుత్వ యంత్రాంగాలు పదేపదే మాట్లాడటం వెర్రితనం. ఇదిగో తోక ఆదిగో పులి అన్న చందంగా తయారైంది. అభూత కల్పనా పదానికి పేద క్రైస్తవులు బలైపోతున్నారు. ఈదేశంలో పేదవాడు తన యిష్టమైన దైవాన్ని కొలువగూడదు. ఆదైవాన్ని గూర్చి ప్రకటించకూడదు. అలా చేశావో నీకున్న రాయితీలు కట్. ఇటు ప్రభుత్వాలు, అటు మతమూర్ఖులు రెంటి ఇరుసుల మధ్య నలిగిపోతున్నాడు సామాన్య క్రైస్తవుడు. ఇక్కడో విచిత్రమైన సంగతి మనకు అర్ధంకాదు. ధనికులైన లేదా అగ్రవర్ణ క్రైస్తవులజోలికిగాని ఈ సదరు మత ఛాందసవాదులు వెళ్ళరు. ఇది కూడా ఒకింత ఆశ్చర్యాన్ని కలిగించే విషయం.

భవిష్యత్ పరిణామాలు ఏవిధంగా వున్నప్పటికి ఎస్.సి, ఎస్.టి, క్రైస్తవులు ఏకత్రాటిపై నిలబడకపోతే సమైక్యత కొరవడితే భారతదేశంలో మైనారిటీల పరిస్థితి అగమ్య గోచరం. అందువల్ల పేద, సామాన్య, బడుగు, బలహీన క్రైస్తవులను కాపాడేందుకు క్రీస్తు బాటలో నీతివంతమైన, ధర్మబద్ధమైన, భక్తిపూరితమైన, న్యాయబద్ధమైన రాజకీయాలను అభివృద్ధి పరచడంలో క్రైస్తవులు తమవంతు కృషి దిశగా నడవాలి.

**"యెహోవా తన ప్రజలకు బలమును అనుగ్రహించి సమాధానము కలుగజేసి వారిని ఆశీర్వదించును." కీర్తన 29:1**



స్వాతంత్రోద్యమ శుభాకాంక్షలతో...

*బెల్లంకొండ శివాజిరాజు*



## ఇల్లు కవిత అద్భుతం

నా వయసు ఎనభైరెండు సంవత్సరాలు నావేదన, నాగోడు ఎవరితో పంచుకోను. నా చిన్న నాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ నేటి ఈ సెల్లుతరం పరిస్థితిని చూస్తుంటే కాపురాలు ఉంటాయో కూలుతాయో అర్థంకాని అయో మయం. నాలాంటి తాతలకు నావయస్సు పెద్దదైవుంటుందనుకొని ఇల్లుకవిత రాసిన బాబు జె.ఆర్.సుధీర్ నాబాధను ఇల్లు కవితలో వెళ్ళబుచ్చి నాచిన్ననాటి స్మృతులు రాసినందుకు ఆశీర్వదిస్తున్నాను.

**డి.దేవదానం, విజయవాడ.**

********

## సెభాష్, కుండ పగలు గొట్టావ్ సోదరా!

60 సంవత్సరాల సుదీర్ఘ మోసం ఇం కానా ఇకపై సాగదు అంటూ గత నెలలో జూబ్లీహాల్లో జరిగిన దళిత క్రైస్తవులకు ఎస్.సి హోదా కల్పించే విషయంలో కేంద్రమంత్రి గులాంనబీ ఆజాద్ క్రైస్తవుల చెవిలో గులాబీ పూలు పెట్టాడు. ఇక క్రైస్తవులమైన మనకు చెవులో పూలే బ్రదర్. బయ్యా ఫ్రాంక్లిన్ వ్యాసం అద్భుతం ఇకనైన మన వాళ్ళు కళ్ళు తెరవాలి. ఓటు బ్యాంకు మార్చాలి.

**- ప్రభుకుమార్ తూ॥గో॥జిల్లా.**

********

స్వర్ణదీపిక లో "అన్వేషి" గారి రాజకీయ విశ్లేషణలు దేశరాజకీయ పటాన్ని అద్దంలో తేటగా చూపిస్తున్నారు. వారు రాస్తున్న విశ్లేషణలు మేథావుల్ని సైతం ఆలోచింపచేసేదిగా వున్నాయి. దేశసరిహద్దులగుండా ఇప్పటికే టెర్రరిస్టులు జొరబడి దేశాన్ని విచ్ఛినం జేయడం చూస్తుంటే, ప్రాంతీయ పార్టీలు దేశానికి యమడేంజర్ అని వ్రాసిన వ్యాసం అక్షరసత్యం. ఎంతో ముందు చూపుతో రాసిన ఈ వ్యాసం ముందు తరాలకూ ఉపయోగపడేదే. జాతీయ సమైక్యతకు హానికరమైన ప్రాంతీయ పార్టీల విషయంలో ప్రజలు, మేధావులు అప్రమత్తంగా ఉండకపోతే అన్వేషిగారు చెప్పినట్లు దేశం చిన్నాభిన్నం కావడం తధ్యం. అన్వేషిగారికి సీనియర్ సిటిజన్‌గా నాఅభినందనలు.

**కందుకూరి జోగారావు, విశాఖ**

********

## కళ్ళు చెమ్మగిల్లాయి

ఆచార్య నిర్మలానందగారు, సోదరి ఝాన్సీ, కె.వి కుమారిగార్లకు నా అభినందనలు. పండిత రమాబాయి వ్యాసం నన్ను కదిలించింది. నిజంగా రమాబాయి మన భారత మహిళగా మనం గర్వించదగ్గ మహిళా శిరోమణి అలాగే మానవీయ విలువలకు పట్టాభిషేకమే క్రైస్తవవాదం. మరో అద్భుతం జూలై సంచికలో దేశానికి క్రైస్తవులు చేసిన సేవల్ని మరోమారు గుర్తు చేసి వాటిని మరుగున పడేస్తూ మన దేశ సంస్కృతిని బట్టి కళ్ళుచెమ్మగిల్లిన్నాయి.

**కె. విక్టర్, ఒంగోలు.**

********

## అచ్చుతప్పులు జాగ్రత్త

పత్రిక లేటుగా అందుతూంటే ఎదురు చూడలేక కొంతకోపం కూడా వస్తున్నది. ఫోన్‌చేసి పదేపదే అడుగుతున్నందుకు క్షమించండి. పత్రిక ప్రయాసతో కూడుకున్నదే అని తెలిసి కూడా మీరు ముద్రిస్తున్న ఆర్టికల్స్ చదవాలనే ఆత్రుత మమ్మల్ని అలా తొందరచేస్తుంది. మీరు అన్యధా భావించవద్దు. ముసలి తనం కూడా కొంత కారణం కావచ్చు. జూలై పత్రికలో ప్రతి ఆర్టికల్ చదవదగినదే "మరియ" కథ అయితే మా మనవరాలి కథేనా అన్పించింది. మిగతా కథకోసం ఎదురుచూస్తున్నాను. "ఈ ముద్ద దిగట్లేదు" "పదిహేడేళ్ళ పరీక్షితుడికి" కవితలు బాగున్నాయి. అచ్చుతప్పులు లేకుండా చూడండి.

**డి.డోమిక్, రిటైర్డ్ హెచ్.ఎమ్, నూజివీడు**

********

## 'స్వర్ణదీపిక' నిజంగా బంగారు దివ్వె.

జూలై, 2011 సంచికలో ప్రచురించిన 'సంపాదకీయం' చాలా బాగుంది. 'భారత దేశం పేద ప్రజలున్న సుసంపన్న దేశం' అని చరిత్రలో వ్రాసి ఉంది. నిజంగా మనదేశం సుసంప న్నమైనదే. మనదేశంలో నున్న వనరులు ఏ దేశంలో కూడా లేవు. వాటిని వెలికి తీసి, ఉపయోగించి, 'సంక్షేమ రాజ్యాన్ని' స్థాపించాల్సిన మన ప్రభుత్వాలు మన దేశంలో అత్యధికంగా వున్నా పేద, బడుగు ప్రజలను ఇంకా పేదరికంలో నెట్టివేస్తూ, బలహీన పరచుచున్నారు. వెనుకబడిన తరగతుల వారికి జరుగుచున్న అన్యాయాలను చాలా చక్కగా వివరించిన మీకు నా అభినందనలు.

అలాగే, 'ఇల్లు' కవిత చాలా బాగుంది. దీనిలో ప్రాముఖ్యంగా, అడుగంటి పోయిన మన పురాతన ఉమ్మడి కుటుంబము ప్రాముఖ్యతను, ప్రేమ, అనురాగాల ఆవశ్యకతను చాలా చక్కగా వివరించిన - జె. ఆర్. సుధీర్ గార్కి ప్రభువు పేరిట నా వందనములు.

**సుబుద్ధి శ్రీపతి, విజయవాడ**

********

గౌరవనీయులైన "స్వర్ణదీపిక" చీఫ్ ఎడిటర్ గారికి వందనములు.

మీ పత్రిక క్రైస్తవులందరికి ఆధ్యాత్మికం గాను, సామాజికంగాను ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నేటి క్రైస్తవులపై సామాజికంగా జరుగుతున్నటువంటి దాడుల గురించి, క్రైస్తవ వ్యతిరేక శక్తులు చేస్తున్నటువంటి అరాచకాల గురించి, రాజకీయంగా బడుగు, బలహీన వర్గాలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యల గురించి తెలుసుకుంటున్నాము.

ప్రత్యేకంగా ప్రచురితమయ్యే కవితలు మాకెంతో స్ఫూర్తినిస్తున్నాయి. ముఖ్యంగా జె.ఆర్.సుధీర్ గారు వ్రాసిన "ఇల్లు" అనే కవిత మమ్ములను ఎంతగానో ఆకట్టుకుంది. "టెక్నాలజీ బాగా అభివృద్ధిచెంది ప్రపంచీకరణ గావించ బడుతున్న ఈ రోజుల్లో ఒకే ఇంటిలో సహజీవనం చేస్తున్నటువంటి కుటుంబీకులు కంటికి కనిపించని సుదూరాలలో జీవిస్తున్నారు", అని నేటి కుటుంబ వ్యవస్థకు అద్దం పట్టినట్లుగా వ్రాసిన కవిగారికి మా అభినందనలు తెలియజేస్తున్నాము. ఇటువంటి స్ఫూర్తినిచ్చే కవితలు మరెన్నో... "స్వర్ణదీపిక" లో ప్రచురించాలని హృదయ పూర్వకంగా కోరుకుంటున్నాము.

**ఎస్. విజయ కుమారి,విజయవాడ**

********

## యువకవులకు 'స్వర్ణదీపిక' ఒక స్వర్ణవేదిక

ఎడిటర్ గార్కి,

మంచి మంచి వ్యాసాలతో ఎంతో మంది యువకవుల కవితలతో మన 'స్వర్ణదీపిక' కొత్త పుంతలు త్రొక్కుతోంది. ఇంతమంది కొత్త రచయితల(త్రు)లను మీరు ఆదరిస్తున్నందుకు అభినందనలు.ముఖ్యంగా "స్వర్ణపలుకులు" పత్రికకు హైలైట్ అని చెప్పాలి. శ్రీనివాస్‌గౌడ్ వ్రాసిన అనువాద కవిత "పదిహేడేళ్ళ పరీక్షితుడికి" అరసవిల్లి కవిత "ముద్దబంతిపూవు" ఎంతో బాగున్నాయి. రచయితలకు నా శుభాకాంక్షలు

**నిఖిలేష్,యం. విజయవాడ**

# రెండవ వార్షికోత్సవాన్ని జరుపుకొన్న ఆరాధన టి.వి.

ఆరాధన టీ.వీ. యేసుక్రీస్తుని సువార్త పరిచర్యలో రెండు విజయవంతమైన సంవత్సరాలను పూర్తి చేసుకొని మూడవ సంవత్సరంలోకి నూతనోత్సాహంతో ముందడుగు వేసింది. ఆరాధన టీ.వీ. దేశంలోని క్రైస్తవ టీ.వీ. ఛానల్స్‌లో టి.ఆర్.పి రేటింగ్స్ ఆధారంగా ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రస్తుతం ఈ ఛానల్ ఆంధ్రరాష్ట్రంలో 90% ప్రజలకు అందుబాటులో ఉంటూ గొప్ప గొప్ప దైవజనుల వర్తమానాలను, ఉన్నత మైన విలువలతో కూడిన వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను, చక్కని క్రైస్తవసంగీతాన్ని ఇతర సాంఘిక కార్యక్రమాలను కూడా అందిస్తూ తెలుగు క్రైస్తవ లోకాన్ని ప్రభుని రాకడ కొరకు సిద్ధపరచడంలో ముఖ్య భూమికను పోషిస్తుంది. ఈ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆ అద్వితీయ దేవునికి కృతజ్ఞతలు చెల్లించడానికి గాను సికింద్రాబాద్ మేరియట్ హోటల్‌లో జరిగిన కార్యక్రమం ఆధ్యంతం ప్రార్థనాపూర్వకంగా ప్రభువు మహిమార్థమై జరిగింది.



# ఫ్రాంక్లిన్ టెలి బైబిల్ స్కూల్ ప్రప్రథమ గ్రాడ్యుయేషన్ ఉత్సవం

సువార్త ప్రకటించాలనే ఆశ ఉండి, బైబిల్ కాలేజ్ తర్ఫీదు పొందాలనే కోరిక ఉన్నప్పటికి పరిస్థితులు అనుకూలించక 'సంచి సేవకులు' గా మిగిలిపోతున్న ఎంతో మందికి మారుమూల గ్రామాలలో సువార్త అందించడానికి సువార్తీకులకు తర్ఫీదునిచ్చేందుకు, వారి ఇండ్లవద్దనే ఉంటూ ఆరాధన టీ.వీ.లో ఫ్రాంక్లిన్ పుల్లా ఫౌండేషన్ అందిస్తున్న బైబిల్ తర్ఫీదు నిచ్చే కార్యక్రమం ఫ్రాక్లిన్ టెలీ బైబిల్ కాలేజ్ అదే ఎఫ్.టి.బి.సి., ఆరాధన టి.వి. ఫ్రాంక్లిన్ పుల్లా ఫౌండేషన్ సంయుక్తంగా ఈ ' బేచిలర్ ఆఫ్ క్రిస్టియన్ మినిస్ట్రీ డిగ్రీ' ని రాష్ట్రంలోని తెలుగు ప్రజలందరికి అందుబాటులోనికి తెచ్చింది. గత సంవత్సరకాలంగా ఈ ఎఫ్.టి.బి.సి ఆరాధన టి.వి లో ప్రసారమైంది. ఆసక్తిగల అభ్యర్థులు తమ ఇళ్ళవద్దనే ఉంటూ టి.వి. ద్వారా ఈ క్లాసులు చూస్తూ ఈ కోర్సు చేసే సదుపాయం ఈ పథకంలోని సౌలభ్యం. ఫ్రాక్లిన్ టెలీ బైబిల్ కాలేజ్ ఒక సంవత్సరం కోర్సు పూర్తిచేసుకున్న షుమారు 27మంది బేచిలర్ ఆఫ్ క్రిస్టియన్ మినిస్ట్రీలో మొట్టమొదటిసారిగా జూలై 31నాడు సాయంత్రం 5గంటలకు సికింద్రాబాద్‌లో గ్రాడ్యుయేషన్ తీసుకొన్నారు. వీరేకాక వేలాదిమంది టీ.వీ పాఠాలను ఆచరిస్తూ సర్టిఫికెట్ కొరకు కోర్స్ చేయనప్పటికి బైబిల్ జ్ఞానాన్ని పెంపొందించుకోడానికి ఈ ఎఫ్.టి.బి.సి ఎంతగానో ఉపయోగపడింది. ఈ ఎఫ్.టి.బి.సి.కి వి.కె.హెన్రీ గారు కన్వీనర్‌గా వ్వవహరించారు. ఈ ఎఫ్.టి.బి.సి.లో సీనియర్ ప్రొఫెసర్‌లు వివిధ సబ్జెక్ట్‌లు బోధించడం జరిగింది. ప్రిన్సిపాల్‌గా సీనియర్ ప్రొఫెసర్, ఏ.సి.టి.సి రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎస్.జోసఫ్ గారు తన సేవలనందించారు.

మీరు మీఇంటివద్దనుండే ఈకోర్సును పూర్తిచేయవచ్చు సంప్రదించండి బ్రదర్.వి.కె.హెన్రీ. 900077493.



# అపుత్రాగతిర్నాస్తి!



డా॥ఎ.యన్.ఆర్. జిక్కం

**"దేహమా! దేవుని ఆలయమా! సజీవుని సన్నిధినుండి వేరుపడిన శరీరమా! అమరత్వం నుండి మర్త్యమునకు జారిపోయిన కాయమా! నిన్ను సంస్కరించి, నీ పాపమును పరిశుద్ధుని రుధిరములో నిమజ్జనం చేసి ఆ సజీవుని సన్నిధికి చేర్చాలనే నీలో జీవిస్తున్నాను. ప్రజ్వలించే జ్యోతిని నేను. పవిత్ర పథముపై నడిపే పరమ వెలుగును నేనే. నీ తనువుపై మమకారం పెంచుకోక, లోకాశలకు లొంగిపోక శాశ్వత జీవం కొరకు పరితపించు. నీతో పాటు నేనూ స్వర్గధామం చేరుతాను...." యోవేలు 2:12**

**ధ**ర్మ మేదయినా దాని ప్రబోధము ఒక్కటే! ఆత్మ నిర్దేశమును అనుసరించమనే. ధర్మ మేదయినా దాని లక్ష్యం మోక్షసాధనమే. కానీ దానికి మార్గం మాత్రం ఒక్కటే! దానిని బోధించగలవాడు, చూపెట్ట గలవాడు, అక్కడికి చేర్చగలవాడే "పుత్రుడు". నీవు కనిన నీ కుమారుడు మాత్రం నిన్ను మోక్షానికి చేర్చలేడు. పున్నామ నరకము నుండి తప్పించేవాడు పుత్రుడనే సిద్ధాంతర్థాన్ని సృష్టించారు వాఙ్మయకారులు.

సత్యం - సదాసజీవం
నిత్యం - సద్గమన పథం
తేజం - అనంత ప్రకాశితం
మోక్షం - పరిశుద్ధ పరిమళం - అని గ్రహించిన

ఋషులు, మహాపురుషులు, తపస్వికులు, అన్వేషికులు అనేకులు అతిశక్తి వంతమైన పరమశక్తి కోసం, ఆత్మ పిపాసను తీర్చే ఆత్మ స్వరూపికోసం, ప్రియ బాంధవుని రాకకోసం ఎదురు చూశారు.

"అపుత్రాగతిర్నాస్తి" - అనే సత్యానికి సింహాసనం వేసి ఆ పుత్రుని కోసం వెదకడం ఆరంభించారు. తపస్సులు చేశారు. సజీవంగా సమాధికి వెళ్లిపోయారు. అవతారాలు చాలించారు. అయినా పుత్రుని గురించిన మర్మం తెలుసుకోలేక పోయారు. ఆత్మ గురించి ఎవరేమి బోధించినా వారినే పుత్రునిగా భావించారు. వారి బోధలకు ఆచార, సాంప్రదాయలను సమ్మిళితం చేసి "మతము" అనే సమూహాన్ని ఏర్పరచగలిగారే కాని మోక్షానికి మార్గం కనుగొనలేకపోయారు. యోహాను 14:6,7.స్వర్గమంటే భౌతికంగా సుఖించి, ఆనందించే లోకం కాదు.



మోక్షమంటే లాస విలాసాలకేళీ సదనంకాదు.

పరలోకమంటే పాపాలు చేస్తూ ప్రార్ధన చేసుకొనే స్థలంకాదు. పాపవిముక్తి చెందిన ఆత్మ, నిత్య ఆనందంతో, నిత్య విశ్రాంతితో నిత్యుడైన "సత్పురుష"ని సన్నిధిలో, శాంతి సమాధానములతో పరవశించిపోయే "శూన్యవేదిక" - స్వర్గం, మోక్షం, పరలోకం ఇదే రక్షణ రాజ్యం. ఈ రక్షణ రాజ్యమునకు మార్గం చూపగలవాడే "రక్షకుడు". ఆ రక్షకుడే "కన్య సుతుడు".

"కన్యక గర్భవతియై "కుమారుని" కని అతనికి "ఇమ్మాను యేలు" అను పేరు పెట్టును. (యెషయా 7:14) కన్యకగా ఉండగనే గర్భవతి కావడం- అద్భుతం, ఆశ్చర్యం. కాని అతిశయోక్తి ఎంత మాత్రము కాదు. ఇది సృష్టికర్త సంభావములో సంభవం అయిన సూచన క్రియ. పాప భూయిష్టమైన ఈలోక వాసులను పరమ పథంపై నడిపించుటకు "పరిశుద్ధుడయిన ఒక పుత్రుని జననం అవశ్యం. దేవుడు తలంచుకొంటే పుత్రులను ఎంతమందినైనా సృష్టించగలడు. కానీ సృషింపబడిన కుమారుడు, తన సృష్టియైన మనలను రక్షించలేడు. (ఆదికాండము 3:20) అందుకే పుత్రుడు జన్మించాలి. అదీ స్త్రీ సంతానముగా జన్మించాలి. ఆ స్త్రీ దేహం దేవాలయమై ఉండాలి. ఆ స్త్రీ గర్భాలయం అగ్నిని (పవిత్రతను) ఆస్వాదించే శక్తి కలిగి ఉండాలి. అంటే సృష్టికర్త ఆపాదించిన భౌతిక పవిత్రతను పరిరక్షణ చేసుకొని ఆత్మ అభీష్టానికి సమర్పికురాలై ఉండాలి. అటువంటి కన్య కనిన కుమారుడే "పుత్రుడు". ఆ పుత్రుడే "క్రీస్తు". ఆ పుత్రునిలో లీనమైపోవాలనే ఆత్మ దేహాన్ని నిర్దేశిస్తూ వుంటుంది.

పంచ భూతములు సహితము ఆత్మను తాకేందుకే భయ పడ్తాయి. ఆత్మ మానవ దేహాన్ని వదిలిన తర్వాత చేరవలసిన స్థలం "ఆత్మాలయం" (పరదైసు). అందుకే ఆత్మ దాని స్థానాన్ని అది కోరుకుంటూ ఉంటుంది. మానవదేహాన్ని వదిలిన ప్రతి ఆత్మ ఇక్కడే "ఆత్మ స్వరూపి" ప్రసన్నత కోసం, ప్రత్యక్షతకోసం ధ్యానిస్తూ ఉంటాయి. సదా సజీవుడయిన పుత్రుని తీర్పు కోసం వేచి ఉంటాయి.

" పునరుత్థానుడు కాగలిగిన వాడే పుత్రుడు". ఆ పుత్రుని పవిత్ర రుధిరమే మన పాపాలను కడిగి స్వస్థపరచగలదు. ఆ పుత్రుని సజీవయాగమే, సిలువ త్యాగమే విశ్వసించిన మనలను పరలోకం చేర్చగలదు. అనాదిగా అనేకులు అన్వేషించిన పుత్రుడే యెషయా ప్రవచించిన పరమపుత్రుడు. నారీ పుత్రుడై నరుల పాపాలకు ప్రాయశ్చిత్తం చేయవచ్చిన యాగపుత్రుడు. క్రీస్తే ఇతిహాసాలు వివరించిన పుత్రుడు...."అపుత్రాగతిర్నాస్తికి" - అర్థం క్రీస్తే. ★

వ్యాసం

# అవిశ్వాసి నిస్సహాయత



డా॥ బి. జ్యోతి స్వరూప రాణి

దేవుని యందు నమ్మకము లేక పోవుటే అవిశ్వాసం. విశ్వాసము లేనివాడు సాతాను శోధనకు గురి అయి ఏమీచేయలేని నిస్సహాయ స్థితిలో ఉంటాడు. దాన్నుండి తప్పించుకోడానికి సర్వాంగ కవచాన్ని ధరించి అపవాదిని ఎదుర్కొని దేవుని యందు బల పడాలి.

యేసు శిష్యులలో పేతురు ముఖ్యుడైన ఇష్టుడైన శిష్యుడు. ఎంతో భక్తితో యేసు చుట్టు తిరుగుతూ ఆయన చేస్తున్న అద్భుత కార్యాలు చూస్తూ బాధలు వింటూవుంటూనే యేసును పట్టుకునే నిమిషం లో అవిశ్వాసంలో పడిపోయాడు. సాతాను శోధనకు గురి అయ్యాడు. అబద్ధం ఆడాడు. ఎంత వారయినా ఈ శోధనను తప్పించు కోలేరు. యేసు ప్రభువుకీ సాతాను శోధన తప్పలేదు. ఇక మానవ మాత్రులం మనమెంత. అందుకే గట్టి నమ్మకంతో మనం ఉండాలి. యేసు ముందే చెప్పాడు పేతురుతో కోడి కూయక ముందే 3 సార్లు నన్నెరుగనని. అందుకు పేతురు వప్పు కోలేదు. నేనెందుకలా చెపుతాను. ప్రాణం పోయినా చెప్పను. నీకొరకు నా ప్రాణాన్నే ఇస్తాను అన్నాడు. కానీ శోధనకు గురి అయి అబద్ధం చెప్పి నిస్సహాయ స్థితిలో పడ్డాడు.

పేతురు – బండరాయి అని అర్థం, అసలు పేరు సీమోను. పాత నిబంధనలో షిమ్యోనుకు సమానమైన పేరు. ఈరెంటికి 'వినుట' అని అర్థం వుంది. ఇతడు యోనా అనువాని కొడుకు కాబట్టి యేసు అప్పుడప్పుడు 'బరయోనా' అని పిలిచేవాడు.

పేతురుకు 'అంద్రెయ' అనే సహోదరుడు ఉన్నాడు. బాల్యం నుండి జాలరి వృత్తి. గలిలయ సముద్ర తీరాన బెత్సయిదా గ్రామ నివాసులు. పేతురుకు కుటుంబం వుంది. భార్య పిల్లలు వున్నారు. స్వంత పడవ. కపెర్నాహోములో సొంత ఇల్లు వుంది. కాబట్టి ఇతడు పేదవాడు కాడు. జెబెదయి కొడుకులు యాకోబు, యోహానులతో కలిసి చేపల వ్యాపారం చేసే వాడు. ముందునుంచి శిష్యుడుకాడు. ఒకసారి యేసు బోధ విని ఆయన దగ్గరకు అపుడపుడు వెళ్ళేవాడు. తన వృత్తి చేసుకునే వాడు. మనుషులను పట్టే జాలరులుగా చేస్తాను రమ్మని పిలిచినపుడు అన్ని వదిలి వెళ్ళి యేసుతో చేరిపోతాడు. యేసు ఏర్పాటు చేసుకున్న అపోస్తలులో ముఖ్యుడు అయ్యాడు. యేసు ఎక్కువగా సూచక క్రియలు చేసేటపుడుగాని, ముఖ్యవిషయాలు మాట్లాడేపుడుగాని ఎక్కువగా యాకోబు, యోహాను, పేతురును తనవద్ద వుండటానికి అనుమతి ఇచ్చేవాడు.



పేతురులో అపుడపుడు అతిశయం వుండేది. శిష్యులలో ముఖ్యుడుగా ఉన్నాననే గర్వం కలిగేది. దాంతో అవిశ్వాసంలో పడి పోయేవాడు. అందుకు యేసు కూడా 'అల్ప విశ్వాసీ'అని పేతురును అన్నాడు. యేసు సముద్రము మీద నడుస్తున్నపుడు పేతురు దానిలో వున్నాడు. యేసును చూచి తనకు నీళ్ళమీద నడవాలను కోరిక కలిగింది. యేసును అడిగాడు. యేసు రమ్మన్నాడు. పేతురు నీళ్ళ మీద యేసును చూస్తూ నడిచాడు. రెండు అడుగులు నడచిన తర్వాత నేను యేసులా నీళ్ళపై నడుస్తున్నానని గర్వించాడు అదే సమయంలో సాతాను ప్రవేశించి అమ్మో, నేను నీళ్ళమీద నడుస్తున్నానని దృష్టి యేసు నుండి ప్రక్కకు మరలించాడో నీళ్ళలో పడిపోయాడు. నమ్మకం పోయింది. యేసూ రక్షించు అని మరల ఆయన్ను పిలిచి రక్షింపబడ్డాడు. మనం కూడ ఏది జరిగినా అది మన గొప్పే అనుకొని గర్విస్తాము. మనల్ని గొప్ప చేసుకుంటాము. సాతాను శోధిస్తుంది. అవిశ్వాసంలో పడి పోతాము.

యేసు వైపు చూసినంత వరకు మనకు ఎలాంటి భయం వుండదు. మన దృష్టి మారిందో పక్కకు పడిపోతాము. సందేహం, అల్ప విశ్వాసం, భయం, మోసం, మొదలగు

గుణాలు సాతాను గుణాలు. అందుకు యేసు పేతురుతో అతని చేయి చాపి పట్టుకొని 'అల్ప విశ్వాసి ఎందుకు సందేహ పడితివని, అతనితో అన్నాడు.

యేసు మరణించిన తరువాత ఎప్పటి లా తన వృత్తి చేసుకోడానికి వెళ్ళిపోయాడు. యేసు లేచాడు అన్నవిషయం తెలియగానే యోహానుతో కూడ సమాధి వద్దకు వచ్చి నిజంగా లేచాడని తెలుసుకున్నాడు. తన చేపల వృత్తి చేసుకుంటూ గలిలయ సముద్ర ప్రాంతం లో ఉన్నపుడు యేసు వారికి ప్రత్యక్షమై వారితో కలిసి భోజనం చేసి పేతురు పశ్చాత్తాప దుఃఖాన్ని క్షమించి మరల తన శిష్యులలో చేర్చుకున్నాడు. యేసు ఆజ్ఞలను బట్టి సంఘాలను కట్టి సూచక క్రియలు చేస్తూ అనేక వేల మందికి బాప్తిస్మమిచ్చి సువార్తను ప్రకటించాడు. ఈవిధంగా పేతురు కొద్దిగ అల్ప విశ్వాసంలోకి అస్సహాయతలోకి సాతాను శోధనకు లొంగిపోయినా మరల పశ్చాత్తాపముతో క్షమించమని అడిగి విశ్వాసం యొక్క గొప్పతనాన్ని తెలుసుకొని శిష్యులలో ముఖ్యుడు, ప్రముఖమైన అపోస్తలుడుగా మారాడు. సువార్తను ప్రకటించాడు. కాబట్టి మనం కూడ అవి శ్వాసంలోకి వెళ్ళకుండా ఉండాలంటే ఆయన శక్తి బట్టి బలవంతులమై ఉండాలి. అపవాదిని దాని తంత్రాలను ఎదిరించాలి. అందుకై సర్వాంగ కవచాన్ని ధరించాలి. అది ఎలా ధరించాలో తెలుసుకుందాం.

దేవుడు వెలుగు. అపవాది చీకటి. ప్రధాన శత్రువైన అపవాదికి రెక్కలుంటాయని, దేవునికి వ్యతిరేకంగా దుష్ట పన్నాగాలు పన్నుతుంటాడని పారసీకుల మతంలో వుంది.

గ్రీకు అనువాదంలో దేవుని శత్రువు 'అపవాది' అని పిలిచారు. గ్రీకు పదం 'డయా బోలస్' నుండి అపవాది వచ్చింది. యేసు పుట్టక ముందు 200సం॥ ముందే సాతాను దేవుని విరోధి అని వర్ణించారు. యేసు కాలంలో దుష్ట శక్తులను 'సాతాను అధికారం' అని పిలిచారు. దీనికున్న మరోపేరు 'బయెల్జె జూబ' దాని అధికారం క్రింద పనిచేస్తున్నాడని యేసును కొందరు ఆక్షేపించారు. (మార్కు 36-22:26)

మనుషులను చీకటిలో నుంచి వెలుగులోనికి, సాతాను అధికారం నుంచి దేవుని వైపునకు మరల్చడానికి యేసు వచ్చాడని కొత్త నిబంధన మనకు చెబుతుంది. (అపోస్త 26:18) అపవాది శోధనలన్నింటిని యేసు జయించాడు. (మార్కు 16:12,13 లూక 41:13) మనుషుల ను బాధించే దయ్యాలను యేసు గద్దించి వెళ్ల గొట్టడం మార్కు 1,5,7 అధ్యాయాల్లో వుంది. సాతాను మీద అధికారం తనకు పరలోకం నుంచి లభించిందని సాతాను మీద తాను పొందిన విజయం వల్ల దేవుని రాజ్యపు పని



జరుగుతుందని యేసు చెప్పాడు. లూక 11:18-20 వచనాలు. సాతాను తనకు ఆటంకంగా వుందని పౌలు నమ్మాడు. 2కొరింథీ 12:7-1 థెస్స 2:18. దేవుని వెంబడించేవారిని సాతాను వెలుగు దూత వేషం వేస్తాడని పౌలు బోధించాడు. 2కొరింథీ 116 :14:15 దేవుడు సాతానును చితకొట్టి నామరూపాల్లేకుండా చేస్తాడని బలంగా నమ్మాడు. (రోమా 16:20.)

అందుకే మనం ఈ శోధనకు తట్టుకోవాలన్నా దాన్ని దాని కుతంత్రాలను ఎదిరించాలన్న నడుముకు సత్యం అనే దట్టి కట్టుకొని నీతి అను మైమరువు (వస్త్రం) చుట్టుకొని పాదాలకు సమాధానం అనే జోడు తొడుగుకొని, విశ్వాసం అనే డాలు పట్టుకొని దేవుని వాక్యం అనే ఖడ్గంతో జయించాలి.

**దట్టి:** అంటే నడికట్టు. సైనికుడు యుద్ధానికి కావలసిన వస్తువులను ఈ దట్టిలో పెట్టుకుంటాడు. ఈదట్టి బెల్టులా వుండి అరలు ఉంటాయి. ఈ అరల్లో కత్తి, బాకు, బాణం, ఇలా పెట్టుకుంటాడు. అలాగే మనం దేవుడు సత్యం అని నమ్మినదాన్ని మన నడుముకు చుట్టుకోవాలి. అంటే దేవుడుంటే నిజం. నాలో ఉన్నాడని నిజం.

**మైమరపు:** సైనికుని గొంతు నుండి ఛాతి వరకు వుండే కవచం. ఇది శత్రువుని నుండి వచ్చే భాగాలను కత్తుల నుండి కాపాడుతుంది.

అలాగే మనం నీతి న్యాయం అను వస్త్రాన్ని ధరించాలి. దేవుడు న్యాయాధికారి. నీతి గలవాడు అని నమ్మి ఈయన్ను బట్టి మనం

**'స్వర్ణదీపిక కథల పోటీ' లో బహుమతి పొందిన కథలు**

| | | |
|---|---|---|
| **ప్రథమ బహుమతి** | : | ఏ ఒక్క కథ అర్హతపొందని కారణంగా ప్రకటించుటలేనందుకు చింతిస్తున్నాము |
| **ద్వితీయ బహుమతి** | : | **ప్రేమజ్వాల** |
| | | రచన : యం. సంపత్, గుంటూరు |
| **తృతీయ బహుమతి** | : | **ఆమెన్ తథాస్తు** |
| | | రచన : పి. శ్రీనివాస్ గౌడ్, చీరాల |
| **కన్సొలేషన్ బహుమతులు** | : | **మంత్రి గారి వియ్యంకుడు** |
| | | రచన : యం.వి.జె భువనేశ్వరరావు, అనకాపల్లి |
| | | **శుభం** |
| | | రచన: రెవ.ఎల్.వి ప్రసాదరావు, విశాఖపట్నం |

*త్వరలో జరగనున్న క్రైస్తవ రచయితల సదస్సులో విజేతలకు బహుమతి ప్రదానం జరుగును. తేది త్వరలో ఫోన్ ద్వారా తెలియజేయబడును. మరియు వచ్చే సంచిక నుండి బహుమతి పొందిన కథలు ప్రచురింపబడతాయి.* – ఎడిటర్

నీతి కలిగి వుండాలి. నీతి కాని జీవనం దుర్భరం. సాతానుకు అంకితమవుతుంది.

**జోడు:** సైనికుడు యుద్ధంచేసేపుడు పడి పోకుండా గట్టిగా నిలబడాలని బూట్లు ధరిస్తాడు. ఈ బూట్లు అడుగున చిన్న చిన్న బుడి పెలు వుంటాయి. అవి సైనికుడిని పడిపోకుండా ధైర్యంగా నిలబెట్టుతాయి.

అలాగే మనం సమాధానం, ప్రేమ అనే బూట్లు తొడుగుకోవాలి. ఎవరితో శత్రుత్వం లేకుండా సమాధానం కలిగివుంటే ప్రేమ కలిగిన జీవితం వుంటే శోధనకు గురికావు. మనసులో సమాధానం లేకపోతే అశాంతి పెరుగుతుంది. ప్రేమ లేకపోతే ఎవరితోడు లేక ఒంటరి జీవివి అవుతావు. శాంతి, సమాధానం, ప్రేమ ఉన్నప్పుడు జీవితంలో స్థిరంగా నిలబడతావు. అందరూ నీవెంట వుంటారు. ఐకమత్యపు ఆనందాన్ని అనుభవిస్తావు.

**డాలు:** ఇది గట్టి చెక్కతో చేసిన దీర్ఘ చతుర ప్రాకారపు కడెం. దీనిపైన తోలుగాని, నారగాని బిగించి వుంటుంది. యుద్ధ సమయాలందు ఈడాలు శత్రువు వేసే అగ్నిబాణాలు ఈ డాలుకు తగిలి ఆరిపోతాయి. డాలు పట్టుకున్నవారికి ఎటువంటి అపాయం వుండదు. అలాగే మనం విశ్వాసం నమ్మకం అనే డాలు పట్టుకోవాలి. దేవుడు ఉన్నాడనే నిజం మనసారా నమ్మి పెదవులలో ఉచ్చరించాలి. ప్రతి క్షణం మనలను కాపాడుతున్నాడను నమ్మకం మనలో ఉండాలి. అది ఉన్ననాడు సాతాను వేసే బాణాలను విశ్వాసం అనే డాలుతో తిప్పి కొట్టగలగుతాము.

**ఖడ్గం:** ఖడ్గం పొట్టిగా వాడిగా ఉంటుంది. దీనిలో సైనికుడు ఎదుటివ్యక్తిపై దాడి చేస్తాడు. పైన చెప్పిన వన్ని తనను తాను రక్షించుకొను ఆయుధాలు. ఖడ్గం మాత్రం శత్రువుని చంపే ఆయుధం. దీంతో శత్రువుని ఎదుర్కొని మట్టుపెడతాడు.అలాగే మనం దేవుని వాక్యం అను ఖడ్గాన్ని ధరించాలి. ఈ వాక్యం రెండంచులు గలది. సజీవమై బలము గలదై రెండంచులు గల ఎటువంటి ఖడ్గము కంటెను వాడిగా వుండి ప్రాణాత్మలను, వేళ్ళను, మూలగను, విభజించి కొంత మట్టుకు దూరుచు హృదయము యొక్క తలపులను ఆలోచనలను శోధించుచున్నది.

**హెబ్రీయులు 4:12** దేవుని వాక్యాన్ని బాగా చదివి మన హృదయ మందు పదిలపరచుకొని వాక్య ప్రకారం జీవించాలి. నడచుకోవాలి. ఆ వాక్యమే బలమైన ఖడ్గంగా మారి సాతాను శోధన నుండి విడిపిస్తుంది. జయిస్తుంది. తన హృదయాలోచనలు, తలంపులు అన్ని శోధిస్తుంది. పవిత్రమైన స్వచ్ఛమైన మనసు మనకుండాలి. అది వాక్యం అనుసరించి నడవడం వల్ల మాత్రమే సాధ్యం అవుతుంది. అపుడే



ఎటువంటి శోధన అయిన జయించ కలుగుతాము. మానవ స్వభావం అపుడపుడు అశాంతి కి, ఆవేశానికి అహంకారానికి, అసూయకు గురవుతుంది.

అపుడే సాతాను మన హృదయాన్ని వశపరచుకోటానికి బలం చూపుతుంది. లొంగ దీసుకోటానికి ప్రయత్నిస్తుంది. ఆ సమయంలో విశ్వాసంతో, నమ్మకం తో, మనం ఉన్నప్పుడు సాతానుని జయించ గలుగు తాము. అవిశ్వాసము నుండి బయట పడతాము. సజీవమైన దేవుని వాక్యమును ఖడ్గాన్ని ధరించి గొప్ప విశ్వాసంలో అపవాదిని ఎదిరించి నిత్య జీవములోనికి ప్రవేశిద్దాం. మెలకువగా ఉందాం. విశ్వాసంలో నిలకడగా వుందాం. పౌరుషంగా వుందాం. బలవంతులమై ఉందాం. దేవుని కొరకై చేసే ప్రతికార్యాన్ని ప్రేమతో చేద్దాం. అట్టి కృప పరిశుద్ధాత్మ దేవుడు మనకనుగ్రహించును గాక. ఆమెన్.

ప్రతి క్రైస్తవుడు తప్పక చదవవలసిన ప్రత్యేకమైన పుస్తకాలు

తెగిపడిన
నా సహోదరునికి
ప్రేమతో...

ఈ క్షణమే చచ్చిపో....
క్రైస్తవునిగా జన్మించు

Publisher:-
SHARON CHRISTIAN BOOK CENTRE, KAKINADA. Phone: 0884 - 2367806

# ఇప్పుడిక వేడి బిర్యాని లేదు



చిన్న తనంలో
చీకటి పడ్డాక
ప్రతి ఇంట్లోనూ
రేడియోలు వెలిగేవి.

వీధిలో నడిచి వెళ్తుంటే
ప్రతి కిటికీలోంచీ
నువ్వే పలకరించేవాడివి.

దోసిళ్ల నిండా వాక్యపు వజ్రాల్ని
రేడియోలోంచి మా ముందుగదిలోకి
నువ్వు జారవిడుస్తుంటే
ఆబగా ఏరుకున్నాం.

మేం భక్తి గల క్రైస్తవులని
మా పక్కింటికి తెలిపింది
నీ కంఠమే
అసలా కంఠం కోసమే కదా
మేం రేడియోలు కొన్నదీ
ఇళ్లంతా చెవులై విన్నదీ

రేడియో నిన్ను వదిలేసాక
మేం రేడియోను వదిలేసాం

అభిమానులం కదా
అలవాటైన గాత్రాన్ని
మీటింగ్సులో, మేగజైన్సులో వెతుక్కున్నాం
శాటిలైట్ ఛానళ్ల పుణ్యమాని
స్వస్థతల డైలీ సీరియళ్లు
అద్భుతాల గేమ్ షోలు
ప్రసంగాల పబ్లిసిటీ మోజులో
చురకత్తి లాంటి నీ సందేశం ఎవరిక్కావాలి?

మషాలా లేనిదే ముద్ద దిగని మా వాళ్లకి
శుభ్రమైన నీ శాఖాహార వాక్యం ఏం రుచిస్తుంది?

టెలివిజన్ చెత్త కుండీలో
రెండు మెతుకుల కోసం ఆకలితో వెతుకులాడే
మాలాంటి కొందరికి
ఇంకా విప్పని వేడి బిర్యానీ పార్సిల్‌వి
సీలు తీయని మినరల్ వాటర్ బాటిల్‌వి
ఇప్పుడిక అదీ లేదు.

*(రేడియో పాస్టర్ ఆరార్కే మూర్తి గార్కి నిండు వందనాలతో...)*

**- సురేష్ వంగూరి**

వ్యాసం

# దైవభక్తి గల లూదియ



ఆచార్య యమ్.నిర్మలానంద

"దైవ భక్తి ఇప్పటి జీవము విషయము లోను, రాబోవు జీవము విషయములోను వాగ్దానముతో కూడినదై నందున అది అన్ని విషయములలో ప్రయోజన కరమవును". ఈ వాక్య ప్రకారము దైవభక్తి ప్రయోజనకరమైనది కనుక సాధకము చేసుకోవాలి. అంతేకాదు కానీ దీనికోసము ప్రయాసపడాలి. (1 తిమో 4:8-10). యౌవనస్థుడైన తిమోతిని పరిశుద్ధు డైన పౌలు పైరీతిగ హెచ్చరిస్తున్నాడు. అయితే పౌలు తన మిషనరీ ప్రయాణములో తుయతైర అనే పట్టణము వచ్చినప్పుడు నిజముగా దైవభక్తి కలిగిన స్త్రీ తనకు తారసపడినది. ఈమె జీవితం గురించి అ పొ.కార్య. 16:14-15లో వ్రాయ బడినది. పౌలు దినాల్లో భక్తిగల స్త్రీలు కలరు కానీ అందరు ప్రభుని యెరిగిన వారు కారు.

"భక్తి మర్యాదలు గల స్త్రీలు" పౌలు, బర్నబాకు యూదులతో కలిసి హింస కలుగ జేసిరి( అ.కా 13:50) ఇదే అధ్యాయములో 48 వవచనము లో ప్రభువు వాక్యము వ్యాపించెను అని, నిత్య జీవమునకు నిర్ణయింప బడిన వారందరు విశ్వ సించిరి అని ఉంది. అనగా పౌలు బోధించి నపుడు కొందరు నమ్మారు కొందరు నమ్మలేదు. చాలమంది విశ్వసించారు (అ.కా. 4:4).

ఇటువంటి పరిస్థితుల్లో పౌలు అ.కా. 16వ అధ్యాయములో నదీ తీరమున కూడి వచ్చిన స్త్రీలతో మాటలాడుట మొదలు పెట్టాడు. 14వ వచనములో, అపుడు లూదియా అను దైవభక్తి గల స్త్రీ వినింది. ఈమె గుణగణాలు చూస్తే చాలా ఉన్నతమైనవి అవేంటో చూద్దాం.

1. ఆమె(లూదియ) దైవభక్తి కలిగి నది. (1తిమో 6:6, 5:1-4 సామె 15:6,15:9 చూడండి)

2. వర్తకురాలుగా (Business Woman అనవచ్చుగా!) ఊదా రంగు పొడిని అమ్ముతూ ఉంది. అనగా ఆరోజుల్లో స్త్రీలు బయట పనిచేయకూడదని కట్టడ ఉన్న దినాలు. అయినా ధైర్యంగా తన కోసం, తన కుటుంబం కోసం కష్టపడి పని చేసింది. కుటుంబమంతా బాప్తిస్మము తీసికొన్నారు.

3. ఈమె తుయతైరా పట్టణస్థురాలు, కుటుంబీకురాలు: ప్రకటన 2:18 ప్రకారము అక్కడ ఒక సంఘమున్నది. ఆ సంఘములో విశ్వాసులు ఉన్నారు కాని, అన్యదేవతలను పూజిస్తున్నారు. అయితే కొందరికి, నమ్మిక ముగా ఉన్నవారికి "కలిగియున్నది గట్టిగా పట్టు కొనుము" అని హెచ్చరిక ఇవ్వబడింది. అన్ని తెలుగు బైబిలులో చివరి పేజీలో (Map) తుయతైరను గుర్తించవచ్చు.

4. ప్రభువు ఆమె హృదయమును తెరచెను: ఎందుకంటే పౌలు చెప్పిన మాటల యందు లక్ష్యము ఉంచింది. అనేకసార్లు మార్పు రాలేదు. జీవితంలో అని అనుకుంటాము. దాని కి ఒక కారణం ఇక్కడ చెప్పబడి ంది. వాక్య మందు మనము లక్ష్యముంచము. ఇకనుండైనా లూదియాను చూచినేర్చుకుందాం. వాక్యాన్ని విన్నది కాని చదివినది కాని లక్ష్యపెట్టుదాం (హెబ్రీ 4:12).

5. ఈమె, ఈమె ఇంటివారును బాప్తీస్మము పొందిరి: బాప్తీస్మము అనునది ఈ రోజుల్లో ఒక ఆచారంగా సంస్కారంగా మారు తున్నది, గాని యేసుక్రీస్తును అంగీక రించడానికి బాప్తీస్మము అక్కరలేదు, విశ్వాసం ఉండాలి. విశ్వాసానికి, క్రీస్తు మన పాపాల కొరకు సిలువలో చనిపోయాడని, తిరిగి లేచాడని, దానికి గుర్తుగా మనము కూడా నీటి బాప్తీస్మములో మునుగుట ద్వారా పాపానికి చనిపోయామని, సమాధిచేయబడ్డామని, ప్రభువు వలె తిరిగి లేచామన్నదానికి భౌతికమైన సూచనగా హృదయములో నున్న విశ్వాసానికి గుర్తు మాత్రమేనని గ్రహించాలి. అప్పుడు మనము క్రీస్తును ధరించుకొన్న వారమ గుదుము. (గలతి 3:27) ఆ.కా. 8:12లో ఫిలిప్పు సువార్త ప్రకటించగా, నమ్మి పురుషులు స్త్రీలు బాప్తీస్మము పొందిరి. అందుకనే లూదియ పౌలు బృందంతో చెబుతుంది. ఆ. కా 16:15లో ఇలా "నేను ప్రభువు యందు విశ్వాసము గల దానినని యెంచితే". గనుక లూదియ ప్రభువు నందు విశ్వాసముంచి బాప్తీస్మము తీసుకొనినది ఆచార ముగా కాదు. మనలను మనము పరీక్ష చేసు కుందుము గాక. (ఆ.కా. 16:31,17:30)

6. ప్రభువు సేవకులను తన యింటికి ఆహ్వానించినది: కొందరు తెలియకయే దేవదూతలకు ఆతిథ్యమిచ్చారు అని వాక్యంలో ఉన్నది. లూదియ దైవజనులను తెలిసి ఆతిధ్యమిచ్చుటకు ఆహ్వానించినది. ప్రభువును ప్రేమించి విశ్వసించి నవారు ప్రభువు సేవకులకు ఆతిధ్యమిస్తారు. లేకపోతే ప్రభువే ఇలా చెప్పారు. 'వారు మిమ్మును చేర్చుకోకపోతే మీ పాద ధూళి ఆ యింటి, ఆ గ్రామములో దులపండి' అని (అ.కా. 13:50) గనుక సేవకులంటే మనకు భారము కాకూడదు. వారిని ఆహ్వానించా లి,పోషించాలి, ఆదరించాలి, సహాయం చేయాలి. ఇది వాక్యాను సారం అయితే దొంగ సేవకులు లేకపోలేదు. బహుపరాక్. లూదియ బలవంతము చేసింది. అనగా వేషధారణ లేదు; పైపైకి అడగలేదుగాని, నిజంగా సేవకులను ప్రేమించి ఆహ్వానించింది. ఇందులో ప్రేమ, సహవాసమే ప్రధానము. మనము ఆయనను నమ్మాలి. తన నమ్మకత్వం, విశ్వాసము,ప్రేమ లూదియ వలె క్రియలతో చూపించాలి.

ప్రియులారా! లూదియ గురించి బైబిల్‌లో రెండేరెండు ప్రవచనాల్లో వ్రాయ బడింది. కానీ ఆమె జీవితం నుండి నేర్చుకో వలసినది ఈ వాక్యములో మనము చూశాము. మన జీవితం చిన్నదైన, పెద్దదైన విశ్వాసులము గ బాప్తీస్మము తీసుకున్న వారముగ మనపనులు మనము చేసుకుంటు ప్రభువైన యేసుక్రీస్తుకు, ఆయన సేవకులకు, సంఘానికి ప్రయోజకులుగ ఉందుము గాక! లూదియ వలె మనము మంచి అడుగుజాడలు (foot prints) ఈ లోకములో మాదిరి కోసం ఉంచుదుము గాక! మన తరువాతి తరము వారు మన జీవితాల ద్వారా హెచ్చరిక పొందుదురు గాక! ★

# మరణమే ముగింపా?



ప్రకృతే చెబుతుంది సాక్ష్యం,
ఈ చావు బతుకుల రహస్యం
ఒకనాడు చచ్చిన విత్తనం,
కాలేదా మహా వృక్షం
చనిపోయాక పాకే గొంగళి,
కాలేదా ఎగిరే రంగేళీ
చనిపోయాకే ఆరంభమౌతుంది,
అసలైన జీవితం
అందుకు సిద్ధపడుటేగా,
నీ జీవిత పరమార్ధం
చెట్టుగా బ్రతకడానికే,
విత్తన పుట్టుకకు కారణం
శీతాకోక చిలుకగా మారడమే,
గొంగళి జీవిత లక్ష్యం
చచ్చేది పై విత్తనమే గాని,
లోని జీవం కాదుగా!
చావు శరీరానికే గాని,
ఆత్మకు లేదుగా!
చనిపోవడమంటే వెళ్లడమే,
మానవ జీవితం పయనమే,
శరీరం  ఆత్మకు కవచమే,
భూమ్మీద బ్రతుకు పోరాటమే,
గెలిచి చస్తే స్వర్గమే,
ఓడి చస్తే నరకమే
చావుకు ముందు పోరాటం,
చావు తరువాత ఫలితార్ధం
కానే కాదు మనిషికి మరణం ముగింపు,
మరోలోక పయనానికి
వీడ్కోలు పలకరింపు
మోక్ష మార్గ పయనమే
ప్రతి మనిషికి క్షేమం
యేసుక్రీస్తు మాటలే
చేర్చు నిన్ను మోక్షం
మరెందుకు ఆలస్యం
స్వీకరించు క్రైస్తవ్యం
పయనించు పరలోకం

– వై.ఎస్. ఆర్. అరోరా

## అవినీతి జెండాలు

– తాళ్ళూరి ప్రసాద్



దేశం నిండా
అవినీతి జెండాలే
గాలి కూడా
లంచమిచ్చిన వాడివైపే వీస్తుంది
ఆదివారం చర్చీల్లో
ముందువరుస కుర్చీల్లో
డంబాలుపోయినాడంబరం కూడా
ఆఫీసు గుమస్తాల ముందు
అప్రయత్నంగా లొంగిపోతుంది.
ప్రజాస్వామ్యం కదా!
ప్రజలకూ ప్రభుత్వానికీ
తేడా లేదు
అంతా అరాచకమే!
దారితప్పటమే ధర్మంగా భాసిల్లే రాజ్యంలో
నీతి నియమాల బ్రతుకు నేరమై బోనెక్కుతోంది
న్యాయాన్ని వెదుక్కుంటూ
నిజాయితీగా నిలదొక్కుకుంటూ
ప్రవాహానికి ఎదురీదే
పరాక్రమశాలురు మాత్రం కొందరే
వారికి తెలుసు
అంతిమ విజయం అవినీతిదికాదని!

# 'ఉత్తమ ఉపాధ్యాయిని' జాల మంగమ్మ (1909-1974)

**దళిత జాతి ఉద్ధరణకు కలలుగని కృషి చేసిన వారిలో జాల మంగమ్మ ముఖ్యురాలు. 1909లో తాడేపల్లి నరసింహం, వెంకమ్మలకు జన్మించింది. పదవ తరగతి వరకూ చదివి, టీచరు ట్రైనింగ్ రాజమండ్రి లోని, 'ఫాదే' స్కూలులో పూర్తి చేసుకుంది. 1923లో జాలా రంగస్వామితో వివాహం జరిగింది. అప్పటికే రంగస్వామి, జాతీయోద్యమంలోనూ, అంటరాని తనం నిర్మూలనా ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొనేవాడు. మంగమ్మ విద్యావంతురాలుగా, నాయకురాలు గా దేశాన్ని విముక్తి చేయడానికి జీవితాన్ని అంకితం చేసింది.**



జాతీయస్థాయి సమస్యల నుండి స్థానిక సమస్యల వరకూ అన్నింటినీ సులువుగా అవగాహన చేసుకొని వెంటనే స్పందించేది. అనేక మార్లు ఉద్యమ ప్రచారాలలో, రంగ స్వామితో కలిసి విస్తృతంగా పర్యటించింది. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో, వందలాది గ్రామాల్లో వీరి ఉద్యమ కార్య క్రమాలు కొనసాగాయి. 'ముఖ్యంగా గ్రామం లోని అన్ని కులాల ప్రజలను చైతన్యవంతులను చేసి, ప్రజలలో సమానత్వంను సాధించటం ద్వారా స్వాతంత్ర్యోద్యమానికి తోడ్పడాల'ని ఈమె ఆకాంక్ష.

గ్రామాలలో సభలను ఏర్పాటుచేసి అస్పృశ్యతా నివారణ ఆవశ్యక తను వివరించేది. మాల, మాదిగల కార్మికుల వేతనాలు పెంచాలని అనేక సమ్మెలు నిర్వ హించింది. ముఖ్యంగా రాజమండ్రి కంబాల పేటలోని మాల, మాదిగలకు చదువు నేర్పించింది. పగలంతా పాఠశాలలో ప్రధానోపాధ్యా యురాలిగా ఉద్యోగం చేసి సాయంత్రం మాల, మాదిగ పల్లెల్లో స్త్రీలను కూడగట్టి చదువు చెప్పి రాజకీయ తరగతులను నిర్వహించేది.

ఈ నేపథ్యంలోనే **హరిజన మహిళా సంఘము** ను స్థాపించి వారికి 100 రాట్నాలు ఇచ్చి నూలు వడికించి వారికి ఉపాధిని కలుగ జేసింది. అంటరానితనం నిర్మూలనకూ, మాల మాదిగల అభ్యుదయానికి విద్య అవశ్య కతను గుర్తించి రంగస్వామితో కలిసి హరిజన బాల, బాలికల హాస్టళ్లను నెలకొల్పింది. వీరి స్వంత ఖర్చులపై హాస్టళ్లను నడపడం వలన ఆర్థికంగా దెబ్బ తినటం జరిగినది. 1928-31 వరకూ నడిపినప్పటికిని అప్పుల పాలవటం వలన దానిని ముందుకు తీసుకొని పోలేకపోయారు. తనకు గల పదిమంది సంతానంతోపాటు అనేక మంది బాల బాలికలను చేరదీసి విద్య చెప్పించింది.

ఒక సందర్భంలో ఆధిపత్య వర్ణాల భయం వలన, దళితేతర కులాలయిన మంగళ్ళు, మాల, మాదిగలకు క్షవరాలు చేయమని చెప్పినపుడు మాల, మాదిగ యువకులకు మంగలికత్తులు, కత్తెర్లను యిచ్చి, శిక్షణనిప్పించి మంగళ్ళ కొరతను తీర్చారు. వారు చేసే పనిలో బ్యాండు వాయిద్యం ఒకటి కావున కంబాల పేటలో ఆ వాయిద్యాలను కూడా కొని వాటి లోటు లేకుండా యువకులకు శిక్షణ నిప్పించారు. పశ్చిమ గోదావరి జిల్లా చాగల్లులో మహాత్మ గాంధీ స్థాపించిన ఆనంద నికేతన్ ఆశ్రమములో టీచరుగా పనిచేస్తూ, ఖద్దరునే ధరించండి, అంటుదోషము మానలేరా? అనే ప్రచారము చేస్తూ మూడేండ్లు గడిపినారు. ఈ క్రమంలో ఆధిపత్య కులాలను కూడా ఎదుర్కొన్నారని జాలమంగమ్మ, రంగ స్వామి స్వీయ చరిత్రలో రాసుకున్నారు. పాటలు, పద్యాలు, కావ్యాలు రాసి, కూర్చి ప్రచారం చేసామని కూడా **రాష్ట్ర హరిజన నాయకులు** అనే గ్రంథంలో రాసుకున్నారు. డా॥ రాజేంద్ర ప్రసాద్ మొదటి సారి రాజమండ్రికి వచ్చి నప్పుడు, మాల, మాదిగల తరపున ఈమె సన్మానం చేసింది. అందుకు ఫలితంగా బ్రిటీష్ పాలకుల ఉపాధ్యాయ వృత్తి నుండి తీసేసి నప్పుడు కుటుంబంలో ఆర్థిక సమస్యలు ఎక్కువై నప్పటికినీ బ్రిటీషు వాళ్ళతో సామరస్యం వహించలేదు. హరిజనాభివృద్ధిలో భాగంగా పోరంబోకు భూములలో హరిజనులు ఆహార ధాన్యాలు పండించవచ్చని, అప్పటి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను అనేక పల్లెల్లో అమలు జరపాలని పోరాటాలు సాగించింది. ''స్వాతంత్ర్య పోరాటంలో హరిజనులకు దేవాలయ ప్రవేశము, మద్యపాన నిషేధము ముఖ్యమైన అవసరాల"ని విస్తృతంగా ప్రచారం చేసింది.

**ఆది జనగ్రంథ మండలి** అనే ప్రచురణ సంస్థను స్థాపించి ముద్రణకు నోచుకోని గ్రంథాలెన్నింటినో ప్రచురించింది. ఈ గ్రంథ మండలి ద్వారా ప్రచురితమైన అనేక గేయాలు రాష్ట్రమంతా పాడుకున్నారు. నాటకాలను ఆంధ్రదేశమంతటా విజయ వంతంగా ప్రదర్శించారు.

**దున్నే వారిదే భూమి** వంటి ప్రముఖ సాంఘిక నాటకంతో పాటు, తొలి తెలుగు దళిత నవల అయిన **రైతు పిల్ల** అనే గ్రంథాలకు సంపాదకత్వం వహించి ప్రచు రించింది. 1935వ సంవత్సరములో చేతి రాతలతో **వీరభారతి** అనే పత్రికను నడిపింది. తోటి వారితో కలిసి "తాటి మువ్వలను విరచి, విదేశీ గుడ్డలను కాల్చి ఖద్దరు ధరించండి", అంటు

దోషమును మానమని ప్రచారం చేసింది. మంగమ్మ జీవితాంతము ఖద్దరు వస్త్రాలనే ధరించడం, రాట్నంతో నూలు వడకటం జీవిత లక్ష్యంగా ఆచరించింది.

1935లో బ్రిటీషు ప్రభుత్వం జాల మంగమ్మని, రంగస్వామిని అరెస్టు చేసి తణుకు, నర్సాపురం జైళ్ళల్లో ఉంచింది. మొదట డా॥బాబాసాహెబ్ అంబేద్కర్ రాజమండ్రికి వచ్చినప్పుడు ఆయనను సన్మానించిన వారిలో వీరిద్దరు ముఖ్యపాత్రను వహించారు. గాంధీ రాజమండ్రికి వచ్చినప్పుడు స్వయంగా రంగ స్వామి, మంగమ్మలచేత రాజమహేంద్ర వరంలో ని శ్రీరామమూర్తి అనే బ్రాహ్మణ సంఘ సంస్కర్త యింటిలోపల నూతి లో నుండి నీళ్ళను తోడించి అంటు దోషముల నిర్మూలనకు జరుపుతున్న వీరి కృషిని అభినందించాడు.

**రైతుపిల్ల నవలను** సమీక్షిస్తూ **వార్త** దినపత్రికలో జయధీర్ తిరుమలరావు రాసిన వ్యాసంలో ఈమెను మొదటి దళిత సంపాదకురాలని పేర్కొన్నాడు.కాంగ్రెసు చేపట్టిన ప్రతి ఉద్యమము లోనూ చురుకుగా పాల్గొంటూ బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పాల్గొన్నది.

కొన్నిసార్లు నాయకత్వం వహిం చింది. తన జీవితంలో కార్యకర్తగా, నాయకు రాలిగా, సంస్కర్తగా, రచయిత్రిగా, సంపాదకు రాలిగా, గాయకురాలిగా, ప్రధానోపా ధ్యాయు రాలిగా పని చేయడం కనిపిస్తుంది. జనమంచి కామేశ్వరరావు తన అను భవాన్ని "రాజమండ్రి ప్రాంతంలో ఏసభ జరిగినా ఈమె పాటతోనే ప్రారంభమ య్యేదని తరుచుగా వేదిక మీద కవితలు, నినాదాలు, పాటలురాసి చదివేదని చెప్పాడు. ఈమె చిన్నకొడుకు జాల నటరాజ్ మాటల్లో "నేను రాసిన కథలకు మొదటి సలహాదారు, పాఠకురాలు మా అమ్మే అని చెప్పడం గమనించాలి.

దళిత జాతి పునరుద్ధరణకు, అంట రానితనం నిర్మూలనకు తన జీవితాంతం నిరంత రం పోరాటం సల్పిన కార్యశీలి జాల మంగమ్మ. 1974వ సంవత్సరమున అక్టోబరులో 18వ తేదీన తన 65వ ఏట మరణించింది.

ఇంత చరిత్ర కలిగిన ఈమె స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర పుస్తకాలలో కనిపించదు. మాల, మాదిగల సాహిత్యంపై కొనిసాగుతున్న అస్పృశ్యత ఈమె రచనలను కనబడకుండా చేసింది.

★

# యేసు వెల ఎంత...?



- యేసు ప్రభువు జీవితంలో ఆయన త్యాగము, సేవ, క్రూర మరణము చరిత్రలో సాటిలేనిది. దీనికై ప్రభువు వెల చెల్లించెను.
- మానవుల కొరకై మరణించి రక్షించుటకు తన స్వంత ప్రియ సుతుని పంపుటకు తండ్రి వెల చెల్లించెను.
- అన్ని యుగములలో క్రైస్తవ హతసాక్షులు క్రీస్తు కొరకు వారి ప్రాణములనర్పించుటలో వారెంతో వెల చెల్లించిరి.
- శుభవార్త చాటుటలో మిషనరీలు ఎన్నో శ్రమలు పడి, సుఖములను విడచి, ప్రభువు రక్షణవార్త ప్రకటించుటకు ఎంతో వెల చెల్లించిరి. వాటిలో వారి భార్యబిడ్డలనే కోల్పోయిరి.
- ఆరంభ శిష్యులు, అపొస్తలులు ఆది సంఘములో చిత్రహింసలు, మరణమును ఎదుర్కొనినప్పుడు వెల చెల్లించిరి.
- జ్ఞానులు సుదూర ప్రయాణం చేసి, విలువైన కానుకలు, మారిన జీవితములు ప్రభువుకిచ్చినప్పుడు వెల చెల్లించిరి.
- కాపరులు వారి మందలను విడచి, పశువుల తొట్టె పిలుపుకు లోబడి, సువార్త ప్రకటించుటకు వెల చెల్లించిరి.
- క్రూరమైన హేరోదు ఆజ్ఞకు, పసిపిల్లలు వధించబడినప్పుడు తల్లులెంతో విలువ చెల్లించిరి.
- మరియ, యోసేపులు ఇంటి సుఖములు వదలి చిన్నబిడ్డతో ఐగుప్తుకు పోవలసి వచ్చినప్పుడు వారెంతో వెల చెల్లించిరి.
- ఇస్కరియోతుయూదా 'కొందరు విలువ కట్టిన క్రయ ధనము ముప్పది వెండి నాణెములు' గా క్రీస్తు విలువను ఎంచెను. (పరి. మత్తయి27:9)
- విశ్వసించిన వారికి యేసు అమూల్యమైనవాడు (1పేతురు 2:7). ఆయన రక్తము అమూల్యమైనది (1పేతురు 1:19)
- నీ ఆత్మను అమూల్యముగా ఎంచి సమస్తము శ్రమపొంది నీకప్పగించుకొనిన యేసు విలువ నీ దృష్టిలో ఎంత? ఉచితమా? అమ్ముకొన్నావా? లేక కొని సంపాదించుకొనుచున్నావా? ఆ ప్రభువుకే నీ జవాబు తెలుపుము.

– తంటిపూడి ప్రభాకరరావు

# ఆంధ్ర క్రైస్తవ కవి సార్వభౌముడు రెవ. పురుషోత్తమ చౌధరి విరచిత పద్యాలు, తాత్పర్యంతో సహా ప్రతినెలా....



రెవ. పురుషోత్తమ చౌధరి

## పద్యకావ్యము

**తే॥** ప్రియముగలచోట దోషంబు పెద్దదైన
కప్పి వేతురు నెయ్యంబుగాని చోట
కొంచెమైనను మరి దాని కొండజేతు
రివి మనుష్యుల నైజంబులెరిగి విడుమి.

## తాత్పర్యము

ప్రేమయున్నచోటను పెద్దదోషము కానవచ్చినను, దాని మూసివేయుదురు, అయితే ప్రియుడు లేనిచోటను చిన్నదోషము చూచినను, దాని కొండంతగా చేయుదురు. ఇవి మనుష్యుల స్వాభావిక గుణములని తెలిసి వీటిని విడిచిపెట్టుము.

**తే॥** ఒకరి తప్పు లరయ నూహించుటలు మాని
తన మనంబు లోని తప్పులెరిగి
తన్ను బోలె నెనరు మన్నింపు లొరునందు
గాంచు నతడె మంచి క్రైస్తవుండు

## తాత్పర్యము

ఇతరుల తప్పులు వెతకక తన తప్పులను తెలిసికొనుచు, ఇతరులయెడల తన యందువలెనే ప్రేమయును మన్నింపును కలిగిన యతడే మంచి క్రైస్తవుడు.

**చ॥** మనుజులు నీ సమానులు
సమాన యఘంబుల నిన్ను బోలె వ
ర్తనములు లేకయున్న పెర
తప్పులువారికి గల్గియుండు నీ
వొనరుచు పాపమెట్టిది
మహోన్నుతుడైన పరేశునాజ్ఞ గై
కొనమి గదా త్వదాత్మ కతి
ఘోరవిచారము క్రైస్తవోత్తమా

## తాత్పర్యము

ఉత్తమ క్రైస్తవుడా, ఇతర మనుష్యులు నీవంటివారు. ఏలననగా నీవు చేయునవి వారు చేయకపోయినను, ఇతర దోషములు వారియుందున్నవి. పాపమనగా నేమి? దేవుని ఆజ్ఞలను మీరుటయే పాపము. అదియే నీ యాత్మకు భయంకరమైన విచారము కలుగజేయునది.

*('క్రైస్తవ నీతి ప్రకాశము' నుండి)*

## స్వర్ణ పలుకులు

గుడి దగ్గర
బడి దగ్గర
పుట్టుక నుండి మరణం వరకు
అన్నిచోట్ల వివక్ష-

లేదుగా మరి
దళిత దేవుడు ఒక్కడైనా

**- సి.హెచ్.ఆల్బర్ట్**

బురద సులభంగా
అంటుకుంటుంది
వదిలించుకోవడం
చాలా కష్టం

వదలని జిడ్డు
వదంతి

**- ఆవుల జయప్రద**

ఓ పువ్వై
పరిమళించక
ఓ దివ్వై
చీకట్లు తొలగించక

ఎందుక్కాని మనిషై
ఎన్నాళ్లుంటేనేం?

**- డా॥ శిరీష**

ఆశ
మెట్లెక్కిస్తే
దురాశ
దిగ జారుస్తుంది-

వైకుంఠపాళి ఆట
జీవితం

**- యద్దనపూడి**

చిన్నప్పుడు పిల్లలు
అమ్మ నాదంటే నాదంటారు
పెద్దయ్యాక
అమ్మ బాధ్యత నీదంటే నీదంటారు

పెద్దవ్వడం అంటే
పతనమవడం కాదు

**- బండికల్లు జమదగ్ని**

రెవ యం.దేవిడ్ సత్యవర్ధనరావు

# స్వాతంత్ర్యాన్నిచ్చే క్రీస్తు

**"మీరు నా వాక్యమందు నిలిచిన వారై తే నిజముగా నాకు శిష్యులైయుండి సత్యమును గ్రహించెదరు. అప్పుడు సత్యము మిమ్ములను స్వతంత్రులను చేయును - యోహాను 8:32**



1947 సం॥లో ఆగష్టు 15వ తేదీన మన భారతదేశమునకు స్వాతంత్ర్యం వచ్చింది. బ్రిటిష్‌పాలన అంతమొందింది. మన ప్రజల ప్రజాస్వామ్య వ్యవస్థనే ఎన్నుకొన్నారు. దానికవసరమైన రాజ్యాంగమును, న్యాయ వ్యవస్థ ను నెలకొల్పుకున్నాము. ప్రతి వ్యక్తికి వ్యక్తిగత స్వాతం త్ర్యము, వాక్ స్వాతంత్ర్యం లభించాయి. అయితే ఈ స్వాతంత్ర్యములన్నీ అసంపూర్ణమైనవే, నిజమైన సంపూర్తి అయిన సర్వతోముఖ స్వాతంత్ర్యము యేసుక్రీస్తులోనే లభ్యము కాగలదు. ఒక్క మాటలో చెప్పాలంటే యేసు ప్రభువుకు సంపూర్ణంగా దాసులైన వారే నిజమైన స్వతంత్రులు. "నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నానని ప్రభువు సెలవిచ్చారు. సత్యము మిమ్ముల్ని స్వతంత్రులనుగా చేయునని కూడా ఆయనే తెలియజేసారు. కాబట్టి సాక్షాత్తు సత్యమైన యేసునందే వాస్తవమైన స్వాతంత్ర్యము లభించునని విశదమవుతుంది.

క్రీస్తు అను సత్యమును స్వీకరించి, ఆయన రక్తప్రోక్షణము ద్వారా పవిత్రపరచబడిన వారైతే అనగా క్రీస్తునందున్నవారైతే వారి మీద పాపము ప్రభుత్వము చేయదు గాన వారు నిజముగా స్వతంత్రులై యుందురు గాన ప్రియ చదువరి నీవు సంపూర్ణ వ్యక్తిగత ఆధ్యాత్మిక స్వాతంత్యాన్ని పొందినావా? లేక ఏపాపమైన నిన్ను ఏలుచున్నదా? క్రీస్తు (సత్యము) మాత్రమే నిన్ను స్వతంత్రునిగా చేయగలడు. అసత్యము నీకు దొరికినదా? ఎప్పుడు సత్యము తెలుసుకొని అంగీకరించి సత్యమును హత్తుకొందువో, సత్యమునకు లోబడుదవో అప్పుడు క్రొత్త సృష్టిగా మారి దేవుని బిడ్డవగుదువు.

**పాపపు దాస్యము నుండి విడుదల:**

లేవికాండము 26:13 "మీ కాడి పలుపులును తెరచి మిమ్ములను నిలువుగా నడవజేసితిని అని విమోచింపబడిన ఇశ్రాయేలీయులతో దేవుడు చెప్పుచున్నాడు. కాడి పలుపులు మెడ మీద నుండగా నడవలేరు. గాన పాపపు దాస్యపు కాడి క్రింద బంధింపబడిన నరుడు వంగిపోయి నడచుచున్నాడనియు ఆ బానిసత్వపు దురలవాట్లు కాడి పలుపువలె బంధించి వేసెనని గ్రహించుచున్నాము. అందుకే నీవు వంగిపోయినావు యిట్టి పరిస్థితిలో దేవాది దేవుడే మానవున్ని బంధించిన పాప బంధకముల నుండి త్రెంచి నీకు విడుదల ప్రసాదించాడు.

యిర్మియా 2:20లో ప్రియ స్నేహితుడా! నీవు క్రీస్తు బానిసత్వములోనికి వచ్చుట ద్వారా నీకాడి విరచి వేయబడినదా? నీవు పరిపూర్ణ స్వతంత్రుడవేనా?

**మానవ సంకల్పిత కట్ల నుండి విడుదల:**

మత్తయి 2:21లో "వాటిని విప్పి నా యొద్దకు తోలుకొని రండి." అని ప్రభువు సెలవిచ్చుచున్నాడు. గాడిదయు, గాడిద పిల్లయు కట్టబడి యుండగా ఆకట్లు విప్పి తోలుకొని రండని తన శిష్యులకు సెలవిచ్చు చున్నాడు. అవి విప్పబడని యెడల వాటికి విడుదల, స్వాతంత్ర్యము లేదుగదా! క్రీస్తు కొరకు వాహనముగా వాడబడలేవు. కట్లు అనగా మానవకల్పితములైన కట్టడములు. మానవులు తమ లౌకిక జ్ఞానముతో కొన్ని భయంకరమైన సిద్ధాంతములు, ఆచారములు కల్పించి దేవుని సమీపించకుండా బంధించి వారిని దేవునికి దూరంగా చేసిరి. తుదకు మానవునికి మానవున్నే దూరపర్చి దేవున్ని సమీపించకుండా బంధించిరి. ఈ దినాలలో కులకట్లు, జాతి కట్లు, రంగుకట్లు మొదలైన కట్లతో బంధించబడినాడు మానవుడు. ప్రియ చదువరి నీవు ఏ కట్లతో బంధించబడినావు? ఆచారాలు, లేక కులమనే


ఏ విద్యార్హత లేకపోయిన C.Th తో ప్రారంభించి D.D వరకు చేయు గొప్పసదవకాశము

**ది హెబ్రోన్ ఓపెన్ యూనివర్శిటీ**

**THE HEBRON OPEN UNIVERSITY**

(The Christian Research And Training Courses)
Govt.Regd. No. 138/06, (Autonomous), India and International USA)

**C.Th., B.Th., B.D., M.Div., M.Th., D.D., & PhD., inBible**

ఇంటివద్దనే వుండి ఎవరి పనులు వారు చేసుకుంటూ పోస్టుద్వారా చేయుటకు పైన సూచించిన (కరస్పాండెన్స్) కోర్సులు కలవు. ఏ బేధము లేకుండ వారి వారి విద్యార్హతను బట్టి ప్రతీ ఒక్కరు తక్కువ ఫీజులో చేయుటకు అనుకూలమైన బైబిల్ కోర్సులు కలవు. మరియు మేరేజి లైసెన్స్‌కు అప్లైచేసుకొనుటకు కావలసిన అర్హతకు"ఆర్డినేషన్ సర్టిఫికేట్" కావలసిన వారు మరియు పై కోర్సులు చేయదలచినవారు రూ.100/-లు యం.ఓ. ద్వార పంపి అప్లికేషన్ మరియు వివరాలు పొందవచ్చును.

**(127 దేశాలలో గుర్తింపు కలిగిన ఇంటర్‌నేషనల్ యూనివర్శిటి సంస్థ నుండి ఎఫిలియేషన్ కలిగియున్నది)**

వివరములకు మరియు అప్లికేషన్ పొందుటకు
**యం.డబ్ల్యు.జోబ్,** రిజిస్ట్రార్,
17-6-8/1, ఖాదర్ వీధి, పూర్ణనందంపేట, విజయవాడ-520003,
సెల్: **9848150167**

కట్లతో బంధించబడి యున్నావా? పరీక్షించు కొనుము.

**అపవాది కట్ల నుండి విడుదల:**

18 ఏళ్ళ నుండి బలహీనపర్చు దయ్యము పట్టి నడుము వంగిపోయిన ఒక స్త్రీ యేసు స్వామి సాన్నిధ్యములో ఆయన దయారస ప్రోక్షణాయుతమగు హస్తవిక్షేపణము ద్వారా స్వస్థత నొంది తిన్నగా నిలిచి దేవుని మహిమ పరచిన సందర్భములో ప్రభువు సెలవిచ్చినదేమి చూడండి. 18ఏళ్ళ నుండి సాతాను బంధించిన అబ్రహాము కుమార్తె అయిన ఈమెను విశ్రాంతి దినమందు ఈ కట్లనుండి విడిపింపతగదా? (లూకా 13:11-16) ఇంతకు ముందు మనము తలంచినట్లు అందరు చూడగలరు.

కాని ఈ కట్లు అందరికి కనబడవు గాన అవి అపవాది కట్లే. వాటిని ఒక్క ప్రభువే చూడగలరు., త్రెంచి వేయగలడు. పాప పాశాలతో బంధింపబడి శారీరకముగా ఆధ్యాత్మికముగా కృషించు వారిని విడిపించుటకే యేసుస్వామి ప్రత్యక్షమాయెను ఇట్టి స్వాతంత్ర్యము విడుదల నీకు దొరికినదా?

**దుర్నీతి బంధకముల నుండి విడుదల:**

సీమోను అను గారడివాడు దైవదాసులైన పేతురును యోహానులు విశ్వాసుల మీద చేతులుంచగా పరిశుద్ధాత్మను పొందుట చూచి అపోస్తలుల పొందిన ఆవరమును పొందనాపేక్షించినవాడై ద్రవ్యము తెచ్చి అపోస్తుల ముందు పెట్టి ఈ ద్రవ్యము తీసుకొని ఆవరము నాకు సంక్రమించునట్లు చేయుడని మనవి చేసెను. అందుకు పేతురు నీ ద్రవ్యము నీతో  కూడ నశించును గాక. నీహృదయం దేవుని యెదుట సరైనది కాదు గనుక కార్యములో నీకు పాలుపంపలు లేవనియు నీవు ఘోరమైన దుష్టత్వంలోను దుర్నీతి సంబంధమైన బంధకములలోను వున్నట్లుగా నాకు కనబడుచున్నదనియు చెప్పి మందలించెను (అపో॥కా॥ 8:13-18,33). ప్రియచదువరి నీవు అలాంటి సీమోనువై యున్నావా! దుర్నీతి సంబంధమైన బంధకముల నుండి త్రెంచి వేయ బడనిచో నీవు ఎట్లు స్వతంత్రుడవు కాగలవు?

**మరణపు కట్ల  నుండి విడుదల:**

క్రీస్తు వాక్కుచేత బ్రతికించబడిన లాజరు ప్రభువుతో నడుచుటకు, ప్రభువును చూచుటకు, ప్రభువు పరిచర్య చేయుటకు , ప్రభువుతో మాట్లాడి ప్రభువుని గూర్చి సాక్ష్యమిచ్చుటకు ప్రాప్తము లేదాయెను. కారణము అతని ముఖమునకు రుమాలు, అతని కాలు చేతులకు కట్లు కట్టబడియుండెను. ఇవే చావు కట్లు. బ్రతికించబడినను చావుకట్లు తొలగనందున ప్రభువు "మీరు అతని కట్లు విప్పి పోనియ్యుడని వారితో చెప్పెను." (యోహాను 11:43,44) నిజమే చాలామంది క్రీస్తు స్వరమువిని, వాక్యమువిని, బ్రతుకుచున్నారుగాని కట్లు అలాగే యుంటు న్నవి. ఎంతో విచారము. విశ్వాసము క్రియలు లేనిదైతే అది ఒంటరిగా నేయుండి మృతమైనదగును. జీవములేని శరీరము ఎలాగు మృతమో అలాగే క్రియలు లేని విశ్వాసము మృతము"(యాకోబు 2:17-20,26) అందుకే యేసు స్వామి అతని కట్లు విప్పి పోనియ్యుడి అనెను. ప్రియ విశ్వాసి నీవు బ్రతికి నావు సంతోషమే. క్రీస్తు వాక్యము నిన్ను బ్రతికించినది, మంచిదేగాని క్రీస్తును చూచుట, ఆయనతో మాట్లాడుట, ప్రార్థించుట ఆయన పరిచర్య చేయుట (క్రియలు) ఆయనతో నడుచుట (సహవాసం) యివి నీలో గోచరమగుచున్నవా లేని యెడల అవినీలో జరగకుండుటకు కారణమని గ్రహించుకో. ఏకట్లు అయినను నిర్మూలించ గల శక్తి మంతుడాయన. ఆయన కాడి క్రిందకు నీవు వచ్చి నిజమైన స్వాతంత్ర్యాన్ని అనుభవించుటకు దేవుడు నీకు సహాయము చేయును గాక. ★

కవిత

# వేరు పురుగు

**జీ**విత పోరాటంలో
గెలిచా ననుకుంటూనే
ఓడిపోయాను!
పుస్తకాలను చదివాను కానీ
మస్తకాలను
చదవలేకపోయాను!
ఓటమికి కారణం అదే!



అమ్మ కంటి తడికి
'ఆడది' అనే
ప్రతి స్త్రీ కంటి తడికి
అర్థం
ఒకటే ననుకున్నా!



మనుగడకు ఇరవై ఐదు పైసలు
మనిషి తనానికి
డెబ్బయ్ ఐదు పైసలు
ఖర్చు చేశా..!
'రూపాయి దాచుకోవటం
తెలియని వెర్రివాడని'
మనిషి హేళన చేస్తుంటే
సమాజం సమర్థించింది!

మంచితనమంటే చేతకాని తనమనే
నిర్వచనాన్ని
తెలుగు నిఘంటువులో
చేర్చాల్సిన అవసరత ఎంతైనా వుంది.
'మనీ సంబంధాలే
కానీ-
మానవ సంబంధాలేవ'ని
టాల్‌స్టాయ్ చెప్పేనాటికి
నేను ఈ భూమిపై జన్మించలేదు.

గుప్పెడు గుండెలో
కొండల మానవత్వాన్ని
నింపుకున్న ప్రేమకు
హెచ్.ఐ.వి.ను అంటగట్టే
మనిషి ఆలోచన తెగులుకు
ఎండోసల్ఫాన్ వాడాల్సిందే!
లేకుంటే
మనిషితనం అంతరిస్తుంది!

- రాపోలు పరమేశ్వరరావు

సురేష్ వంగూరి

# భారత స్వాతంత్ర్య పోరాటంలో క్రైస్తవులు



**భా**రత స్వాతంత్ర్య పోరాటంలో క్రైస్తవులు పాల్గొనలేదనే అపవాదు అడపాదడపా హిందూత్వవాదుల నోట వినబడుతోంది.

క్రైస్తవులు జాతి విద్రోహులనీ, వారి వలన దేశ అంతర్గత భద్రతకు ముప్పు వాటిల్లు తుందని ఎం.ఎస్.గోవాల్కర్ కొంతకాలం క్రిందట వ్యాఖ్యలు చేసిన సంగతి పాఠకులకు గుర్తుండే ఉంటుంది. మూడు దశాబ్దాలకుపైగా ఆర్ ఎస్ ఎస్ కు నాయకుడిగా ఉన్నవాడు అలా మాట్లాడటంలో ఆశ్చర్యమేమీ లేదు. క్రైస్తవులు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనకుండా దూరంగా ఉండినారనీ, అందుక్కారణం బ్రిటీష్ పాలకులదీ, వారిదీ ఒకే మతంకావటం వలన, ఆంగ్లేయుల పక్షం వహించారనీ గోవాల్కర్ 'బంచ్ ఆఫ్ థాట్స్' అనే తన రచనలో అభిప్రాయపడ్డాడు. ఇటువంటి అభిప్రాయాన్నే ప్రఖ్యాత బిజెపి నాయకుడు, మాజీ కేబినెట్ మంత్రి అరుణ్ శౌరి తన 'మిషనరీస్ ఇన్ ఇండియా'లో ప్రస్తావించాడు. వంద సంవత్సరాలుగా బ్రిటీష్ సామ్రాజ్యవాద ఆధిపత్యంతో మిషనరీ కార్యక్రమాలు విడదీయలేనంతగా పెనవేసుకు పోయాయనీ, మిషనరీలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనకపోవటం యాదృచ్ఛికం కానేకాదనీ, అది ఉద్దేశపూరితంగా జరిగిందని అరుణ్‌శౌరి మాత్రమే కాదు, ఇంకా చాలా మంది ఇటువంటి వ్యాఖ్యలు చేయడం విచారకరం.ఇది క్రైస్తవుల దేశభక్తిని బద్‌నాం చేయాలని కొందరు మతవాదులు పన్నిన కుటిల పన్నాగం.

క్రైస్తవ స్వాతంత్ర్యోద్యమ చరిత్రను మనం జాగ్రత్తగా పరిశీలిస్తే అది కేవలం వాస్తవాల్ని వక్రీకరించే ప్రయత్నమని స్పష్టంగా అర్థమవుతుంది. భారత స్వాతంత్ర్య పోరాటం చరిత్రను నిశితంగా అధ్యయనం చేసిన ప్రముఖ అంతర్జాతీయ తియోలాజియన్ ఫెలిక్స్ విల్‌ఫ్రెడ్ పలు ఆసక్తికర విషయాల్ని గ్రంథస్తం చేసాడు. ఆనాటి పరిస్థితుల్లో, మిషనరీలు సామాజిక, రాజకీయ విషయాల్లో నోరు మెదిపే వారు కారు. మతపరమైన విషయాల్లో తప్ప, ఇతర విషయాల్లో జోక్యం చేసుకునే వారుకారు. ఒకవేళ చేసినట్లయితే బ్రిటీష్ పాలకుల ఆగ్రహానికి గురవ్వాల్సి వస్తుంది. ఫలితంగా వారిని ఇండియా నుండి పంపించి వేసే ప్రమాదముంది. అటువంటి పరిస్థితుల్లో సైతం మిషనరీలు ఆంగ్లేయుల వలస పాలనను వ్యతిరేకిస్తూ స్వాతంత్ర్యోద్యమానికి తమ మద్దతు తెలిపారు. ఇది జీర్ణించుకోలేని బ్రిటీష్ ప్రభుత్వం కొందరు మిషనరీలను బలవంతంగా వారి దేశానికి వెనక్కి పంపివేయడం గమనార్హం. బ్రిటీష్ వలస పాలనను వ్యతిరేకించిన అనేక మంది మిషనరీల్లో స్టాన్లీ జోన్స్, ఛార్లెస్ ఎఫ్ ఆండ్రూస్, జె.సి. విన్‌స్లో, వరియర్ ఎల్విన్, రాల్ఫ్ రిచర్డ్ ఖేతాన్, ఎర్నెస్ట్ ఫారెస్టర్ పాటన్‌లు ప్రసిద్ధులు.

విదేశీయులైన మిషనరీలే స్వాతంత్ర్యోద్యమానికి ఇంతగా మద్దతిస్తే, భారతదేశంలో పుట్టి, పెరిగిన క్రైస్తవులు మాతృదేశం కోసం పోరాడకుండా ఎలా ఉంటారు? ఎంతో మంది క్రైస్తవులు స్వాతంత్ర్యో ద్యమంలో ముందు వరుసలో నిలిచి పోరాడారు. 1885లో ప్రారంభమైన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (INC) తొలిదశలో క్రైస్తవులు కీలకపాత్ర పోషించారు. ఉదాహరణకు, INC మూడవ వార్షికోత్సవ సదస్సులో 60మంది పాల్గొంటే అందులో 15మంది భారతీయ క్రైస్తవులున్నారు. నాటి సదస్సులో ఉపన్యసించిన వారిలో మధుసూదన్ దాస్ (1848-1934) కూడా ఒకరు. దాస్ 'ఉత్కల్ గౌరవ్'గా ప్రసిద్ధుడు. ఒరిస్సాకు చెందిన ప్రముఖ క్రైస్తవ నాయకుడు.

ఆ తర్వాత జరిగిన INC సదస్సుల్లో క్రమంగా క్రైస్తవుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అలా వచ్చి చేరిన వారిలో కాళీ చరణ్ బెనర్జీ (1847-1907)ఒకరు. ఆయన బెంగాలీ క్రైస్తవుడు. మంచి వక్త. INC వార్షిక సదస్సులో ఆయన ఉపన్యాసాలు తప్పనిసరి. జాతీయోద్యమ ప్రణాళికను రూపుదిద్దడంలో తన వంతు పాత్ర పోషించాడు. 1889లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న పదిమంది మహిళా ప్రతినిధుల్లో ముగ్గురు క్రైస్తవులే. వారు పండిత రమాబాయి సరస్వతి, ట్రయండక్, నికంబె.

1920 నుండి క్రైస్తవ సంస్థలు బాహాటంగా జాతీయోద్యమానికి పిలుపు నిచ్చాయి. ఆలిండియా కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియన్ క్రిస్టియన్స్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, యునైటెడ్ తియోలాజికల్ కాలేజ్ (బెంగుళూరు), సిరంపూర్ కాలేజ్ (బెంగాల్), సెయింట్ పాల్స్ కాలేజ్ (బెంగాల్) మలబార్ క్రిస్టియన్ కాలేజ్ (కేరళ), యూత్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ యాక్షన్ (కేరళ) మున్నగు క్రైస్తవ సంస్థలు జాతీయోద్యమానికి తమ పూర్తి మద్దతు ప్రకటించాయి. స్టూడెంట్ క్రిస్టియన్ మూవ్ మెంట్ ఆఫ్ ఇండియా, ఇండియన్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్, ఇంకా మరి కొన్ని సంస్థలు బహిరంగంగా ఒక సమావేశాన్ని ఏర్పాటుచేసి, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనాలని ఒక తీర్మానాన్ని ప్రతిపాదించాయి.

కొందరు యోధులు ఈ నేపథ్యంలో భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించిన కొందరు భారతీయ క్రైస్తవ యోధుల గురించి తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

జె.సి.కుమారప్ప అసలు పేరు జాన్ జేసుదాసన్ కార్నేలియన్ (1892-1960) ఆరితేరిన కాంగ్రెస్ నాయకుడు. ఓహియో వెస్లేయన్ యూనివర్సిటీ, బోస్టన్ యూనివర్సిటీ, హార్వర్డ్ మరియు కొలంబియా యూనివర్సిటీల్లో చదువుకున్నాడు. కొంతకాలంపాటు లక్నో యూనివర్సిటీ లో ఫిలాసఫీ ప్రొఫెసర్గా పనిచేసాడు. 1929, మే9వ తేదీన సబర్మతీ ఆశ్రమంలో మహాత్మా గాంధీని కలుసుకున్నాడు. ఆ తర్వాత వారిద్దరూ అత్యంత సన్నిహితులయ్యారు. 1931లో దండియాత్ర ప్రారంభించడానికి ముందు గాంధీ తన 'యంగ్ ఇండియా' పత్రిక సంపాదకత్వ బాధ్యతను కుమారప్పకు అప్పగించి వెళ్లాడు. పత్రికలో తాను రాసిన సంపాదకీయాల వలన కుమారప్ప సంవత్సరమున్నర పాటు జైల్లో గడపాల్సి వచ్చింది. ఎడిటర్గా బాధ్యత తీసుకున్నాడు. ఫలితంగా మరో రెండున్నర సంవత్సరాలు నాసిక్ జైల్కి వెళ్లాల్సి వచ్చింది. 1942 'క్విట్ ఇండియా మూవ్మెంట్' లో భాగంగా కొందరు కాంగ్రెస్ మిత్రులతో కలిసి, అజ్ఞాతంగా ఉంటూ, బొంబాయిలో అతను జరిగించిన కార్యకలాపాలకు అరెస్ట్ చేయబడ్డాడు. 1945 వరకు జబుల్పూర్ సెంట్రల్ జైల్లో ఉన్నాడు. 1947లో ఆలిండియా కాంగ్రెస్ వర్కింగ్ కమిటిలో సభ్యునిగా, జయప్రకాష్ నారాయణ తర్వాత తనకు అవకాశం వచ్చింది. గాంధీజీ ఎంత బలవంతం చేసినప్పటికీ ఆయన ఆ అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించాడు. పాల్ రామస్వామి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మరో ముఖ్య క్రైస్తవుడు. 1930లో ఉప్పుసత్యాగ్రహం రోజుల్లో జాతీయోద్యమంలోకి అడుగుపెట్టాడు. తిరుచిరాపల్లిలోని బిషప్ హెర్బర్ కాలేజ్లో పికెటింగ్ చేసిన ఘనుడు. ఫలితంగా అరెస్టయ్యి, జైలుకు వెళ్లాడు. తిరుచిరాపల్లి, అలీపురం జైళ్లలో 6నెలల పాటు శిక్ష అనుభవించాడు.

బ్రహ్మబాంధవ్ ఉపాధ్యాయ (1861-1907) ఒక హైందవ - కేథలిక్ సాధువు. స్వదేశీ ఉద్యమంలో కీలకపాత్ర పోషించాడు. సహాయనిరాకరణోద్యమానికి ఊపిరిలూదిన ప్రముఖుల్లో ఉపాధ్యాయ ఒకడు. 1904లో 'సంధ్య' అనే జాతీయ పత్రికను స్థాపించాడు. ఆ పత్రిక అప్పట్లో ఒక పెద్ద సంచలనం. ఎందుకంటే స్వతంత్ర పోరాటం కోసం బాహాటంగా గళం విప్పిన ఏకైక పత్రిక అప్పట్లో అదే. జొవాకీమ్ ఆహ్వా (1907-1979) మరో అసాధారణ దేశభక్తుడు. మహాత్మాగాంధీ ఆదర్శాలకు విశేషంగా ఆకర్షితుడై విద్యార్థిగా ఉన్నప్పుడే ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నాడు. అనంతరం మంచి ఉద్యోగాన్ని వదులుకొని, స్వాతంత్ర్యోద్యమానికిపూర్తిగా అంకితమయ్యాడు. ఒక ఫోరం స్థాపించి, దాని ద్వారా స్వదేశీ భావాల్ని వ్యాపింపచేయడంలో విశేష ప్రతిభ కనబరిచాడు.

జార్జిజోసఫ్ (1887-1938) ఉన్నత సంపన్న కుటుంబానికి చెందినవాడు. మిడిల్ టెంపుల్, ఇంగ్లాడ్లో చదువు ముగించాక, మధురైలో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించాడు. తర్వాత అనీబీసెంట్ హోంరూల్ ఉద్యమానికి ఆకర్షితుడై, ఆమె వద్ద తర్ఫీదు పొందాడు. తమ సుఖాల్ని త్యాగం చేసి జాతీయోద్యమంలో పాల్గొన్న మొదటి తరం బారిస్టర్లలో జార్జి ఒకడు. సహాయనిరాకర



ణోద్యమం, విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నాడు. మోతీలాల్ నెహ్రూ ఆహ్వానం మేరకు తన ఫ్యాషన్ దుస్తుల్ని విడిచి చేనేత వస్త్రాలను ధరించటం ప్రారంభించాడు. 'ది ఇండిపెండెంట్' అనే అలహాబాద్ దిన పత్రికకు సంపాదకునిగా ఉంటూ చేసిన రచనల ఫలితంగా అలహాబాద్ జైలుకి వెళ్ళాడు. అనంతరం మహాత్మాగాంధీ వార పత్రిక 'యంగ్ ఇండియా'కు సంపాదకుడయ్యాడు. 1922లో జవహర్లాల్ నెహ్రూ, మహాదేవ్ దేశాయ్, పురుషోత్తందాస్ టాండన్, దేవదాస్ గాంధీ వంటి నాయకులతో కలిసి లక్నో జైలుకి వెళ్లాడు. జవహర్లాల్ నెహ్రూ తన ఆత్మకథలో జార్జి జోసఫ్ ప్రస్తావన తేవడం గమనార్హం. వీరే కాదు, ఇంకా ఎందరో భారతక్రైస్తవులు స్వరాజ్యపోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించారు.మచ్చుకి కొన్ని పేర్లు ......వెంకళ్ చెక్కరాయ్, కె.టి.పాల్, బిషప్ నీరద్ విశ్వాస్, దేవరతుండియల్ టైటస్, టి.ఎం, వర్గీస్, ఎ.జె.జాన్, అక్కమ్మ చెరియన్, ఫిలప్పోస్ జాన్, వయొలెట్ ఆల్వా, మారల్ డిసౌజా, సామ్యూల్ ఆరోన్, గ్రేసీ ఆరోన్, మార్గరేట్ పావమణి, మేరీతామస్, మెటిల్డా కాల్టన్...ఇంకా వెలుగులోకి రాని ఎందరో! క్రైస్తవులు ఆంగ్లేయుల పక్షపాతులు అనే వ్యాఖ్య ఒట్టి అబద్ధం. మతం ఒకటైనంత మాత్రాన దేశానికి ద్రోహం చేస్తావనడం మూర్ఖత్వం. దేశం పట్ల, ప్రభుత్వం పట్ల క్రైస్తవ వైఖరి ఏమిటో, ఎలా ఉండాలో కొత్త నిబంధన లేఖనా లు విస్పష్టంగా చెబుతున్నాయి. వాక్యాన్ని అలక్ష్యం చేస్తూ మతఛాందస భావాల్ని అంటి పెట్టుకునే ధోరణి క్రైస్తవ విశ్వాసానికి పూర్తి వ్యతిరేకం. మతం కోసం దేశాన్ని అగ్ని కాష్టంగా మార్చుతోంది. ఎవరో విజ్ఞులైన పాఠకులకు ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.

స్వాప్నికా రాజ్ఞి

# 'చర్చిలో మిర్చి' అను

# సామాన్యుడి గోడు

ఇప్పుడు వాస్తు పిచ్చి క్రైస్తవుల్లో కూడా ప్రవేశించినట్టుగానే ఉంది. ఇల్లు కట్టేటప్పుడు దైవజనుణ్ణో లేక పాస్టర్నో పిలిచి ప్రార్థనైతే చేయిస్తారు కాని ఆ వెంటే ఓ సిద్ధాంతినో మరో వాస్తు ఎక్స్‌పర్టునో పిలిచి లేదా సలహా తీసుకుని ఏ మూలలో ఏం ఉండాలో ఏం ఉండకూడదో ఆరా తీయడం పరిపాటై పోతోంది.

అదేమంటే పాత నిబంధనలోని ప్రత్యక్ష గుడారము దాని పరికరాల తాలూకూ కొలతల్ని వివరాల్ని ఏకరువు పెడతారు. దాన్ని ఓ సపోర్టుగా తీసుకుని ఏదో పిచ్చి వాదన మొదలెడతారు. ఏదో లిటిగేషన్ లేకుంటే ఏది ఏ దిక్కున వుంచాలో దేని కొలతలు ఎలా ఉండాలో అంత స్పష్టంగా దేవుడు ఎందుకు చెప్పినట్టు అంటారు. ఇదంతా తమ వాదనకు సపోర్టును వెదుక్కోవడమే తప్ప మరొకటి కాదు.

ఆగ్నేయంలో పలానా, ఈశాన్యం మరేదో వుండకూడదంటూ వాస్తు సిద్ధాంతులు చెప్పింది విని కట్టింది పడగొట్టే శాస్త్రీలు లేకపోలేదు. ఆగ్నేయంలో పలానా గది కట్టేసుకున్నావు అంచేత నేను నిన్ను కాపాడ లేను. అని దేవుడంటే ఆయన దేవుడెలా అవుతాడు?! మన నివాసం తాలూకూ నిర్మాణాన్ని బట్టి మాత్రమే దేవుడు కాపాడతాడని, వృద్ధిలోకి తెస్తాడని అనుకోవడం హాస్యాస్పదం. ఆ మూలలో దాన్ని ఈ మూల మరి దేన్నో ఉంచడం వల్లే మన యింట్లో అనర్థాలు జరుగుతున్నాయని విచారపడిపోవడం విశ్వాసుల లక్షణం అవుతుందా?

"నేను ఆకాశమున కెక్కినను నీవు అక్కడను ఉన్నావు. నేను పాతాళమందు పండుకొనినను నీవు అక్కడను ఉన్నావు" అంటూ కీర్తనా కారుడైన దావీదు ఎలుగెత్తి చాటు తున్నప్పుడు ఆయన లేని దెక్కడ?!

ప్రతి విశ్వాసి హృదయంలో, గృహంలో ప్రభువు సన్నిధి నిలిచి ఉన్నప్పుడు, ఈ మూలలు కోణాలు ఏం చేస్తాయి?!

ప్రభువు, ప్రభువే! విశ్వాసం విశ్వాసమే నండి! అది మామూలే! వాస్తు వాస్తే తప్పదు అనుకునే వాళ్ళను ఏం చేయాలి? వాళ్ళ మానాన వాళ్ళని వొదిలెయ్యడం తప్ప.

ఇక్కడో విచిత్రం చెప్పుకోవాలి. ఒక వాస్తు సిద్ధాంతి చెప్పింది మరొకరు వొప్పుకోరు మరి. అంతా ఒక్కలాగే ఉండాలి కదా అంటే మాట్లాడరు. అంతా గందరగోళం.

ఆ మధ్య కాలంలో ఒక బాబాగారు, ఆరోగ్యం చెడి, మరణించడానికి కారణం భవనం వాస్తు దోషం అని సిద్ధాంతీకరిస్తాడో సిద్ధాంతి. మనిషికి రోగం చావు రావా?!

మిగతా వాళ్ళ మాటేమో కాని క్రైస్తవులమైన మనం లోకం నుండి వేరై జీవించాలి కదా! మనం కూడా నిర్మాణపు భవనాల మీద ఛండాలపు దిష్టి బొమ్మలు పెడుతూ, కోళ్ళను, కుక్కల్ని కోస్తూ దిక్కుమాలిన శాంతులు చేస్తూ, పసుపు రాస్తూ వాస్తు గోలలో కొట్టుకు పోతుంటే మనం వాస్తవ క్రైస్తవులం ఎలా అవుతాం!?

ఫరో బలమైన చేతిలో నుండి ఇశ్రాయేలు ప్రజల్ని విడిపించిన దేవుడు, మనిషి స్వార్థంతో తన భక్తి కోసం కల్పించుకున్న దోషాలని చెబుతున్న వాటి నుండి తన ప్రజల్ని కాపాడలేడా?

అంచేత మనం ముందుగా ఆయన ప్రజలమో కాదో తేల్చుకోవాలి. చల్లగానో – వెచ్చగానో ఉండిపోవాలి. కల్పనా కథల నుండి వైదొలగాలి. ఇల్లయితే కట్టు కోవాల్సిందే అవి గాలీ, వెలుతురు వచ్చేలా వుంటే చాలు!

## హృదయాంజలి



స్తుతి స్తోత్రముల మీద
ఆసీనుడవు నీవు
నీ రథములె సహస్రములు సహస్రసహస్రములు
హంసతూలికా తల్పములెందుకు ప్రభూ నీకు?
వేయికొండల మీద
పశువులన్నియునీవే
నీవు ఊపిరి విడువగ ఆకాశములకె సౌందర్యమిత్తువు
ఎక్కడకొలువ తీరమని
నిన్నడగాలి ప్రభూ?
అడవిలోన వనవృక్షములన్నియు నీకె వందనమనగా
పూలపల్లకీ లెందుకు ప్రభూ! నీకు?
ఏ పరిమళగంధ వర్గములతో ధూపమేయగలను ప్రభూ నీకు?
నదులన్నియు నీకె చప్పట్లు చరచగా
ఏ తీర్థము దెచ్చి నిన్ను తృప్తి పరచగలను ప్రభూ నిన్ను?
నీ తేజమె చీకటిని పారద్రోలగ
ఏ దీపపు కాంతి నిను చేరగలదు ప్రభూ?
అందులకే నేమో నన్ను నీదరి జేర
విరిగి నలిగిన హృదయ మిమ్మని వాంఛించావా ప్రభూ!
విరిగినలిగిన హృదయమును నీవు అలక్ష్యము చేయవు
గొప్పదేవా! చేకొనుమిదె నా హృదయాంజలి.

– శ్రీమతి డి. వివేకవతి.జో

విశ్లేషణ

# వాక్య లోతుల్లోకి...



గేరా దినకర్ ప్రభు

బైబిల్లో పరస్పర విరుద్ధ వాక్యాలున్నాయని కొందరు ఎత్తి చూపగా, వాటిలో కొన్నిటిని గతంలో సమర్ధవంతంగా విశ్లేషించాము. సంపూర్ణ అవగాహన లేకున్నా ఇలాటి విషయాలను కొందరు బైటికి తెచ్చినందుకు దేవునికే స్తుతులు. ఆనాటి భాష, వ్యాకరణం, అలంకారాలు, పద ప్రయోగాలు మనకు అర్ధంకావు. ఆదికాండం 24:9లో అబ్రహాము తొడ కింద చేయిపెట్టి, అతని దాసుడు ప్రమాణం చేశాడు. ఉజ్జీయేలు కుమారుడు యోనాతాను రాసిన యెరూషలేము మార్గంలో దీనికి కొంత వివరణ లభిస్తుంది. తొడ కింది భాగం సున్నతికి సూచన. కనుక ఈ ప్రమాణం దేవుని నిబంధనకు తోడని అర్ధం. రూతు (4:7) ను విమోచించాలంటే ఆమె సమీప బంధువు ముందుకు రావాలి. అతనికి సమ్మతం లేనపుడు, తన కాలిచెప్పు విప్పి, తన హక్కును వదులుకోవాలి. ఈ ప్రకారం దూరపు బంధువు, బెత్లెహేమీయుడు, యూదాగోత్రికుడు – బోయజు రూతును పెళ్లి చేసుకున్నాడు. ఇలాంటి సంప్రదాయాలు,



వ్యవహారాలు దైవ గ్రంథంలో ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు మరికొన్ని వాక్యాలను వివరించే ప్రయత్నం చేద్దాం.

1. యెరూషలేముకు యేసు గాడిదపై వచ్చినట్లు మార్కు 11:7, లూకా 19:35 చెప్తుండగా, గాడిద పిల్ల అని మత్తయి 21:7లో రాశారు. నాలుగు సువార్తలలోను ఈ ప్రస్తావన ఉండగా, పై ప్రశ్నలో యోహాను 21:15ను ఉదహరించలేదేమి? రెండు గాడిదలపై ఎవడును ప్రయాణించడు. జెకర్యా 9:9 ప్రవచనాన్ని మత్తయి రాశాడు. ప్రాచీన హిబ్రూ కవిత్వంలో గాడిద, గాడిదపిల్ల అని ఒకే విషయాన్ని రెండు మార్లు పలకడం పద్యానికి శోభనిస్తుంది. మత్తయి తన కళ్ళతో చూచిన దాన్నే మనకు చెప్తున్నాడు. ఎవరూ స్వారి చేయని గాడిద పిల్ల, తల్లి లేకుంటే కంగారుపడి గంతులేస్తుంది. తల్లి తన ముందు నడుస్తుండగా, అది ప్రభువును మోస్తూ ముందుకు సాగింది.

2. యేసే క్రీస్తని పేతురుకు ఎలా తెలిసింది? పరలోకపు తండ్రి తెలియజేశాడని మత్తయి 16:17లో యేసు చెప్తుండగా, అతడి సోదరుడు అంద్రెయ చెప్పినట్లు యోహాను 1:41లో రాశారు. ఈ రెండూ సత్యాలే. యేసు అడిగిన ప్రశ్న – నీ కెవరు చెప్పారని కాదు. నేనెవరినని మీరు చెప్పు కుంటున్నారని, అందుకు పేతురు తడుము కోకుండా జవాబిచ్చాడు.

3. అంద్రెయ, సీమోనులను యేసు గలిలయ తీరంలో కనుగొన్నట్లు మత్తయి 4:18 చెప్తుండగా, యోర్దాను తీరంలో అని యోహాను 1:37లో రాశారు. యోహాను రాసిన విధంగా వారిద్దరు మొదట స్నానికుడుయోహాను శిష్యులు, యేసు దేవుని గొర్రెపిల్ల అని తెలిసికొని ఆయన్ను వెంబడించారు. బేత్సయిదాలో పుట్టి పెరిగిన వీరు కపెర్నహూములో స్థిరపడ్డారు. మత్తయి 8:5,14. మార్కు 1:21,29. లూకా 4:31,38. ఈ ప్రకారం గలిలయ తీరంలో వారు చేపలు పడుతుండగా,యేసు– నన్నువెంబడించమన్నాడు. ఇంతకు ముందు ఆయన వారిని అడుగలేదు. ఐనా వారు ఆయన తోనే ఉన్నారు. యేసు ప్రవర్తన, బోధలు, క్రియలు చూచి, వారు తమ సమస్తాన్ని విడిచిపెట్టారు. అంతేగాని, ఒక మనిషి వచ్చి, నా వెంట రండి అనగానే వారు ఆయన వెంట వెళ్ళే చిన్న పిల్లలు కారు. ప్రవక్తలు చెప్పిన మెస్సీయాను పరిశీలించి వారు తెలిసికొన్నారు.

4. యేసు యాయీరును కలిసినపుడు అతని కుమార్తె చనిపోయిందని మత్తయి 9:18 చెప్తుండగా, చావనై యుందని మార్కు 5:23లో రాశారు. యాయీరు బయల్దేరినపుడు, చిన్నది అనారోగ్య కారణంగా, బాధపడుతున్నది. చావలేదు గనుకనే, యేసు కొరకు అతడు బయల్దేరాడు. తన కుమార్తె ప్రాణాపాయ స్థితిలో ఉందని అతనికి తెలియును. మత్తయి మరణం గురించి రాయగా, మార్కు వ్యాధి గురించి రాశాడు.

5. చేతికర్రను కూడా తీసుకెళ్ల వద్దని మత్తయి 10:9, లూకా 9:3 చెప్తుండగా, చేతి కర్రను తీసుకెళ్లమని మార్కు 6:8లో రాశారు. సువార్తికులు విరుద్ధవాక్యాలు రాసినట్లు అభియోగం. ఇది అనువాదికుల తప్పు. మత్తయి రాసిన విషయాన్ని – మీకున్న దానికంటే ఎక్కువ కొనవద్దు, ఎలా వుంటే అలాగే వెళ్ళండి అని చదవాలి. మత్తయి (10), మార్కు (6) ఇద్దరూ – మీకొరకు అదనంగా ఏమీ తీసుకెళ్ల వద్దు అంటున్నారు. లూకా కూడా దీన్ని ఒప్పుకొన్నాడు. మత్తయి – రెండు అంగీలు, చెప్పులు, చేతికర్ర వద్దని వివరించాడు.

6. మృతులలో నుండి లేచిన యోహానే యేసు అని హేరోదు చెప్పినట్లు మత్తయి 14:2, మార్కు 6:16 వివరిస్తుండగా, అతడెవరో అన్నట్లు లూకా 9:9లో రాశారు. ఇక్కడ సైతం విరుద్ధ సంగతులేమీ లేవు. యోహానును చంపించింది హేరోదే గనుక లూకా 9:9లో ఇతనెవరు

అని అతడిప్రశ్న. యేసు గురించి వివరంగా తెలిసికొన్న పిదప యేసు, యోహాను వేర్వేరు వ్యక్తులని గ్రహించాడు. యేసును చూచి ఎంతో సంతోషించాడు. లూకా 23:8.

7.యోహాను యేసును బాప్తిస్మానికి ముందే గుర్తించినట్లు మత్తయి 3:14 చెప్తుండగా, నీవేనా అని సందేహించినట్లు 11:2లో రాశారు. యోహాను 1:29-36లో యేసును యోహాను పరిచయం చేసినట్లు వివరంగా ఉన్నది. దాని తర్వాత జరిగిన మత్తయి 11:2లో రాశారు. ఈలోగా చాలా సంగతులు జరిగాయి. మత్తయి 3:11లో యేసు కార్యాలు వివరించాడు. పొట్టు నుండి గోధుమలను వేరు చేసినట్లు తీర్పు చెప్తాడన్నాడు. అది సత్యమే గాని నెరవేరేది రెండవ రాకడలో. ఇదిగో దేవుని గొర్రె పిల్ల అని వివరించినా, మెస్సీయా శత్రుసంహారం చేస్తాడని, కొత్త రాజ్యం స్థాపిస్తాడని ఎందరో పొరబడ్డారు. యుద్ధం మాటే ఆయన నోటివెంట రాలేదు. చెఱసాలలో మగ్గుతున్న యోహాను కూడా ఇదే విధంగా భ్రమించాడు. యెషయా 29:18, 35:5, 61:1 వారికి వెంటనే స్ఫురించవు. యోహాను సాధారణ మానవుని వలెనే ప్రవర్తించాడు. వారి స్వభావాలను బైబిల్ ఉన్నదున్నట్లే వివరించింది.

8.యేసు తనగురించి సాక్ష్యం చెప్తే అది అసత్యమని యోహాను 5:31లో చెప్తుండగా, అది సత్యమేనని 8:14లో రాశారు. ఔను నిజమే అయితే ఈ సందర్భాలు వేరు. యెహోవా వాక్యాను సారమే తాను పనిచేస్తున్నానని, ప్రవక్తల లేఖనాలు నెరవేరుతున్నాయని యోహాను 5లో యేసు వివరిస్తున్నాడు. కనుక తన గురించి తాను సాక్ష్యం చెప్పేపని లేదు. యోహాను 8:12లో నేనే లోకానికి వెలుగని ప్రకటించాడు. యెషయా 9:2, మలాకీ 4:2 నిరూపించాడు. ద్వితీ 19:15 ప్రకారం పరిసయ్యులు యేసు సాక్ష్యము సత్యము కాదన్నారు. యేసును వారెరుగరు. గనుకనే ఆయన తన సాక్ష్యం సత్యమేనని, తన తండ్రే తనకు సాక్ష్యం చెప్తున్నాడని 8:18లో వివరించాడు.

9.యూదా ముద్దుపెట్టి యేసును అప్పగించినట్లు మత్తయి 26:48 చెప్తుండగా, అతడు దూరంగా నిల్చున్నట్లు యోహాను 18:5లో రాశాడు. యోహాను సువార్తలో ముద్దు విషయం ప్రస్తావించనంత మాత్రాన, యూదా ముద్దు అబద్ధమవుతుందా? ఒక సువార్తికుడు ఒక విషయం రాస్తే, మరొకరు మరో సత్యాన్ని వివరిస్తారు.

10.తాను బాహాటంగానే మాట్లాడినట్లు యోహాను 18:20లో యేసు చెప్తుండగా, ఆయన ఉపమానరీతిగా మాట్లాడినట్లు మత్తయి 13:10లో రాశారు. మొదటగా, యేసు యూదు బోధకుడు, రబ్బీ, పరలోక విషయాలు ఉపమాన రీతిగా బోధించడం వలన, సామాన్యులకు కథ మాత్రమే తెలుస్తుంది. శిష్యులకు అందులోని మర్మం విశదమవుతుంది. యేసు దేవుని కుమారుడనే విషయం కొందరికే తెలుసు. రోమా 16:25-26. లేఖనాల ప్రవచనాలు ఈయన కొరకే. సామాన్యులు వింటారు గాని గ్రహింపరు. చూస్తారు గాని తెలిసికొనరు. మత్తయి 13:10,14.

11.దేవుడు పశ్చాత్తాప పడడు అని 1సమూ 15:29 చెప్తుండగా, పశ్చాత్తాప పడినట్లు 15:35లో, సంతాపం చెందినట్లు ఆది 6:7, నిర్గమ 32:14లో రాశారు. బెన్యామీను గోత్రికుడు సౌలు రాజుగా వర్ధిల్లాడని దేవునికి తెలియును. ప్రజల తొందరపాటు కోరిక ప్రకారం అనుమతించి, సౌలుతో గొప్ప కార్యాలు జరిగించాడు. ఈలోగా యూదా గోత్రపు దావీదు బాల్యం దాటి పెద్ద వాడగుతున్నాడు. సౌలు తప్పులు చేసి, దావీదుకు స్థానమిచ్చాడు. సౌలు గురించి దేవుడు పశ్చాత్తాపం (నిహమ్) చెందలేదు, చింతించాడు.

12.స్నానికుడు యోహాను (మత్తయి 11:14, 17:10) రాబోవు ప్రవక్త ఏలీయా (యోహాను 1:19)ఒకరేనా? మలాకీ 4:5లో - ప్రవక్తయగు ఏలీయాను మీ యొద్దకు పంపుదును అని దేవుని వాగ్దానం. కనుక యూదులు ఏలీయా మళ్లీ వస్తాడని ఎదురు చూస్తున్నారు. అందుకే యోహానును ఈ ప్రశ్న అడిగారు. లేవీ గోత్రపు జెకర్యా ఏకైక సంతానం యోహాను - నేను కానన్నాడు. యోహాను 1:21. ఏలీయా ఆకాశంలోనికి ఎక్కివెళ్లి 878 యేళ్లు గడిచాయి. ఏలీయా ఆత్మ, శక్తినిండిన యోహాను పుడతాడని గాబ్రియేలు దూత జెకర్యాకు తెలియ జేశాడు. లూకా 1:17. అతడే ఏలీయా అని చెప్పలేదుగాని యెషయా 40:3, మలాకీ 4:5ను గుర్తు చేశాడు. ఇలాటి వాగ్దానం ద్వితీ 18:18లో కూడా ఉన్నది. మోషే, ఏలియాల కంటె యోహాను గొప్పవాడని యేసు ప్రశంసించాడు. కారణం, అతడు స్వయంగా మెసీయాను ప్రకటించాడు, చూశాడు, బాప్తిస్మమిచ్చాడు. మెసీయాకంటె ముందే శ్రమలొంది, మృతి చెందాడు.

13.సిలువపై యేసు ప్రాణం విడిచిన తర్వాత దేవాలయ తెర చిరిగినట్లు మత్తయి 27:51 చెప్తుండగా, తెర చిరిగిన తర్వాత ఆయన ప్రాణం విడిచినట్లు లూకా 23:45లో రాశారు. మూడు సువార్తలలోను యేసు మృతికి దేవాలయ తెరకు సంబంధమున్నట్లు నిర్ధారించారు. "అపుడు" అనే పదం అన్ని చోట్లా కన్పిస్తుంది. నరునికి, దేవునికి మధ్య అడ్డు దేవాలయ తెర. అది తొలగితేనే మనం దేవునికి చేరువకాగలం. అది యేసు మృతితోనే సాధ్యం. ముందూ, వెనుకా అనే తర్జన భర్జన కంటె - రెండూ ఏకకాలం జరిగినా నష్టం లేదు - మానవ రక్షణ కార్యం జరిగిందనేది గంభీర సత్యం. దేవునికే స్తుతులు ఆమెన్. ★


**SWARNA DEEPIKA Add Tariff**

| | | |
|---|---|---|
| **Back Cover Colour Page** | -- | **Rs.10,000/-** |
| **Back Inside Colour Page** | -- | **Rs. 8,000/-** |
| **Front Inside Colour page** | -- | **Rs. 8,000/-** |
| **Full Page Black & White** | -- | **Rs.5,000/-** |
| **Half Page Black & White** | -- | **Rs.2,500/-** |
| **Yearly Subscrirption** | -- | **Rs. 200/-** |
| | | **25 $ (per foreign subscribers)** |
| **Lifetime Subscription** | -- | **Rs.2,000/-** |
| | | **200 $ (per foreign subscribers)** |

**SWARNA DEEPIKA, A/C. No. 1216888517,**
**IFSC CODE No CBI N 0282336**
**CENTRAL BANK OF INDIA, Mango Market Branch, VIJAYAWADA - 3**
**Contact: 91- 866-2578897, srisri032003@yahoo.com**

గేరా జీవరత్నం

# బైబిల్లో అ,ఆఆఆ......లు

నేర్చుకొనేది విద్య, విద్యార్థి పని. నేర్పించేది విద్య. అది ఉపాధ్యాయుని పని. నేర్చుకొంటూ నేర్పేది ఉత్తమ ఉపాధ్యాయుని లక్షణం. ఆయన ఎప్పుడు నేర్చుకొనే విద్యార్థే. యేసు సద్బోధకుడు. రబ్బూని అని సంబోధించారు. అది యూదుల చరిత్రలో బిరుదు. రబ్బూని అనగా బోధకుడని అర్థం. అది పండితులకు, ధర్మశాస్త్ర సంబంధిత బోధకులకు ఆశ్చర్యం కలిగించింది. సమాజంలో సామాన్య ప్రజల కెరుకైన మాటలు, ఉప్పు. గొఱ్ఱెలు, దీపం మొదలగు మాటలు. విత్తువాడు, తప్పిపోయిన కుమారుడు, మొదలగు ఉపమానములు, నిత్య సంఘటనలేకాక, సామాన్య విషయం నుండి లోతైన అర్థమిచ్చేవి, ఆత్మీయ సత్యాలు యేసు బోధించాడు. ఆయన బోధించినట్లు ఎవరూ బోధించలేరు. బంట్రౌతుల సాక్ష్యం.

'విద్య నిగూఢ గుప్తమగు విత్తము' అని భర్తృహరి చెప్పాడు. బైబిల్‌లో అన్నీ ఉన్నాయి. మానవునికి కావలసినవన్నీ ఉన్నాయి. ఐదవ తరగతి చదివే మనవరాలు "తాతగారికి ఏమి తెలియదంటుంది. కారణం ఆమెకు తెలిసినంత కంప్యూటర్ జ్ఞానం తాతగారికి తెలియదు. కంప్యూటర్ కీ బోర్డు మీద వ్రేళ్లు పెట్టి, స్క్రీన్ మీద చదువుకుంటూపోయే ఈ ఎలక్ట్రానిక్ యుగములో వంద సంవత్సరాల క్రితం, మన పితరులు ఎట్లు విద్య చెప్పింది మననం చేసికొనడం ఒకింత అవసరమనిపిస్తుంది. అది స్పూర్తిదాయకం కూడాను.

అక్షరాస్యత కరువుగా నున్న ఆ దినాల్లో - కూలి, నాలి చేసుకొనేవారిని, కార్మాగారములలో పనిచేయు కార్మికులను, పొలములో పనిచేసుకునే పామరులను సమాజం విస్మరించింది. వారికి చదువు చెప్పించి, సమాజంలో గౌరవస్థానం కలిగించాలని కొందరు తెలుగు గడ్డపై కృషిసల్పారు. ఈ సందర్భంలో డా॥ లాబక్ దొరగారి వయోజనవిద్య చార్టులు ప్రఖ్యాతి పొందాయి. గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారు వయోజనవిద్యలో కృషి చేసారు.

'విద్యాప్రదాత' గేరా ప్రేమయ్య గారు నిరక్షరాస్యులైన వయోజనులకు విద్యగరుపుట యందు ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఒకటవ, రెండవ, మూడవ వయోజన విద్యా వాచకములు వ్రాశారు. పొలములో, యితరత్రా పనిచేసే పామరులు వాడే వస్తువులు అరక, నాగలి, కాడి, పడవ, పలక' మొదలగు వస్తువులు బొమ్మలలో చూపి, వాటి క్రింద వ్రాయబడిన వాటి పేర్ల పదములు చదివించి, పలికించి, నేర్పించి వ్రాయించారు. 'ఆరువారాల్లో వయోజన విద్య' అనుమార్గదర్శి (గైడ్) పుస్తకము ప్రకారం అక్షర జ్ఞాన మెరుగని వారికీ విద్య నేర్పించి, ఆరువారాల్లో వారి ఉత్తరములు వారే చదువుట, వ్రాయుట, వార్తాపత్రికలు, బైబిలు చదువుట నేర్పించారు. గ్రామ ప్రజలకు, కార్మిక ప్రజలకు వారి వాడుక పదములతో గీతికలు వ్రాసి, పాడి, పాడించి ప్రోత్సహించేవారు. బుర్రకథలు వ్రాసి, వాటిని చెప్పించేవారు. ప్రేమయ్య గారి బుర్రకథల శిష్యబృందాలు యిప్పటికి కథలు చెప్పడం చూస్తాము.

వారు వాడిన కొన్ని పదములు వేదాంత దృష్టితో విశ్లేషిద్దాము.

అరక బోధ:- ఎలీషా - ఏల్ ఈ షా అనగా దేవుడే నా రక్షణ అని అర్థము. అరక పొలం దున్నడానికి వాడే పరికరం. ఎలీషా 12 అరకలు గల రైతు (రాజులు 19:19) ఒక అరకకు 25 ఎకరముల భూమి ఉండాలి. అంటే 12 అరకలకు 300 ఎకరముల భూమి ఉంటుంది. ఆయన భూస్వామి అని చెప్పవచ్చు. అంటే స్థితిమంతుడు, ఏలీయా ఎలీషా యొద్దకు వెళ్లినప్పుడు ఎలీషా 12వ అరక తోలుచున్నాడు. దేవుడు పనిచేసే వారిని పిలుస్తాడు. ఎలీషా ఏలియా వెంబడి వెళ్లి అతనికి గురు పరిచర్య చేసాడు. యేసుక్రీస్తు అతని గురించి ఎత్తి చెప్పెను (లూకా 4:26)

నాగలి బోధ:- యేసు నాగటిమీద చెయ్యిపెట్టి వెనుక తట్టుచూచు వాడెవడును దేవుని రాజ్యమునకు పాత్రుడు కాదని వానితో చెప్పెను (లూకా 9:62)

రైతు పొలం దున్నడానికి నాగలి ప్రాముఖ్య పరికరము. నాగలిని అరకకు కట్టి ఎద్దుల సహాయముతో రైతు పొలము దున్నును. నాగలి ప్రత్యేకముగా చేయబడును. క్రింది భాగము ముందుకు వంగి, పై భాగమును కొంచెము ముందుకు వంగి, ఆ భాగములో పిడి బిగింపబడి యుండును. నాగలి క్రింద చివర యిర్రు (ఒక సన్నపార) ముల్లువలె ఉండి, రైతు దానిని క్రిందకు అదిమి పట్టుకొనగా, అది నేలలో గ్రుచ్చుకొని, అరకముందుకు నడిపించుచుండగా, నేల దున్నబడును. రైతు ముందునకు దృష్టించి, నాగలి నేలను వరుసలో సాళ్లుగా దున్నబడునట్లు జాగ్రత్త వహించును. చాళ్ల వరుస సరిగా లేకపోయిన గింజలు చాళ్లలో పడవు. నీళ్లు పెట్టుటకు కష్టమగును. మరో విషయం - రైతు నాగలిని పట్టుకొనుటలో అశ్రద్ధగా ఉండి వెనుకకు దృష్టిమరల్చిన, నాగలి ప్రక్కకు



కవిత

# ఇక్కడ వసంతాలు లేవు

ఏముందిప్పుడు
మన స్వాతంత్ర్యాన్ని గురించి చెప్పడానికి
గతం గొప్పల మూట విప్పడానికి....?
అన్ని చోట్ల ఆగమించి
హరిత దనంతో ఆహ్లాదపరిచే ఆమని
ఆ గూడేల్లో కనిపించదు ఎందుకని....?

అంతటా కోకిల గానాలతో
ప్రకృతి పులకించి పోతుంది
అదిగో ఆ ఆఖరివాడ మాత్రం
ఆకలి శోకంతో కూనారిల్లుతుంది

ఏముందిప్పుడు
మన స్వాతంత్ర్యాన్ని గురించి చెప్పడానికి
వర్తమాన వాస్తవాల మూట విప్పడానికి...?
స్వాతంత్ర్యం
సగటు మనిషి నీకు దూరమా...?
ఉల్లి గడ్డలు కొందామంటే
వజ్రాల్లా దడపుట్టిస్తున్నాయి
అప్పుచేసైనా వారానికొక్కసారి
పప్పులు పలకరించాలంటే
పగడాల రేటును మరిపిస్తున్నాయి



ఇక ఉల్లి మినపట్టులు
పుంటి కూర పప్పులు
కథలుగా చెప్పుకొని లొట్టలేయాల్సిందే...?
పొట్టలిక నిత్యాకలాగ్ని హోత్రాల్లా మండాల్సిందే!
సంఘౌతా మంటలు చూసి
అయ్యో! ఇదెక్కడి మానవత
అని ముక్కున వేలుసుకున్నాం!
అనాదిగా అమానుషంగా
సాటి మనిషి అంటరాని మంటల్లో
నిట్ట నిలువునా కాల్చేస్తున్నాం!
మరి ఇదెక్కడి నాగరికత?
అక్కడిక్కడని ప్రాంతీయ బేధం లేదు
అంతటా ఆవిష్కరించబడే "ఖైర్లాంజి"
ఇల్లిల్లూ కన్నీటి చిత్తడితో తడిసే
నిత్య దుఃఖపు "చిరపుంజి"

ఏముందిప్పుడు
ఉగాదుల గురించి పాడడానికి
ఇక్కడ వసంతాలు లేవు

ఎటు చూసినా చిగురించని మోడులే
జానెడు జాగలేని గుడారాల గుండెగోడులే!

– గరికపాటి మణీందర్

పడిపోవును. ఎద్దులకు కుడికాలికి గాని, ఎడమ కాలికి గాని ముల్లు గ్రుచ్చుకొని ప్రమాదమగును. పని పాడగును. వాడు రైతుగా తగడు. శ్రద్ధ లేనివాడు పొలం దున్నడానికి పనికిరాడు. సైకిల్ మీద వెళ్లేవాడు హాండిల్‌మీద చేయివేస్తాడు గదా! వెకక్కి తిరిగి చూస్తే వాడి పరిస్థితేంటి? కారు నడిపేవాడు ప్రక్కలకు దిక్కులు చూస్తే, కారు సంగతేంటి?

పొలం దేవుని రాజ్యం, నీవు వెళ్లి, దేవుని రాజ్యమును ప్రకటించమనే ధన్య పిలుపు వస్తే యింటి వాళ్లను చూస్తాను, వారిని పరామర్శించి వస్తానని, యింటిమీద (లోకం మీద) మోజు చూపిస్తే దేవుని రాజ్యానికి పాత్రుడు కాదు. మనసంతా ఇంటి మీద ఉంటే, శరీరంతో, మనస్సుతో, యిష్టపూర్వకంగా పని, బాధ్యత నిర్వర్తించలేడు.

పలక బోధ:– పలకమీద అక్షరాభ్యాసం చేస్తే వేళ్లు బలపడి చక్కని వ్రాత కుదురుతుందంటారు. వ్యభిచారములో పట్టుబడిన స్త్రీకి తీర్పు చెప్పమంటుంటే, యేసు నేల (యిసుక) మీద వ్రేలితో ఏమో వ్రాస్తున్నాడు. ధర్మశాస్త్రం ప్రకారం వారి పాపాలే వ్రాసాడు. అందరూ పాపులే. పారిపోయారు, యేసుతప్ప.

పలకలు వ్రాతకు వాడిరి. పదియాజ్ఞలు రెండు రాతి పలకల మీద దేవుడు అగ్నివ్రేలితో వ్రాసాడు. పలకల మీద యెహోవా తన బోధలలో కొన్నింటిని వ్రాసాడు. (యెష 30:3) పరుగెత్తువాడు సహా చదువగలుగునంత పెద్ద అక్షరములతో దేవుని బోధనలు పలక మీద వ్రాయమని ప్రవక్తకు సూచన (హబక్కూకు 2:2) కొత్త నిబంధనలో యోహాను పేరు జకర్యా మైనముతో కప్పబడిన చిన్న పలక మీద వ్రాసాడు. (లూకా 1:63) ఈ దినాలలో మన హృదయములను పలకల మీద పరిశుద్ధాత్మ (ఆయన చిత్తాన్ని ) వ్రాస్తున్నాడు.

అక్షర అజ్ఞానం:– ఒకడు – నీవు దయచేసి దీని చదువుమని చెప్పి అక్షరములు తెలిసిన వారికి వానిని అప్పగించును. ఇది నావలన కాదు ఇది గూఢార్థముగా ఉన్నదని చెప్పెను. మరియు నీవు దయచేసి దీని చదువుమని చెప్పి అక్షరములు తెలియని వానికి దానిని అప్పగించును. అతడు–అక్షరములు నాకు తెలియవనును. (యెష 29:11–12) దేవునికి దూరమయిన హృదయముల పరిస్థితి అట్టిదే. అక్షరాలన్నీ తెలిసిన ఈ దినాల్లో చదువులు చట్టుబండలవుచున్నాయి. అక్షరార్థాన్వేషణ ఆధారం బైబిలే.

గేరా ప్రేమయ్యగారు వ్రాసిన ఒక జానపద గేయం
"యిన్నారంటోయ్ ఈసితరం, ఒరే సిన్నాన్నా, ఒరే పెద్దన్నా"
పంతులోరికి పన్నెండు రూకల్
పెభుత్వమోరే పంపుదురంటా
గంతులు వేయుచూ బడికి వద్దము
గబ్బుసమురును వారిదెనంటా ॥యిన్నా॥

పల్లెటూరివారు వాడి, పాడే పదజాలంతోపాటు, మాండలికాలు ప్రయోగిస్తూ, తత్వవిచార (Metaphysical) సాహిత్య వివరణలతో పాటు వేదాంత సాహిత్యం వివరిస్తే నేర్పేవారి, నేర్చుకొనే వారి "గురి" సాఫల్యత జరిగినట్లే.

మా నాన్నగారు గేరా ప్రేమయ్యగారి స్నేహితులు, అభిమానులు, శిష్యులు, ప్రత్యేకంగా బుర్రకథ కళాభిమాన బృందములకు ఈ పత్రికా ముఖంగా నాఅభినందనలు తెలుపుచున్నాను. ★

# చదువుల నిలయం

సమాజంలో సగభాగానికి పైగా ఉన్న మహిళలు అన్ని రంగాలలోను ముందంజలో ఉండాలంటే వారు విద్యావంతులైనపుడే సాధ్యపడుతుందని గుర్తించింది రోమన్ కాథలిక్ క్రైస్తవ మిషనరీ సంస్థ. సంస్థ ఆలోచనా విధానం నుంచి ఉద్భవించిందే నగరంలోని మారిస్ స్టెల్లా కళాశాల. మహిళ విద్యావంతురాలయినపుడే విజ్ఞాన భరిత నవ నాగరిక సమాజనిర్మాణం సాధ్యం అనే దృక్పధంతో వెలసింది ఈ స్టెల్లా విద్యాలయం. ఫ్రాన్సిస్కన్ మిషనరీస్ ఆఫ్ మేరి వారిచే సిస్టర్ డయాన్ మేరీ డాలీ చొరవతో "ట్రూత్ అండ్ ఛారిటి" ధ్యేయంతో 1962 సంవత్సరం జూలై 16వ తేదీన 23ఎకరాల సువిశాల మైదానంలో ప్రారంభమైంది ఈ కళాశాల. నాటి నగర ప్రముఖులలో ఒకరైన కాట్రగడ్డ రఘురామయ్య పదెకరాల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. నాటి మున్సిపల్ కమీషనర్ అజిత్ సింగ్ మరికొంత స్థలాన్ని సమకూర్చారు. డాక్టర్ పిన్నమనేని వెంకటేశ్వరరావు, జి.ఎస్. రాజు వంటి పలువురు సహకారం అందించారు.

నేటి సమకాలీన ప్రపంచంలో ప్రాపంచీకరణ నేపధ్యంలో మారుతున్న జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని అందుకు తగ్గట్టుగా విద్యార్థులు అన్ని రంగాల్లోనూ పోటీపడేలా ఆధునిక విద్య నందించేందుకు ప్రయత్నిస్తోంది కళాశాల యాజమాన్యం. ఇందులో భాగంగా నైతికవిలువలు, మేధోసంపన్నత, సామాజిక బాధ్యతలతో పాటు, ఆధ్యాత్మిక ప్రేరణతో కూడిన విద్య ఈ కళాశాలలో లభిస్తుంది. కుల మత రహిత విద్యనం దించడం ఈ కళాశాల ధ్యేయం.

1962లో పి.యు.సి తో తన గమనాన్ని ప్రారంభించిన ఈ కళాశాలలో ప్రస్తుతం ఇంటర్, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు అనేకం ఉన్నాయి. 1972లో సోషల్ వర్క్, కామర్స్, ఎన్.ఎస్.ఎస్. విభాగాలలో డిగ్రీస్థాయిలో హాస్టళ్ళు ప్రారంభించారు. 1977లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసారు. ప్రపంచ వ్యాప్తంగా సమాచార సాంకేతిక రంగాలలో వచ్చిన మార్పులకు అనుగుణంగా విద్యార్థినులకు సాంకేతిక విద్యను అందించాలన్న సదుద్దేశంతో బి.ఎస్సీ విభాగంలో కంప్యూటర్ సైన్సు, ఎలక్ట్రానిక్స్ కోర్సులు ప్రారంభించారు. 1992 లో పోస్టు గ్రాడ్యుయేషన్ విభాగంలో ఆంగ్లం, అర్ధశాస్త్రం కోర్సులు ప్రారంభమవగా, 1995లో బి.ఎ, బి.కామ్‌లలో అదనపు కోర్సులు ప్రారంభించారు. 1999లో బి.సి.ఎ విభాగాన్ని ప్రారంభించారు. 2003లో ఎం.కామ్, ఎం.ఎస్సీ, మాథ్స్, 2004 ఎం.బి.ఎ కోర్సులు ప్రారంభమయ్యాయి 1962లో కేవలం 150మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ కళాశాలలో ప్రస్తుతం మూడువేల మందికి పైగా వివిధ కోర్సులు, బ్రాంచిలలో విద్య నభ్యసి స్తుండటం విశేషం. ఇప్పటి వరకు 50వేల మందికి పైగా విద్యార్థులు డిగ్రీ, పి.జి లలో పట్టాలు పొందారు.

**విద్యయొసగును వినయంబు, వినయము**
**ధనము వలన దానంబు, దాని వలన ఐహి**

**విద్యలవాడ విజయవాడ**
**మహిళా సాధికార**
**అత్యున్నత ప్రమాణాలత**
**సర్వమత సామరస్యం, స్వర్ణోత్సవ సం**




కృతజ్ఞతా దివ్య బలిపూజ




స్వర్ణోత్సవ సంచిక విడుదల



డి.బి శ్రీనివాస్ UGC SERO కార్యదర్శి ప్రసంగం



నృత్యనాటిక

# స్టెల్లా విద్యాలయం

నసనుబడయు పాత్రత, పాత్రత వలన ధనము,
ఌకాసుఖములందు నరుడు - ఏనుగుల లక్ష్మణకవి

## లో విరిసిన విద్యాసుమం
## తే ప్రధాన ధ్యేయం
## తో ఉన్నత విద్యాభోధనం
## బరాల విజయవాడ స్టెల్లా విద్యాలయం



<u>ఉన్నత ప్రమాణాలకు అధిక ప్రాధాన్యం:</u> ఉన్నత ప్రమా ణాలతో కూడిన విద్యను అందించేందుకు ఇక్కడి నిష్ణాతులైన అధ్యాపక బృందం అహర్నిశలు కృషి చేస్తోంది. ఇందుకు గుర్తింపుగా 1999లో ఆంధ్రప్రదేశ్‌లో నాక్ గుర్తింపుపొందిన ప్రధమ మహిళా విద్యాసంస్థగా ఉన్నత శిఖరాలను అధిరోహించింది. 2006లో రెండోసారి నాక్ గుర్తింపు లభించింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ (యు.జి.సి) ద్వారా సి.పి.ఇ (కాలేజ్ విత్ ప్రొటెన్షియల్ ఫర్ ఎక్సలెన్స్) పురస్కారం సాధించింది. 2003లోనే స్వయం ప్రతిపత్తిని పొందిన ఈ కళాశాలలో క్రమశిక్షణకు, నైతిక విలువలను అధిక ప్రాధాన్యత నిస్తారు.

ఈ కళాశాలలో విద్యనభ్య సించి ఉన్నత స్ధానాలు పొందిన వారిలో ప్రస్తుత చెన్నై కలెక్టర్ కాకర్ల ఉష, మాజీమంత్రి శనక్కాయల అరుణ, శాస్త్రవేత్త నేహాసుధ వంటివారెందరో ఉన్నారు.

<u>విజ్ఞాన హంగులు:</u> విద్యార్ధుల కోసం 3వేల పుస్తకాలతో గ్రంధాలయం,డిజిటల్ లైబ్రరి, పరిశోధనా కేంద్రం, సువిశాలమైన ఆడిటోరియం, అత్యున్నత ప్రమాణాలతో కూడిన ప్రయోగశాలలు, లాంగ్వేజ్‌రూమ్, ఆడియో విజువల్ రూమ్, 400వందల మంది విద్యార్ధులకు వసతి గృహం వంటివి ఉన్నాయి. రాష్ట్రస్ధాయి విద్యా, వైజ్ఞానిక సదస్సుల నిర్వహణకు విజయవాడలో ఈ కళాశాల ప్రధాన కేంద్రంగా ఉంది. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం పరిధిలో 2007లో ఎకోఫ్రెండ్లీ పురస్కారం. 2008లో ఉత్తమ గ్రంధాలయం, ప్రయోగశాల పురస్కారాలు లభించాయి. సామాజిక సేవలో కూడా విద్యార్ధులు పాల్గొంటారు.

<u>ప్రముఖుల సందర్శన:</u> విద్యాసంస్ధ ప్రగతిని తెలుసుకునేందుకుగాను ప్రముఖ సంఘసేవిక మదర్ థెరిస్సా, నాటి దేశ ఉపాధ్యక్షులు జాకీర్ హుస్సేన్, ప్రముఖ ఇంజనీర్ కె.ఎల్. రావు వంటి వారు కళాశాలను సందర్శించిన వారిలో ఉన్నారు.

<u>వైభవంగా స్వర్ణోత్సవాలు:</u> 50 వసంతాలు పూర్తిచేసుకున్న శుభతరుణంలో కళాశాల తన స్వర్ణోత్సవ సంబరా లను జులై 16, 2011న యాజమాన్యం వైభవోపే తంగా నిర్వహించింది. ఈ ఉత్సవాలకు హైదరాబాద్ బిషప్ తుమ్మబాల, విజయవాడ బిషప్ మల్లవరపు ప్రకాష్, విజయవాడ పార్లమెంట్ సభ్యుడు లగడపాటి రాజగో పాల్, జి.ఎస్. రాజు వంటి పెద్దలు హాజరై కళాశాల పురోగతికి కృషిచేస్తున్న అధ్యాపక బృందాన్ని అభినందించారు. ఈ సంద ర్భంగా కళాశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తు న్న పలువురు పెద్దలను కరస్పాండెంట్ అల్బరా దుగ్గిపూడి, ప్రిన్సిపాల్ పి. జపమాలై ఆధ్వ ర్యంలో సత్కరించారు. అనంతరం జరిగిన విద్యార్ధినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి.



లోని దృశ్యాలు



స్వర్ణోత్సవ జ్యోతి ప్రజ్వలనం



నృత్యనాటికలోని దృశ్యాలు

దండల దేవసహాయం

# అజరామరం ఆరార్కే కీర్తి

*ఆరార్కే గారితో దాదాపు 30 సం॥లు 'ఆధ్యాత్మిక కుమారుడిగా' అవినాభావ సంబంధం నాకుండటం నిజంగా దేవుని కృపే! దేవ సహాయం అనే నా పేరులోని మొదటి రెండు అక్షరాలు 'దేవా అంటూ ఆప్యాయంగ ఆయన పిలుస్తూంటే అదో దివ్యమైన అనుభూతి నాకు కలిగేది. అది నా భాగ్యం, దైవ దీవెన!*

**– దేవసహాయం దండల**



ఈ దైవ జనునిలో నేను గమనించిన, నేర్చుకున్న శ్రేష్టమైన ఆధ్యాత్మిక అనుభవాలను కొన్ని మీ ముందుంచుతాను. ' దివా రాత్రులు దేవుని వాక్యాన్ని ధ్యానించటం ఈ దైవ జనునిలో ఉన్న అత్యంత ఉత్తమ లక్షణం!' ఎప్పుడైన మధ్య రాత్రి మెలుకువ వచ్చి మాట్లాడాల్సిన పరిస్థితి వస్తే వారు 'హైదరాబాద్‌లో ఉన్న అమ్మ గురించో, పిల్లల గురించో లేదా ఆ మరుసటి రోజు ఏదైన ఓ పెద్ద ప్రయాణం ఉన్న ఆ ప్రయాణపు ఏర్పాట్ల గురించో' ఆలోచించే వారు కాదు.

అంత రాత్రి సమయంలో కూడా, 'దేవా, రోమా 8:28ని గురించి నీవెప్పుడైనా ఆలోచించావా? ఎంతటి గొప్ప వచనం, ఎంతటి గొప్ప ఆధ్యాత్మిక సత్యాలు అందులో ఉన్నాయి' అంటూ ఏదో ఒక బైబిల్ వచనాన్ని గురించి చెప్పేవారు. నేను మీకు చెప్పాలని ప్రయత్నిస్తున్న విషయం 'దైవ జనులు దివారాత్రులు దేవుని వాక్యాన్ని ధ్యానించే అత్యుత్తమమైన, శ్రేష్టమైన ఆధ్యాత్మిక లక్షణాన్ని కలిగిన దైవజనుడు'. అందుకే ఆయన వేలాదిగా రేడియో ప్రసంగాలు, సభల్లో ప్రసంగాలు, అలాగే టి.వి. ప్రసంగాలు చేసిన ఎలాంటి నోట్సు వినియోగించేవారు కాదు. వారి గుండెల నిండా యేసయ్య మాటలే కాబట్టి వారు అలా సాధారణంగా మాట్లాడిన, లేదా ప్రసంగించిన దేవుని మాటలే ఆయన నోట వెంట వచ్చేవి.

దైవ జనుడు ఎల్లప్పుడూ ఓ మాట అనేవారు. 'గాస్సిప్ ది గాస్పల్' అంటే సాధారణంగా మనం మాట్లాడుకొనే మాటల్లో సువార్త ఉండాలి, అని అర్ధం! వారి మాటలు అలాగే ఉండేవి. వారు నోరు తెరచి ఏదైనా మాట్లాడారు అంటే 99 శాతం దేవుని మాటలే ఉండేవి. తెలుగు మమకారం 'తెలుగు ప్రజలు యేసయ్యను సరైన విధంగా అర్థం చేసుకోవాలని' భారం వారి హృదయంలో ఎక్కువగా ఉండేది. పండితులైన వారు, అన్యులైన వారు యేసయ్యను గురించి ఏదైనా విమర్శిస్తే వారి మీద కోపాన్ని ప్రదర్శించేవారు కాదు. కానీ యేసయ్యను అపార్థం చేసుకుంటున్నారే అని ఎముకలు విరిచినంతగా బాధపడేవారు. వారి కోసం ప్రార్థించేవారు.

చివరి రోజుల్లో వారు చెప్పిన మాట నేనెప్పుడు మరువలేను. దేవ సహాయం 'యేసు ప్రజా రక్షకుడు', అనే మాట చెప్పి ఎంతగానో వివరించేవాడు. నీవు కట్టించబోయే ప్రార్థనా మందిరాలన్నిటికీ 'ప్రజా ప్రార్థనా మందిరము' అని పేర్లు పెట్టు అన్నారు. క్రైస్తవ్యంలో వాడుక భాషను పరిచయం చేసిన ఘనత ఆరార్కే గారిది. వారి భాష, యాస అటు పండితులను, ఇటు పామరులను సహితం ఆకర్షించేది. 'అంతా యేసే...నాభాష, నాయాస అంతా యేసే...' అని ఓ మంచి పాటనుకూడా ఆరార్కే గారు రాశారు. 2008 సం॥ నవంబరు, డిసెంబరు నెలల్లో లండన్, అమెరికా దేశాలకు మేమిద్దరం కలిసి ప్రయాణాలు చేశాము. ఆ సమయంలో ఓ అమెరికన్ చర్చి వారు తమ సంఘానికి వచ్చి వాక్యాన్ని బోధించాలని ఆహ్వానించారు. ఆరార్కే గారు చాలా సున్నితంగా ఆ ఆహ్వానాన్ని తిరస్కరించి, 'నేను నా తెలుగు ప్రజల కోసం అమెరికా వచ్చాను, వారిని దర్శించటానికే నాకు సమయం సరిపోవటం లేదు, నేను రాలేను దయచేసి క్షమించండి'

అన్నారు. తెలుగు ప్రజలు యేసయ్యను గురించి తెలుసుకోవాలని, ఆధ్యాత్మిక రంగంలో ముందుండాలని ఎంతగానో ఆశించినవారు ఆచార్య ఆరార్కే గారు.

ఆరార్కే గారి ఇష్టమైన మరో వ్యాపకం ప్రయాణాలు చేయటం! ఎంత ప్రయాణానికైనా అలసిపోయేవారు కాదు. ఎలాంటి సింపుల్ ప్రయాణానికైనా కాదు అనేవారు కాదు. ఓ చిన్న మోపెడ్ మీదైనా ఎక్కేవారు, చిన్న రిక్షా అయినా ఎక్కేవారు. ఆటో, బస్, రైలు, విమానం ప్రయాణ వసతులు ఏవైనా గమ్యం చేరటమే ప్రాముఖ్యమనేది వారి భావన. నేనింత పేరు ప్రఖ్యాతులు గలవాణ్ని కదా నాకింత చిన్న ప్రయాణపు సౌకర్యమా? లేదా ఇలాంటి చిన్న వసతి సౌకర్యమా? అని ఏనాడు వారు అనేవారు కానే కాదు. రాత్రి సభ రెండు గంటలకు అయిపోయినా మరుసటి రోజు సభ ఉన్న స్థలానికి ఆ మధ్యరాత్రే వెళ్లిపోదాం అని ప్రయాణం చేసేవారు. అంతటి ప్రయాణాలు చాలా సార్లు నేనే వారితో చేయలేకపోయేవాణ్ని! ప్రభువు సేవలో ప్రయాణాలను ఆయన ఎంతో ఎంజాయ్ చేసేవారు!

ఆరార్కే గారితో శత్రుత్వం ఉన్నవారు ఎవరైనా ఉన్నారా అని భూతద్దంతో వెదకిన దొరకరు అంటే అతిశయోక్తి కాదు. ఎలాంటి వ్యక్తినైనా ప్రోత్సహించటం దైవజనునిలో ఉన్న సుగుణం! వారితో కాసేపు మాట్లాడితే చాలు ఎంతటి నిరాశా, నిస్పృహలకు లోనైన వ్యక్తి కూడా కొండంత బలంతో తిరిగి వెడతాడు. నా ఆధ్యాత్మిక జీవితం ఆరార్కే గారితో ముడిపడి ఉండటం, స్పందన పత్రిక భాధ్యతలు నేను చేపట్టడం, అంతకన్నా 'దేవా' అని ఆప్యాయతగా పిలుచుకునే ఆధ్యాత్మిక కుమారునిగా నేనెంతో గర్వపడుతున్నాను. నాన్నను నేను కలుసుకొనే రోజుకొరకు ఎదురుచూస్తాను.

# మంచి కౌన్సిలర్

**- రాయసం గిరిజ (ఆరార్కే గారి కోడలు)**

దైవజనులు ఆచార్య ఆరార్కే మూర్తిగారి కుమారుడు రాయసం పృథ్వీరాజ్ గారితో వివాహమైన దగ్గర నుంచి గత 25 సంవత్సరాలుగా మా మామయ్య గారి ద్వారా అనేక దైవిక సంబంధమైన విషయాలు తెలుసుకుంటూ ఉండేదానిని.



యేసుని సొంత స్నేహితుడిగా భావిస్తూ మూర్తిగారు 55 సంవత్సరాలపాటు అవిశ్రాంతంగా దేవుని సేవ చేసారు. క్రైస్తవ్యం అనేది ఒక మతం కాదని, మనిషి మనిషిగా జీవించడానికి ఉన్న ఏకైక మార్గమని మామయ్యగారు ఎప్పుడూ చెప్తూ ఉండేవారు. సులభశైలిలో చిన్నపిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు ఎవరైనా సరే అర్థం చేసుకొనే రీతిలో ఆయన బోధలు ఉండేవి. రేడియోలో, టీవీలో ఆదికాండం నుంచి ప్రకటన గ్రంధం వరకు ప్రతి ఒక్క వచనాన్ని విడమర్చి చెప్పిన వ్యక్తి.

ఆయన తన జీవితంలో ఎంతో నిరాడంబరంగా ఉంటూ అనేక మంది ప్రజలు యేసు వైపు తమ జీవితాలని మలచుకొనేలా చేసారు. అనేక కుటుంబాలలో తన సలహాల ద్వారా బోధల ద్వారా శాంతి సమాధాన సంతోషాలని కలుగచేసారు. ఎప్పుడు చూసినా బైబిలు వాక్యాలు రాసుకుంటూ, వాటిని చదువుకుంటూ ఉండేవారు. ఇంట్లో ఉన్నా, బయటికి వెళ్ళినా తను మాట్లాడే మాటలన్నీ యేసు గురించే ఉండేవి. తను ఎక్కడ ఉంటే అక్కడ తన చుట్టు ప్రక్కల వారిని సంతోషంగా ఉండేలా చేసేవారు. తన పరిచర్యకి ప్రతిఫలంగా ట్రాన్స్ వరల్డ్ రేడియో వారు మామయ్యగారిని సన్మానించి The whole Word to the whole World చెప్పిన ఏకైక వ్యక్తి అని ప్రశంసించారు. ఆయన చివరి దినాలలో ఆ ప్రశంస తనకెంతో తృప్తిని ఇచ్చింది అని అంటూ ఉండేవారు.

గత సంవత్సరం నుంచి అనారోగ్యంగా ఉన్నప్పటికీ ఎప్పుడు బాధపడేవారు కాదు. ఈ సమయాన్ని దేవుడు తాను కుటుంబంతో గడపడానికి ఇచ్చిన సమయమని భావించారు. ఈ సంవత్సరం అంతా ఆయన దగ్గర నేను ఎన్నో బైబిలు సంబంధ విషయాలను, మర్మాలను నేర్చుకున్నాను.

ఈ సంవత్సరం మార్చి 5వ తారీఖున తన సొంత గ్రామం గోవిందపురంలో నిర్మించిన మందిర ప్రతిష్ట కార్యక్రమానికి ఎంతో ప్రయాస పడివెళ్ళారు. అదే సేవలో ఆయన చేసిన చివరి ప్రసంగం. తను చెప్పిన ప్రతి మాట ఒక ఆణిముత్యం. ఆయన ఒక మంచి Counselor. ఎంతో మందికి Counsel చేసి ప్రార్ధన పరంగా తమ జీవితాలను చక్క చేసుకునేలా చేసారు. అలాంటి వ్యక్తిని కోల్పోవడం మాకు తీరని లోటు. అయినప్పటికీ ఒకానొక రోజు ప్రభువు సన్నిధిలో ఆయనను కలుస్తామన్న నిరీక్షణ మాకు ఉంది.

దైవజనులు ఆచార్య ఆరార్కే మూర్తిగారు 2011వ సంవత్సరం జులై నెల 15వతేదీన తను అత్యధికంగా ప్రేమించే యేసు ప్రభువు సన్నిధికి చేరుకున్నారు. 17-07-2011న సాయంత్రం 4గంటలకు నారాయణగూడ సిమెట్రీలో భూస్థాపన కార్యక్రమం దైవజనులు జి. శామ్యూలు (నారాయణగూడ బాప్టిస్ట్ చర్చి పాస్టర్)గారి సమక్షంలో దైవ వాక్యానుసారంగా జరిగింది. 19-07-2011న సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, సికింద్రాబాద్‌లో మెమోరియల్ సర్వీసు జరిగింది. ఈ సమావేశానికి చెన్నై నుంచి వచ్చిన పాస్టర్ డాక్టర్.ఎన్.జయపాల్ గారు ముఖ్య ప్రసంగికులుగా వ్యవహరించారు.

## పెద్దకథ

# మరియ



యమ్.యమ్.వినోదిని

(గత సంచిక తరువాయి)

మేమెవ్వరం ఆ నెయ్యి వాసన కూడా చూడకూడదు. మా అమ్మ భుజాల చుట్టూ ముసుగేసుకొచ్చి , వేడి వేడిగా ఆయన చుట్టూ అన్నీ సర్ది పెట్టేది. ఆయన తిని లేచాక ఆయిస్తిరాకు తీసకెళ్లి వేపచెట్టు కింద పడేసే వాళ్లం. ఆయన తనకి కావలసినంత పెట్టుకొని తిన్నాకే మేం అన్నం తినేవాళ్లం. మా నానతో సహా.

ఇట్లా ఆయనున్నన్ని రోజులు యింట్లో చాలా మార్పులు జరిగేవి. నేనూ మా మరియ పెద్దగా నవ్వుకోవడం, మాట్లాడుకోవడం కూడా చేసేవాళ్లం కాదు. వెంకటేశ్వరావు గారింట్లోనే మేమున్నట్లు జాగ్రత్తగా మసులుకునే వాళ్లం. యెన్ని పరిమితులుండి యెన్ని మార్పులు జరిగినా మానాన్న తాగుడు మాత్రం మానేవాడు కాదు. 'మాఇంట్లో బ్రామ్మడున్నాడయ్యా' అని తన స్నేహితులెవర్నీ యింటికి తెచ్చేవాడు కాదు.

గుంటూరు నుండి యెవరొచ్చినా తిరిగి వూరెళ్ళేటప్పుడు 'సినిమాకి పొమ్మని' మాకు డబ్బులిచ్చేవాళ్లు. 'యింట్లో అన్నన్ని రోజులు తిని యళతా పిల్లల చేతిలో రెండ్రూపాయలన్నా పెట్టడేంది' అనేది మా అమ్మ - వెంకటేశ్వరావుగారు వెళ్లిన వెంటనే.



మా అమ్మకి నాన్నకి డబ్బుల దగ్గర యెప్పుడూ గొడవలవుతా వుండేవి. వొకసారి అలా గొడవ మొదలైంది. చూస్తుండగానే మా నాన్న అమ్మని జుట్టు పట్టుకొని యీడ్చుకొచ్చి యెగ్గిరెగ్గిరి తన్నాడు. మా అమ్మకి నోట్లోంచి, ముక్కుల్లోంచి వొకటే మెయినంగా రక్తంకారింది. చీరంతా రక్తం మరకలయ్యి చిరిగిపోయింది. యింటి పక్కన రత్తమత్తమ్మొచ్చి 'సంపుతా వేందన్నా' అనుకుంటా అమ్మని వాళ్లింటికి తీసుకెళ్లింది. ఆ రాత్రే మా అమ్మ మాకు తెలియకుండా మాతమ్ముణ్ణి తీసుకొని మా అమ్మమ్మ వాళ్ల వూరెళ్లిపోయింది. ఆ రాత్రంతా నేను దిగులు దిగులుగా భయం భయంగా అయిపోయాను. మరియ నా వీపుకి తన పొట్టనానిచ్చి నా చుట్టూ చేతులేసి గట్టిగా వాటేసుకొని, 'అమ్మొస్తది, అమ్మొస్తది' అనుకుంటా మెలకువగా గడిపింది.

ఆ తర్వాత మానాన్న యెన్నిసార్లు కబురు పంపినా నీ అసమంటి మడుసుల్ని సంపేవోడి కాడికి మాఅప్పని పంపేదే లేదని మా లోకయ్య మావ తిరిగి సమాధానం పంపేవాడు. వొకసారి వెంకటేశ్వరరావుగారొస్తే నాన్న యీ విషయాలన్నీ చెప్పి యింక నర్సరావుపేటలో వుండేది లేదని గుంటూరు ట్రాన్సఫర్ పెట్టించుకుంటున్నానని చెప్పాడు. దానికింకా టైంపట్టుద్ది కాబట్టి పిల్లల్ని గుంటూరులోనే యాడన్నా యిల్లు అద్దెకు తీసుకొని పెడతానని చెప్పాడు. దానికి ఆయన వాళ్లింటి కాంపౌండ్ లోనే వొక పూరిల్లు ఖాళీగా వుందని అందులో వుండొచ్చని చెప్పాడు. యే చుట్టాలిళ్ల దగ్గరకో పెళ్లాం లేకుండా పోయి వుండడానికి మొహం చెల్లని మానాన్న ట్రాన్సఫర్ పనయ్యి, మా అమ్మ వచ్చేవరకు మమ్మల్ని ఆ యింట్లో వుంచాలని అనుకున్నాడు.

అట్లా మేము గుంటూరెళ్లిపోయి ఆ పూరింట్లో చేరాం. ఒక్కటే గది మేమెళ్లినప్పుడది

నర్సరావు పేటలో మేం చెత్తపడేసే వేప చెట్టు కిందున్న దిబ్బలా వుంది. నాలుగురోజులు మా మరియ నేనూ కష్టపడి శుభ్రం చేస్తే వొక కొలిక్కి వచ్చింది. యిల్లు యెంత బాగా సర్దుకున్నా అమ్మ లేని లోటు కొట్టొచ్చినట్టు కనపడేది. నేను పరీక్షలు రాయకుండానే యెండాకాలం సెలవలొచ్చేశాయి. ట్రాన్సఫర్ కోసం మా నాన్న నర్సరావు పేటకి చాలాసార్లు పోయొచ్చేవాడు. వక్కొక్కపారి నాలుగైదు రోజులు అక్కడే వుండి పోయేవాడు. అపుడు మరియ, నేనూ ఆ పూరింటి తలుపులు, కిటికీలు గట్టిగా వేసుకొని చెమటపడుతున్నా కూడా దుప్పటి కప్పుకొని బొంగుల మంచం మీద పడుకునేవాళ్లం. నాన్న వూర్లో వుంటే పొద్దునన్నం తిని వెళ్లి నేను నిద్రపోయాక వచ్చేవాడు. వచ్చేవరకు మరియ మెలకువగా ఉండేది. అక్కడున్నంత కాలం మానాన్న తాగుడు తగ్గించాడు. మేం మాంసం వండుకోవటం మానేశాం. కోడిగుడ్డట్టేసుకోటం, యెండి చేపలు కాల్చుకోవడం కూడా మానేశాం. వకుళాదేవి గారు వచ్చిన తెల్లారే చెప్పింది. అలాంటివన్నీ యిక్కడ చెయ్యకూడదని. వకుళాదేవి వెంకటేశ్వరావుగారి భార్య.

ఆమె మరియకి బోల్డన్ని పనులు చెప్పేది. బావికాడ మరియ అంట్లు తోమగానే వాటి మీద నీళ్లుచల్లి లోపలికి తీసుకెళ్లేది. యిల్లంతా శుభ్రంగా వూడిపించి తడిగుడ్డతో తుడిపించేది. వాళ్లందరి బట్టలు మరియ వుతికేది. పుల్లల చీపురిచ్చి వూడిపించి తడి గుడ్డతో తుడిపించేది. వాళ్లందరి బట్టలు మరియ వుతికేది. పుల్లల చీపురిచ్చి లెట్రినూ బాత్‌రూం రుద్ది రుద్ది కడగమనేది. గిన్నె తెచ్చుకోమని చెప్పిరాత్రి మిగిలిపోయిన అన్నం కూరలు పులిహోర యిచ్చేది. మాకేమన్నా అవసరం అయితే గడపకివతలే నిలబడి పిలవాలి. ఆమె సన్నగా తెల్లగా యెండిపోయిన తాటాకు చేపలా వుండేది. పొడుగోటి పళ్లు. ఆమెని వకుళాదేవి గారూ అని పిలిస్తే 'అలా వద్దు అమ్మగారూ' అని పిలవాలని చెప్పింది. మేం వున్న బ్రాడీ పేటలోనే 'శారదానికేతన్'లో ఆమె టీచర్.

రాత్రుల్లో బొంగుల మంచం మీద మానాన్న పక్కలో పడుకొని అమ్మెపుడొస్తదని అడిగేదాన్ని. యీ ట్రాన్స్‌ఫర్ పనయ్యాక నేనే బోయి తెస్తాననేవాడు. యెండా కాలంపోయి మళ్లీ బడులు తెరిచారు. మా నాన్నకి ట్రాన్స్‌ఫర్ అవ్వలేదు. మా అమ్మ రాలేదు. మా మరియ వెంకటేశ్వర్రావు గారింట్లో జీతంలేని పనిమనిషై పోయింది. మా నాన్న గుంటూరుకి నర్సరావు పేటకి మధ్య పాసింజర్ రైలయ్యాడు. మేం అంటరానివాళ్లమని మా మనసుల్లో పచ్చి ముద్రలేర్పడ్డాయి.

బడులు తెరిచాక వకుళాదేవి రోజూ పొద్దున్నే బడికిపొయ్యి సాయంత్రాని కొచ్చేది. వెంకటేశ్వర్రావుగారు మూడు నాలుగు వారాల కొకసారి యింటికొచ్చి రెండురోజులే కన్పించేవాడు. యింకా కాలేజీలు తెరవలేదని వెంకటేశ్వర్రావు కొడుకు యింట్లోనే వుండేవాడు. ఆ అబ్బాయిని వాళ్లు మల్లి అని పిలిచేవాళ్లు.

వొకరోజు వాళ్లమ్మ అటు బడికెళ్లగానే నన్ను పిలిచాడు. అటకెక్కి పుస్తకాలు దించుతావా అనడిగాడు. తలూపాను. అంతకు ముందెప్పుడు మల్లి నాతోగాని మా మరియతోగానీ మాట్లాడలేదు. గడపదాటి వెళ్లి నిలబడిపోయాను. లోపలికి రమ్మని పిలిచాడు. వెళ్లాలో లేదో అర్ధమవలేదు. 'మా అమ్మ లేదులేరా!' అన్నాడు. లోపలికెళ్లగానే తలుపేసి నన్నెత్తుకొని 'అమ్మ నాన్న ఆటాడుకుందామా' అనుకుంటూ లోపలి గదిలోని పెద్ద మంచం మీద పడుకోబెట్టి నా జాకెట్టు హాఫ్‌లంగా విప్పదీసి వొళ్లంతా తడమటం మొదలుపెట్టాడు. నాలో విపరీతమైన భయం మొదలైంది. గుండెల మీద చేతులేసి నలిపేస్తూ 'ఫర్వాలేదు కాస్త పెద్దదానివే' అన్నాడు. భరించలేనంత నెప్పనిపించి యేడ్చేశాను. తిమ్మిరి బిళ్లలిచ్చాడు. నేను వెళ్లిపోతానని యేడుస్తూ చెప్పాను. అయినా విన్పించుకోకుండా యింకొంచెం సేపు అలాంటి పనులే చేసి చివరికి నాకు బట్టలు తొడిగాడు.

బయటికి పంపిస్తూ 'జాగ్రత్త యీ సంగతి యెవరితోనైనా చెప్పావనుకో....చివరికి మీ అక్కతో కూడా! అడిగితే యేం చెప్పాలీ? అటక మీద కెక్కి పుస్తకాలు దించానని చెప్పాలి సరేనా? అన్నాడు. నాకు చాలా యేడుపొచ్చింది. యింటికెళ్లి చూస్తే మరియ బావి దగ్గర యింకా బట్టలు వుతుకుతూనే వుంది. సందులోకెళ్లి గాబు దగ్గర గోడకానుకొని చాలాసేపు కూర్చున్నాను. మరియకి చెబ్దామనిపించింది. చెప్పాలంటే భయం వేసింది, మల్లి ఏం చేస్తాడోనని. అది జరిగిన తర్వాత మానాన్న పక్కలో పడుకోవ




స్వర్ణదీపిక
హోలీ ల్యాండ్ టూర్స్
(యోర్దాను - ఇశ్రాయేలు - ఈజిప్టు - పాలస్తీనా)
ప్రభువు నడిచిన నేలపై నడవండి.
ప్రభువు తిరిగిన ప్రాంతాల్లో సంచరించండి.
చారిత్రక ఆధారాలతో మీ భక్తి విశ్వాసాల్ని దృఢపరచుకొండి.
స్వర్ణదీపిక ఈ అవకాశాన్ని మీకు కల్పిస్తోంది.
9 రోజుల యాత్ర
మీకు పాస్‌పోర్ట్ లేని యెడల మమ్ములను సంప్రదించండి.
మరిన్ని వివరాలకు సంప్రదించండి: 9676355567

కవిత

# విశ్వమానవుడు

**మ**ట్టి తట్ట పైకిలేపినపుడు
అరక పట్టి నాగలి దున్నినపుడు
సమస్త మట్టి పనులు మట్టి
చేతుల్తో చేస్తున్నపుడు
మట్టి కాళ్ళతో మట్టిలో
కలయ దిరిగి మట్టిని బంగారు
మాగాణం చేసినపుడు నేను
మట్టిగా రూపాంతరం చెందినపుడు
నా వొళ్ళు చెమటమయం కాదా?
నేను చెమట వాసన వేయనా?
నా నుదుటి మీది స్వేదబిందువుల్తో
సూర్య కిరణాలు ప్రతిఫలించి
ఇంద్ర ధనస్సులు వేయవా?
ఆ అపురూప సౌందర్యోపాసన
తెలియనివాడా! సకల
అకళా కోవిదుడా!
నువ్వు నన్ను తాకనంటావా?



నేను ముట్టిన గ్లాసు అంటనంటావా?
నేను నెత్తుటితో పండించిన పంటని
ఆరగించి నీడ పాటున భోగిస్తూ
సోమరి బతుకు మరిగినావా?
నువ్వు లేకుండా నేను బతగ్గలను నేను
లేకుండా ఒక్క అడుగు వేయగలవా?
నన్ను ఓ మెట్టు కింద కూచోమంటావా?
నిత్యం గుడిపూజల జిమ్మిక్కుల పేరిట
నన్ను తప్పుకోమంటావా?
అసలే తాకనంటావా?
నన్ను నీ మందిలోకి రానియ్యనపుడు
నీ వేదాంతంతో నాకేంపని?
నీ మతంతో నాకేం పని?
నాది విముక్తమతం
నేను శ్రామికుణ్ణి
విశ్వ మానవుణ్ణి...

– డా॥దామెర రాములు

డానికి కూడా యెందుకోభయ మనిపించేది.

యిట్లా చాలా రోజులు జరుగుతూనే వుంది. వాళ్లమ్మ బడికి వెళ్లడం. మరియ బావి దగ్గర బట్టలుతుకుతుండటం. మల్లి నన్ను పిలవడం.యిట్లా యెందుకు జరుగుతుందో అర్థమయ్యేది కాదు. మేం అంటరాని వాళ్లమని, వాళ్లు బ్రామ్మలని చెప్పాడు మా నాన్న. 'మనల్ని వాళ్లంటుకున్నా, వాళ్లని మనమంటుకున్నా వాళ్లు మైలపడిపోతారు. మనం వాళ్ళిళ్లల్లోకి వెళితే వాళ్లిల్లు మైలపడుతుంది. కనీసం మనం ముట్టుకున్న వస్తువుల్ని కూడా వాళ్లు ముట్టుకోరు. ముట్టుకుంటే అంటు. అట్లా మనల్ని దూరంగా వుంచాలని, ముట్టుకోకూడదని వాళ్ల శాస్త్రాల్లో రాసుందంట' అని చెప్పాడు.

నానట్లా చెప్పాక నాకు మరింత అయోమయంగా వుంది. మరి మల్లి నన్ను వాళ్లింట్లోకి తీసికెల్లాడు కదా! నా బట్టలన్నీ తీసి నన్ను వాటేసుకున్నాడు కదా! నా నోట్లో నోరుబెట్టి చీకాడు కదా! మరది ముట్టుకోవడం అవ్వదా. మల్లి బ్రామ్మడు కాదా? జందెం వేసుకుంటాడు కదా! శనివారం రాగానే మంత్రాలు జదువు కుంటా పూజలు చేస్తాడు కదా... నాకసలేవీ అర్థమయ్యేది కాదు. అన్నం తింటన్నా, నీళ్ళు పోసుకుంటున్నా, పక్కమీద పడుకున్నా నేను యిదే ఆలోచించేదాన్ని!

బడులు తెరిచిన పదిహేను యిరవై రోజుల కనుకుంటా, మా నాన్న సంతోషంగా 'ట్రాన్సఫర్ అయ్యిందిరా, అమ్మని తెచ్చుకుని యాడన్నా వేరే యిల్లు తీసుకొని వుందాం. ఈసారి యిట్లా కురిసే యిల్లు తీసుకోవద్దు. మంచిల్లు తీసుకొని యింకా యింట్లో మర్యెమ్మకి పెల్లి జేద్దాం' అని నవ్వాడు. కింద చాపమీద కూర్చొని గోంగూర వొలుస్తున్న మరియ 'ముందమ్మనితేయ్యా, తర్వాత పెల్లి చేద్దువుగానీ' అని నవ్వింది.

ఇంక ఆరోజే మానాన్న నా బడి గురించి వెంకటేశ్వర్రావుగారి భార్యతో మాట్లా డాడు. 'రేపట్నుంచి నాతో పంపించండి.మాట్లాడి క్లాసులో కూర్చోబెడతా. నర్సరావుపేట నుండి టీసీ తెచ్చాక అడ్మిషన్ సంగతి చూద్దాం' అంది. నాకెక్కడలేని సంతోషమేసింది. మరియలా నా చదువు కూడా ఆగిపోద్దేమోననుకున్న. మల్లీ అయిదో తరగతి చదవాల్సి వచ్చినా బాధనిపించ లేదు. నాన తెల్లారుజామునే లేచి అమ్మని తేవటానికి అమ్మమ్మోళ్ల ఊరు బయలుదేరాడు.

మరియ నాకు రెండు జళ్లు వేసి మొకానికి పౌడర్రాసింది. యెక్కువైన పౌడర్ని పైటచెంగుతో తుడిసింది. అంతకు ముందు మూడ్రోజుల నుండి సైకిల్ మీద కాలేజీకి వెళ్లడం మొదలుబెట్టాడు మల్లి. ఆ కారణంగా నన్ను బిలవటం మానేసిన యీ నాలుగురోజులూ నేను కనపడ్డప్పుడల్లా యెవరూ చూడకుండా కన్ను కొట్టేవాడు. యిప్పుడు నాకు చాలా సంతోషం. బడికి వెళ్లడం, మా అమ్మ తిరిగి రావడం, అసలు కురవని యిల్లు తీసుకోవడం, మరియ పెళ్లికి పొడుగు అంచులంగా కుట్టిస్తానని నాన అనడం యివన్నీ నాలో సంతోషాన్ని నింపేశాయి. వీటన్నింటికంటే పెద్ద సంతోషం మల్లి నన్నెప్పటికి లోపలికి పిలవడని. సన్నటి వానలో రెండు పాత నోట్బులు పెన్సిలు తీసుకొని రిబ్బను కుచ్చులు చూసుకుంటూ వెంకటేశ్వర్రావు భార్య తో బయలుదేరాను. ఆమె వాళ్లింటి తాళం చేతులు మరియ చేతిలో యెత్తివేస్తూ 'యీ వేళ వెంకటేశ్వర్రావుగారు కాంపు నించి వస్తార'ని చెప్పింది. దారిలో అన్నం, నీళ్ళు పెట్టిన ప్లాస్టిక్ బుట్టని నా చేతి కిచ్చింది. బడిలో కెళ్లాక నన్ను హెడ్మాస్టరు గారి రూం బయట నిలబెట్టి, మాట్లాడి వచ్చింది. అది 'శారదా నికేతన్'. పెద్ద బడి. పెద్ద పెద్ద చెట్లున్నాయి. కాంపౌండు గోడ

తల మీద వందేమాతరం అని సిమెంటుతో రాసిన పెద్ద పెద్ద అక్షరాలున్నాయి. 'ఐదవ తరగతి –బి అనున్న గదిలో నన్ను కూర్చోబెట్టి ఆమె అక్కడ్నుంచి వెళ్లిపోయింది.

అందరూ అమ్మాయిలే. కొంత మంది నన్ను పలకరించారు. పేరేంటని అడిగారు. మార్తని చెప్పాను. 'అంటే' అనడిగారు. బైబిల్లో మరియ చెల్లెలని చెప్పాను. 'కిరస్తానీలా'అన్నారు. అవునన్నాను. అంతే అందరూ వొక్కసారిగా దూరంగా జరిగారు. 'ముట్టు కోకండే, కిరస్తానీలట, మైలబడిపోతాం, దూరం జరగండి' అని ఆందోళనగా అరుస్తూనేవున్నారు. నా చుట్టూ వొక మూరవరకు ఖాళీ స్థల మేర్పడింది. నర్స రావు పేటలో బడి నుండి యింటి కొచ్చే దారిలో పాకీ దిబ్బలుండేవి. ఊర్లోంచి పెద్ద పెద్ద డబ్బాల్తో తెచ్చి ఆ దిబ్బల మీద పోసేవాళ్లు. ఆదిబ్బల్ని కూడా మేం యింతగా చీదరిచ్చుకోని దూరం జరగలేదు.

యింతకు ముందెప్పుడూ నేనింత అంటరానిదాన్నవ్వలేదు. నేను చదివొచ్చిన బళ్లో అందరూ కిరస్తానీలే. అక్కడెప్పుడూ అంటు, ముట్టు, మైల మాటలే వినలేదు. నాకు వెంటనే మల్లి గుర్తొచ్చాడు. వాడు నన్ను వొళ్లంతా ముట్టుకోవడం వాణ్ణి ముట్టుకోమనడం జ్ఞాప కానికొచ్చింది. యెవరు యెవర్ని అంటుకోవచ్చో, యెవర్ని అంటుకోకూడదో అర్థం కావడం లేదు. అంటరాని వాళ్లెవరో అంటుకోగల వాళ్లెవరో అర్థం కావడం లేదు. అంతా అయోమయంగా వుంది. సరిగ్గా ఆలోచించుకోలేక పోతున్నాను. సన్నగా తలనొప్పి, కడుపులో తిప్పడం మొద లైంది. నా నుంచి దూరంగా జరిగిన అమ్మాయిలు వాళ్ళిళ్ళల్లో యేమేం పచ్చళ్ళు పెట్టారో, యెలాంటి వడియాలు పెట్టుకున్నారో మాట్లాడు




కుంటున్నారు. మధ్య మధ్య నాకెల్లి చూస్తున్నారు. యింతలో యవరో వొక మేస్టరుగారు లోపలి కొచ్చాడు. ఆయన సన్నగా పొడవుగా వున్న తిలకం బొట్టు పెట్టుకున్నాడు. అయిదు నిముషాలు సర్దుకొని కూర్చున్నాక – ఆయన నా వైపు చూసి యేస్టీ అక్కడంత ఖాళీ వదిలి పెట్టారూ? అనడిగాడు. వాళ్లు కిరస్తానీలంట మాస్టారూ, ముట్టుకుంటే మరి మైల పడిపోతాం కదా, అందుకే జరిగాం' అని చెప్పారు. ఆహా అంటూ నావైపు చూసి 'యేం పేరూ' అనడిగాడు. చెప్పాను. 'మార్తంట మార్త' దేశంలో యిక పేర్లు లేనట్టు. కనీసం పెంటమ్మనో, దిబ్బమ్మనో పెట్టు కోవచ్చుగా అన్నాడు. నేను బిత్తరపోయాను. వెంటనే 'చదవవచ్చా' అన్నాడు. తలూపాను. అప్పటికే నాకుతలనొప్పి యెక్కువయి గొంతులో యింతలావు కాయేదో అడ్డం పడ్డట్టుంది. నా చేతికి తెలుగు వాచకం యిచ్చి 'నాలుగో పాఠం చదూ' అన్నాడు. అది 'శ్రీకృష్ణదేవరాయులు' యే పాఠమైనా గడగడా చదువుతాను. మా క్లాసులో నేనే ఫస్టు. కానీ అక్కడ యేవీ చదవలేక పోయాను. నా గొంతులోంచి యే శబ్దమూ రావడం లేదు. చదవమని గట్టిగా గదిమాడు. నాకు నక్కిళ్ళు కదిబడ్డాయి. యెట్లాగో చదవ డానికి ప్రయత్నం చేశాను. శబ్దమైతే బయటి కొచ్చింది. నత్తినత్తిగా, స్పష్టతలేకుండా, నక్కులు, నక్కులు పోతా నావైపు చాలా ద్వేషంగా చూసి, త్తత్తత్త అని యెగతాళిగా అని, ఆగి చప్పట్లు కొడుతూ 'యిదేమన్నా నడిపించు నానావా' కుష్టి పాటను కుంటున్నావా? పద్యాలు,ఆయేవను కుంటున్నావో, కూర్చోఅన్నాడు. నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. కొంచెం సేపు యేదో చెప్పాడు. యింతలో బెల్ మోగింది. నాకెల్లి రేపట్నుంచి ఆముండమోపి మొహంతో రాకుండా కాస్త కాటిక చుక్కతో మొహాన యింత బొట్టు పెట్టుకొనిరా' అని వెళ్లిపోయాడు.

నాకు గొంతులోంచి యేడుపు తన్ను కొచ్చింది. ఆయనటు వెళ్లగానే నా పుస్తకాలు, పెన్సిలు అక్కడే వదిలి పెట్టి గబుక్కున బయటికి పరిగెత్తాను. ఆ పరిగెత్తడం పరిగెత్తడం మా యింటి దగ్గర కొచ్చి ఆగాను.వెంకటేశ్వర్రావు గారిల్లు తాళం వేసుంది. అది మరియ బట్టలు తికే టైము. బావి దగ్గర మరియ లేదు. బట్టలు న్నాయి. వుతుకుత యాడికో బోయినట్టుంది. మా యింటి తలుపు నెట్టిచూశాను. తెరుచుకోలేదు. సన్నగా యింట్లో నుంచి యెందుకో మరియ ఏడుస్తున్నట్లుగా వినబడింది. సందులో వున్న కిటికీ రెక్క వూడి పోయిందని దానికి చేట తగిలించేది మరియ. ప్రార్థన చేసుకుంటా యేడుస్తుందేమో అనుకున్నాను. చూడాలన్పించి చేటని తోసాను. యెదురుగా బొంగుల మంచం మీద యెవరో బోర్లా పడుకొని వున్నారు. ఆ తెల్లటి వీపు జందెము చూసి ముందు మల్లి అనుకున్నాను. కాదు వెంకటేశ్వర్రావుగారు. అచ్చం మల్లిలా....వెంకటేశ్వర్రావుగారికి మంచా నికి మధ్య నల్లగా మరియ...! నేను పరిగెత్తు కుంటూ

## క్రీస్తు పట్ల మనం ఎలా ఉండాలి
## HOW WE SHOULD BE TOWARDS CHRIST

| | |
|---|---|
| C-Committed | అంకితభావం కలిగియుండాలి |
| H-Holy | పరిశుద్ధులముగా ఉండాలి |
| R-Reliable | నమ్మదగినవారముగా ఉండాలి |
| I-Intercessors | విజ్ఞాపనకర్తలుగా ఉండాలి |
| S-Soldiers | సైనికులుగా ఉండాలి |
| T-Testimonies | సాక్ష్యములుగా ఉండాలి |

**పాస్టర్ గుండాబత్తిని దేవదానం**

బావి దగ్గర కెళ్లి బావి కానుకుని కూర్చు న్నాను. వళ్లంతా వణికి పోతుంది. నిలువునా చెమటలు పట్టాయి. కడుపులో తిప్పుతోంది. కాసేపటికి వెంకటేశ్వర్రావుగారు బయటికొచ్చి వాళ్లింటి వైపు వెళ్లిపోయాడు.

లోపలికెళ్లి చూస్తే మరియ యేడుస్తోంది. వంటి మీద సరిగ్గా బట్టలు లేవు. నులక మంచం సందుల్లోంచి కారిన రక్తం, సన్నగా అలికిన ఆ నేలమీద యింకా యింక లేదు. నాకు యేం చెయ్యాలో పాలు పోలేదు. మరియనే చూస్తు దగ్గర కెళ్లాను. మరియ నన్ను గట్టిగా వాటేసుకొని వెక్కిళ్లు పెడతా యేడ్చింది. నాకు విపరీతమైన భయం వేసింది. తొందరగా మా అమ్మని తీసుకొని మా నానొస్తే బాగుండను కున్నాను. ఆ రోజంతా మరియ యే పనీ సరిగా చెయ్యలేదు. యేడుస్తూనే వుంది. చీకటి పడ్డాక మరియ నిశ్శబ్దమై పోయింది. మాటలేదు. యేడుపూలేదు. నాకు జ్వరం కమ్ముకొచ్చింది. ఆ రాత్రి యెప్పట్లాగే నా వీపుని వాటేసుకొని పడుకుంది మరియ. వర్షం కురుస్తానే వుంది. తెల్లవారటం, అమ్మ, నాన, తమ్ముడు లోపలికి రావడం, నాకు మెలకువ రావడం వొక్కసారే జరిగాయి. పక్కలో మరియ లేదు. యిల్లంతా వెతికారు. కాంపొండంతా వెతికారు. చుట్టు పక్కల వాళ్లని అడిగారు. కొట్లలో వెదికారు. మా నాన్న తెల్సిన వాళ్ళిళ్ళల్లో చూసొస్తానని వెళ్లాడు. మజ్జానమైంది, సాయంత్రమైంది. మరియ లేదు. మా అమ్మ నోటికి చెంగడ్డం పెట్టుకొని కుమిలి కుమిలి యేడుస్తూనే వుంది. మానాన్న మనసు మనసులో లేదు. మా మేనత్త, బావ మా యింటికొచ్చేశారు. చీకటి పడుతుం డగా మా బావ నర్సరావుపేట బయలు దేరాడు. యిదివొరికున్న యింటికాడ యిళ్ళల్లో వొకసారి చూసొస్తానని. అప్పటికే నేను అయిదారు సార్లు కక్కున్నాను. నాలుగయిదు దుప్పట్లు కప్పినా చలి ఆగడం లేదు. మా అమ్మ అత్త రాత్రంతా యేడుస్తానే వున్నారు. నాకు పక్కేసి పడుకో బెట్టారు. మాఅత్త మింగిచ్చిన మాత్ర కూడా కక్కున్నాను. బయట వొకటే వాన. యెట్లైనా మరియ దొరికేటట్టు చెయ్యమని ఆ రాత్రి మగతలో యేసయ్యను ప్రార్ధన చేస్తానే వున్నాను.

మేమంతా మాపాతింట్లో వున్నాం. మరియ లోపలికొస్తోంది. నేను పరుగెత్తికెళ్లి వాటేసుకున్నాను. మా అమ్మ నాన్న యేడవటం మొదలుపెట్టారు. గట్టిగట్టిగా యేడుస్తునారు. మా అత్త గుండెలు బాదుకుంటూ యేడుస్తోంది....నాకు సడెన్‌గా మెలకువ వచ్చింది. గబగబా బయటికొచ్చాను. అందరూ బావి చుట్టూ! అట్లాగే తూలుకుంటాబోయి తొంగి చూశాను. మరియ బోర్ల తేలుతోంది. సరిగ్గా బట్టలులేకుండా నల్లగా నానిపోయి వుబ్బిపోయి. అక్కడ మల్లి, వెంకటేశ్వర్రావుగారు, ఆయన భార్య కూడా వున్నారు. 'అరెరె చాలా మంచ మ్మాయి. యిలా యెలా చేసుకుంది' అంటు న్నాడు వెంకటేశ్వర్రావుగారు. వున్నట్టుండి నేను గట్టిగా అరిచాను. 'నీ వల్లే చచ్చిపోయిందిరా మాఅక్క. నువ్వు మా అక్క మీద పడుకున్నావ్ కదరా! నువ్వు మా అక్క మీద పడుకున్నావ్ కదరా! నానా, యీడు మరియ మీద పడు కున్నాడు. అమా, యీడు మరియ మీద పడు కున్నాడు.మొన్నంతా యేడ్చిందిమా...నేనంటా నే వున్నాను.

మా బావ వెంకటేశ్వర్రావుగారి చొక్కా పట్టుకొని గుద్ద బోతున్నాడు.మా నాన, మల్లి, బావ, వెంకటేశ్వర్రావుగారు అందరూ వొకళ్ల మీద వొకళ్లు పడి దొర్లుతున్నారు. ఆడోళ్లు పెద్ద పెద్దగా అరుస్తున్నారు. యేడుస్తున్నారు. బావిలో మరియ తేలతానే వుంది. నాకేమీ సరిగా కన్పించడం లేదు. కళ్లు బైర్లు కమ్ముతున్నాయ్. అంతా మసక మసగ్గా...అలా యెంత సేపైందో తెలీదు! 'మార్తా యేం జరిగిందో చెప్పమ్మా, చెప్పమ్మా' అని నన్ను కుదిపి కుదిపి అడుగు తోంది. కళ్లు తెరిచి చూస్తే యెదురుగా మరియ బొంగుల మంచం మీద పడుకోబెట్టి... యింకా చాలా చాలా మందున్నారు, వెంటేశ్వర్రా గారింటికొచ్చి పొయ్యే ఆయనన్నదమ్ములు, స్నేహితులు, వాళ్ల కొడుకులు కూడా వున్నారు. మా అమ్మ, అత్త యింకా చాలా మంది యేడుస్తా నే వున్నారు. నేనింతకు ముందు చూడనోళ్లు కూడా చాలా మందున్నారు. నాకు నోట్లో నుండి సరిగ్గా మాట రాటంలేదు. చూపు వాలి పోతుంది.

మాఅత్తని ఆనుకొని కూర్చున్నాను. యెట్లాగో ఆగి, ఆగి, – ఆరోజు నేను బడి నుండి వచ్చాక చూసిందిచెప్పాను. వానకాస్త తెరి పిచ్చి నట్టుంది. వెంకటేశ్వర్రావుగారు పెద్దన్నయ్య అప్పు డప్పుడు ఆయనింటికి వచ్చేవాడు. పెద్ద కుర్చీలో మాట్లాట్టం మొదలుపెట్టాడు. "మాది నిప్పుని కడిగే వంశం, నియమ నిష్టలతో ఆచార సంప్రదాయాలతో జీవితాన్ని గడిపేవాళ్లం. మా వొక్కగానొక్క చెల్లెలు శూద్రుణ్ణి పెళ్లాడిందని దానికి పిండం బెట్టాం! యిప్పటికీ మడి లేకుండా వంట చెయ్యం. అలాంటిది, వొక కడజాతి ఆడపిల్లని నా తమ్ముడు తాకుతాడా...అలా యెప్పటికీ జరగదు. యింట్లో లక్ష్మీదేవిలాంటి భార్యని పెట్టుకొని అలాంటి అప్రాచ్యపు పని

**కవిత**

## మానవత్వాన్ని బ్రతికించు...



నేను వ్రాయాలనుకొన్న అక్షరాల్ని
నేనెలా తెలపాలో తెలీడం లేదు.
నా అనుభవాన్ని నేనే వ్రాసుకొని
నా అయిష్టాన్ని నల్గుర్లో చెప్పాలనుకొంటున్నా
నా ఆడబిడ్డను భూమ్మీదకు రాకుండా చేయాలని
నా కడుపుని విచ్చిన్నం చేసి
నాకు మాతృత్వాన్ని దూరం చేస్తే
నాకు వాళ్ళ గుండె చీలిపోవడం చూడాలన్పిస్తోంది!
జీవితాన్ని, మాతృత్వాన్ని వేరేచేయడం
జీవితంలో సాదాసీదా వ్యవహారం కాదని
చేతలు, మాటలు ముద్దులు కురిపించినా
చెత్త మాటలుగా గ్రహింపుకొస్తున్నాయి
అతలా కుతలం చేసే గర్భస్రావానికి
అత్తగారైనా, భర్తగారైనా వొత్తిడి చేస్తే
ఆడపుట్టుకనే అంతం చేయాలంటే
ఆడదానిగా, మౌనం వహించక అంగీకరించకూడ దన్పిస్తోంది.
ఆడపిల్ల పుట్టినాక, వధించి వొదిలించుకోవాలనే వారికి
ఆడవారు అలజడి చేసి ముప్పుతెస్తారని
కడతేర్చేదీ ఆడవారేననే కఠోర సత్యాన్ని తెలిపి
ఆడపిల్లని రక్షించి, 'మానవత్వాన్ని బ్రతికించు'

– డోర్నాదుల సుబ్బమ్మ

# 'అల్పత్వం'



పయనించీ, పయనించీ అలసి సొలసిన జీవనదులను
తన తరంగాల పరిష్వంగాలలో ఊఅడిల్లజేస్తూ,
కోటిజలచరాలు అర్చించుకునే కోవెలగా విలసిల్లుతూ,
గర్భంలో అగ్నిపర్వతాలు బ్రద్ధలౌతున్నా గమనంలో తేడా రానీయకుండా
సహనశీలతను చాటే
సముద్రంముందు అల్పుణ్ణైపోతున్నాను!

వివిధ కాలుష్యాలతో మనిషి తనకు విపత్తు కల్గిస్తున్నా,
నిమిషమైనా అలగి స్థంభించని
గాలిముందు నేను ధూళిరేణువునై పోతున్నాను!

తన వక్షస్థలంపై మనిషి మారణహోమాలు నిర్వహిస్తున్నా!
విసిగి విలయాన్ని సృష్టించని
విశ్వంభరముందు లవలేశమైపోతున్నాను!

వికృతకృత్యాలతో, విషయలాలసలతో
విషాదాలతో, విషగంధాలతో నిండిన విశ్వంలో
తన దారిన తాను
అందమూ, మరందమూ, సుగంధమూ వెదజల్లుతూ
మహికి మనసైన మనోహరత్వాన్ని అందించే
సుమరాణులముందు నేను సూక్ష్మమైపోతున్నాను!

ప్రకృతి ప్రకోపించినా, గూడు చెదిరినా,
గుప్పెడంత గుండెను బెదరిపోనీయకుండా
నిబ్బరంగా వుండే గువ్వముందు నేను స్వల్పమైపోతున్నాను!

ఆ కడలి సహనం,
ఆ పవన సుగుణం,
ఆ వసుధ వర్తనం,
ఆ సుమన జీవనం,
ఆ విహంగం భావగ్రంథనం,
ఎంతో కొంత నాకూ అందివుంటే,
జీవితం ఇలా ఊరక ఊసరిల్లిపోకుండా
ఎంత ఉన్నతంగా వుండేదోకదా!

**– ఎరుకలపూడి గోపీనాధరావు**

చెయ్యడుగాక చెయ్యడు...నీతి జాతీలేని కులం తక్కువ ముండా కొడుకుల్లారా! పాపమని యింట్లో బెట్టుకొని ఆదరిస్తే నా తమ్ముడు మీద నిందలు మోపుతారా! అభాండాలు వేస్తారా? యేమనుకుంటున్నారో యిరవై నాలుగ్గంటల్లో యిల్లు ఖాళీ చెయ్యాలి...''చిటికెలు వేస్తూ, చూపుడువేలు చూపిస్తూ మాట్లాడతానే వున్నాడు. నాకా తర్వాత యేమి విన్పించలేదు. బట్టల్లేని నా శరీరాన్ని మళ్లి తన పెద్ద పెద్ద పాము పడగ ల్లాంటి చేతులతో తాకుతూనే వున్నాడు... నులక మంచం సందుల్లోంచి కారిన రక్తంలో వెంకటేశ్వ ర్రావుగారి మురికి జందెం బక్కెట్లో జాడించే బట్టలాగా మునిగిలేస్తానే వుంది.

ఆ తర్వాత నేను హైస్కూల్ కొచ్చాక కూడా - నల్లగా, వుబ్బిపోయి, నానిపోయి, బావిలో తేలిన మరియ ఎదురుగా వచ్చి నిల బడేది. నడుచుకుంటూ వచ్చి నాపక్కలో పడుకు నేది. మరియా, నన్ను గట్టిగా వాటేసుకో, నా వీపుకి ఆనుకొని పడుకో, మరియా యాడ వొద్దూ, యాడవొద్దూ'' అని రాత్రుల్లో గట్టి గట్టిగా అరచేదాన్ని. అంతరుపుల్లోనూ, 'మాది నిప్పుని కడిగే వంశం...కడజాతి ఆడపిల్లని నా తమ్ముడు తాకుతాడా...''అనే మాటలు నాచెవిలో మాట్లాడి నట్టే వినబడేవి. మళ్ళీ యిన్నేళ్ళకి యిలాంటి మాటలే వొక న్యాయమూర్తి మాట్లాడాడు. వెంకటేశ్వర్రావుగారి చెక్క కుర్చీలో కాకుండా, అత్యున్నత ధర్మాసనం మీద కూర్చొని మాట్లా డాడు. రాజస్థాన్‌లో అగ్రకులస్థులు సామూహి కంగా రేప్ చేసిన దళిత స్త్రీ భన్వారీదేవి కేసులో తీర్పునిస్తూ ''ఒక అగ్రకులానికి చెందిన వ్యక్తి తక్కువ కులం స్త్రీని రేప్ చేయడం ద్వారా తనని తాను కింపరచుకోడు'' అని కేసుని కొట్టేశాడు.

పొద్దున పేపర్లో యెక్కడో వో మూల నాలుగు లైన్లలో వచ్చిన ఆ ఆవార్తని చూసినప్పటి నుంచి, వెంకటేశ్వర్రావుగారి తెల్లటి వీపు మీద మురికి జందెమూ, మల్లిగాడి పడగలాంటి చేతులూ నాకళ్ల ముందుకొచ్చి యెగతాళిగా నవ్వుతున్నాయి. బావిలో వుబ్బిపోయి నల్లగా పైకి తేలిన మరియ యింకా వెక్కి వెక్కి యేడుస్తానే వుంది.

''ఒక కడ జాతి ఆడపిల్లని నాతమ్ము డు...రేప్ చేయడం ద్వారా తనని తాను కించ పరుచుకోడు'' నా చెవుల్లో వినబడతానేవున్నాయి. బయట తెల తెలవారుతోంది. సన్నగా వర్షం కురుస్తానే వుంది.

(సమాప్తం)

శ్రీమతి లిల్లీ భాస్కర్

# తప్పితేదారి - పడతారు జారి

ఎవడైనను వాక్యము వినువాడై యుండి దాని ప్రకారము ప్రవర్తింపనివాడైతే వాడు అద్దంలో తనసహజ ముఖమును చూచుకొను మనుష్యుని పోలిన వాడైయున్నాడు.(యాకోబు 1:23) అంటే బైబిలు అద్దం వంటిది. దానిలోని తరచి చూస్తే మనమేమిటో స్పష్టంగా తెలుస్తుంది. దాని ప్రకారం మనము సరిదిద్దు కోకపోతే త్వరలోనే మర్చిపోతాము, అందుకే అద్దం ముందు ఇష్టం వచ్చినంత సేపు చక్కగా తయారైనా బయటికి వెళ్ళేముందు అద్దంలో మరొకసారి చూసుకొని బయటికి వెళ్తాము. ప్రియయౌవ్వన బిడ్డలారా జరిగిన వాస్తవాల్ని మీముందుంచి కడవరి దినాల్లో హెచ్చరించాలని అద్దమనే జీవగ్రంధములోని కొన్ని సత్యాల్ని మీముందుంచాలని ఆశించుచున్నాను. సామాజిక పరిస్థితులను బట్టి యువతరం చెడు వ్యసనాలకు బానిసలై అంత్యదినాల్లో ప్రేమలు చల్లారి పోయినందున జన్మనిచ్చిన తలిదండ్రుల ప్రేమను గుర్తించక స్నేహితులతో విచ్చలవిడిగా తిరుగుతూ విలాసాలకు తావిచ్చి దేవునికి దూరంగా ఉంటున్నారు. వీరిని మార్చడం ఎవరితరమూ కాదు. బాలుని హృదయంలో మూఢత్వము స్వాభావికముగా పుట్టును. శిక్షాదండము దానిని తోలివేయును. (సామె 22:15) అంటే అందరం పాపం, మూర్ఖత్వంతో కూడిన స్వభావంతోనే పుట్టాం. కాబట్టి పిల్లలకు క్రమశిక్షణదిద్దుబాటు అవసరమే. అందుకే "నా కుమారుడా నీ తండ్రి ఉపదేశము ఆలకింపుము. నీతల్లి చెప్పుబోధను త్రోసి వేయకుమని " (సామె 1:8,6:20) రాజైన సొలోమోను తెలియజేసెను.



చాలాకాలం క్రిందట జాక్‌హైల్ అనే బాలుడు స్కూలుకి వెళ్ళునప్పుడల్ల తన తల్లి జాగ్రత్తలు చెప్పుండేదట. ఒకరోజు పిక్‌నిక్ వెళ్తున్నప్పుడు మరెక్కువ జాగ్రత్తలు చెప్పి హెచ్చరించి, అల్లరి పిల్లలతో కూడవద్దని, వారి మాటలు వినవద్దని, వారు చెప్పినట్లు చెయ్యవద్దని చెప్పిందట. "బాలుడు నడువవల్సిన త్రోవను వారికి నేర్పుము. వాడు పెద్దవాడైనపుడు దాని నుండి తొలగిపోడని (సామె 22:6) సొలోమోను చెప్పిన మాటల్ని ఆమె ఆచరణలో పెట్టింది. గనుక ఆ అబ్బాయి అల్లరి పనులు, చిలిపి చేష్టలు, ఇతర పిల్లల్ని ఏడ్పించడం, పెద్దవారి పట్ల అమర్యాదగా ప్రవర్తించడం లాంటివి చేయకుండ వినయం, విధేయత లోబడే స్వభావం కలిగి తల్లి ఉపదేశములను మనస్సునందుంచుకొని శ్రద్ధగా చదువు చుండేవాడట. తన స్నేహితులు అతన్ని హేళన చేస్తూ, పరిహసిస్తూ, ఎందుకు పనికిరానివాడని చిన్నచూపు చూసేవారట.

వారంతా పెరిగి పెద్దవారై ఎవరి మార్గాలు వారు వెతుక్కొని జీవితాలు సాగిస్తున్నారు. జాక్‌హైల్ మాత్రం విదేశాల్లో చదువు ముగించుకొని స్వదేశానికి తిరిగివచ్చి చిన్ననాటి స్నేహితులను కలిసికొ నుటకు ఒక్కొక్కరి దగ్గరకు వెళ్ళాడట. ఇంకే ముంది. చితికిన బ్రతుకులు, చాలి చాలని జీతాలతో, అప్పుల బాధలతో, వాటిని ఎదు ర్కొనుటకు పడే అవస్థలు, కుటుంబాన్ని పోషించే స్తోమత లేక విసిగివేసారి అనారోగ్య పరిస్థితు లను కోరితెచ్చుకొని జీవితాన్ని భారంగా మోస్తున్నారట. ఇది చూచి జాక్‌హైల్ తల్లడిల్లి పోయాడట. విచారించుట తప్ప ప్రయోజనం లేకపోయింది. జాక్‌హైల్ మాత్రం అందరికంటె అత్యధికంగా దీవించబడి ఉన్నత స్థితిలో ఉంటూ అనేకులకు ఉపయోగకరంగా ఉన్నాడు.

పాపులు ప్రేరేపింపగా ఒప్పుకొన నందున దేవునిచే ఆశీర్వాదించబడిన మోషే, యోసేపు, ఎస్తేరుల, జీవితాల్ని జీవగ్రంథమందు చూద్దాము. అద్దం లాంటి జీవగ్రంథమందు వ్రాయబడిన వారు ఏవిధముగా ఆశీర్వదించబడ్డారో చదివి మనము జీవితాల్ని సరిచేసుకొందాము.

**మోషె :** లేవి కుమార్తె కుమారుని కని సుందరుడైయుండుట చూచి 3 నెలలు వారిని దాచి తరువాత జమ్ముపెట్టెకు జిగటమన్ను, కీలునుపూసి అందులో పిల్లవాణ్ణిపెట్టి యేటి ఒడ్డున ఉంచెను. ఫరో కుమార్తె స్నానము చేయుటకు యేటికి వచ్చినప్పుడు ఆమె పనికత్తెలు యేటి ఒడ్డున నడుచుచుండగా ఆమె నాచులోని పెట్టెను చూచి పనికత్తెను పంపి దాన్ని

తెప్పించి, తెరచి, ఆపిల్లవాడు ఏడ్చుచుండగా చూచి వానియందు కనికరపడి వీడు హెబ్రీయుల పిల్లవాడనెను. దగ్గరుండి గమనిస్తున్న అక్క ఫరో కుమార్తెతో – నీకొరకు ఈ పిల్లవాని పెంచుటకు నేను వెళ్ళి హెబ్రీ స్త్రీలలో ఒకదానిని పిలుచుకొని రానా? అని అడిగి ఆపిల్లవాని తల్లినే తీసుకొని వచ్చెను. ఫరో కుమార్తె ఆమెతో – ఈ బిడ్డను తీసికొనిపోయి నా కొరకుపాలిచ్చిపెంచు. నీకు జీతమిచ్చెదనని చెప్పగా ఆమె బిడ్డను తీసికొనిపోయి పాలిచ్చి పెంచెను. ఆ బిడ్డ పెద్దవాడైన తరువాత ఫరో చక్రవర్తి కుమార్తెకు కుమారుడాయెను. (నిర్గమ 2:1-10)

పెద్దవాడైన మోషే విశ్వాసమును బట్టి ఐగుప్తు ధనముకంటె క్రీస్తు విషయమై నింద గొప్పభాగ్యమని, అల్పకాల పాపభోగములు అనుభవించుటకంటె దేవుని ప్రజలతో శ్రమలను భరించుట మేలని యెంచి ఫరో కుమార్తె యొక్క కుమారుడని అనిపించుకొనుటకు ఒప్పుకొనక దేవుని కొరకు నమ్మకంగా నిలిచినందున (హెబ్రి 11:24,25) నలుబది సంవత్సరములు గడచిన తరువాత సీనాయి పర్వతమందు ఒకపొదలో మండుచున్న అగ్నిజ్వాలలో దేవదూత కనపడి ఐగుప్తులోనున్న నా ప్రజలు దురవస్థను చూచి, వారి మూలుగులింటిని వారిని విడిపించుటకు ఇప్పుడు నిన్ను ఐగుప్తునకుపంపెదను. నిరాకరించిన వారిపై నిన్ను అధికారిగాను, విమోచనకునిగాను నియమించెదనని చెప్పెను. (అపొ.కా 7:30-35)

**యోసేపు:** యోసేపు ఇశ్రాయేలుకు వృద్ధాప్యము నందు పుట్టిన కుమారుడు గనుక తన కుమారులందరికంటె అతనిని ఎక్కువగా ప్రేమించి విచిత్రమైన నిలువుటంగీ ధరింపచేసి నందున అతని సోదరులు అతనిపై పగపట్టిరి. ఒకసారి అతడు కనిన కలను చెప్పగా అతని సోదరులు నీవు మమ్మును ఏలెదవా? మామీద అధికారివా? అని మరింత పగపెంచుకొనిరి. రెండవసారి కన్న కలను గూర్చి చెప్పినపుడు తండ్రి గద్దించెను. సోదరలు మరింత పగ పెంచుకున్నారు.

యోసేపు సోదరులు తమ తండ్రి మందను మేపుచుండగా వారి క్షేమ సమాచారము కనుక్కోమని యోసేపును పంపినపుడు దూరము నుండి చూచి కలలు కనువాడు వస్తున్నాడు వానిని చంపి గుంటలో పారవేయుదమని చెప్పుకొనుచుండగా రూబేను–అతన్ని చంపకుండ పై నిలువుటంగీతీసి గుంటలో త్రోసివేయుమని సలహా ఇచ్చెను.

యూదా సలహా ప్రకారము 20తులముల వెండికి మద్యానీయులకు అమ్మివేసిరి. వారు ఐగుప్తునకు తీసికొనిపోయి ఫరో యొక్క ఉద్యోగస్థుడును, రాజసంరక్షక సేనాధిపతియునైన పోతీ ఫరునకు అమ్మివేసిరి. (ఆది.కా 37అధ్యా) యెహోవా యోసేపును తోడైయున్నందున బహుగా వర్ధిల్లుచు అతడు చేసినవి యావత్తు యెహోవా సఫలము చేసెనని యజమానియైన పోతీఫరు గుర్తించి తన యింటిమీద విచారణ కర్తగా నియమించి తనకు కలిగిన సమస్తమును అతని చేతికి అప్పగించెను. (ఆది.కా 39:2-4) నాటి నుండి పోతీఫరు యింటిని తనకు కలిగిన సమస్తాన్ని ఆశీర్వాదించెను.

యోసేపు రూపవంతుడు సుందరుడై నందున యజమాని భార్య తనతో శయనించమని చెప్పెను. అయితే అతడు ఒప్పుకొనక నా యజమాని తనకు కలిగినదంతము నాచేతి కప్పగించెను. ఈయింటిలో నాకంటె పైవాడు ఎవడును లేడు. నీవు అతని భార్యవైనందున నిన్ను నాకప్పగించలేదు. కాబట్టి నేనెట్లు ఇంత ఘోరదుష్కార్యము చేసి దేవునికి విరోధముగా పాపము చేసెదనని ఈమెతో అనెను.

రెండేండ్లు గడిచిన తరువాత ఫరో కన్న కల భావమును దానికి సమయోచితమైన ఆలోచన తెలియచేసినపుడు ఫరో – ఇది దేవుడే నీకు తెలియపరచెను. నీవంటి జ్ఞానము గలవారెవరను లేరు. నీవు నా యింటికి, రాజ్యానికి అధికారివైయుండాలి. నా ప్రజలందరు నీకు విధేయులైయుందురని ఫరో చేతి ఉంగరముతీసి యోసేపు వ్రేలికి పెట్టి, సన్నపు నారబట్టలు ధరింపచేసి మెడలో బంగారపు గొలుసు వేసి తన రెండవ రథముపై కెక్కించగా జనమంతయు వందనము చేస్తూ కేకలు వేయగా ఐగుప్తు దేశానంతటికి అధికారిగా ప్రకటించుట ద్వారా తన చిన్నప్పుడు కన్న కలను నిజము చేసాడా దేవుడు. (నిర్గమ 41:1-43)

**ఎస్తేరు:** రాజైన అహష్వేరోషు ఏలుబడి యందు మూడవ సంవత్సరమున అధిపతులకు, సేవకులకు విందుచేయించి పారశీక మాద్య దేశము యొక్క పరాక్రమశాలులకు, ఘనులకు సంస్థానాధిపతులకు తన రాజ్యము యొక్క మహిమా ఐశ్వర్యములను, ప్రభావమును, మహత్యాతిశయము, ఘనతను 180 దినాలు కనపరచి కోటలోనున్న ఘనులకు, అల్పులకు జనులందరికి రాజు కోట ఆవరణములో 7దినములు విందుచేయించి, కూడి వచ్చినవారందరికి బంగారు పాత్రలలో పానమిచ్చుచు రాజు స్థితికి తగినట్టుగా ఎవడు కోరినది వారికి పెట్టవలెనని ఆజ్ఞ ఇచ్చెను. రాణియైన వష్తికి కూడ కోటలో విందు చేయించెను.

ఏడవ దినమందు రాజు ద్రాక్షారసము త్రాగి సంతోషముగా ఉన్నప్పుడు కూడివచ్చిన జనులందరికి రాణియైన వష్తికి సౌందర్యమును కనపరచలేదని రాజు కిరీటము ధరించిన ఆమెను తన సన్నిధికి పిలుచుకురమ్మని 7గురు షపుంసకులకు ఆజ్ఞాపించెను. రాజాజ్ఞ ప్రకారము వచ్చుటకు రాణియైన వష్తికి ఒప్పుకొనలేదు. గనుక రాజు మిగుల కోపించెను. (ఎస్తేరు 1:12)

వష్తికి అన్యురాలైనప్పటికి పరోక్షముగా దేవుని చిత్తం నెరవేర్చినందున ఆ స్థానంలో అందమైన యోగ్యురాలైన ఎస్తేరుని రాణిగా ఎన్నుకొన్నందున యూదా జనాం గాన్నంతటిని రక్షించుకొన్నది.

దేవుని యందు వినయము, విశ్వాసము, విధేయత గల మోషేవలె, లోక సంబంధమైన ఆస్తులు అంతస్తులు ధనధాన్యాలు భోగభాగ్యాలు, శరీర సుఖాలు ఆశించక దేవుని యందు భయభక్తులు గల యోసేపువలె, వినయ విధేయతలు ప్రేమానురాగాలు, ధైర్య సాహసాలు దేవుని యందు భయభక్తులు గల ఎస్తేరువలె పాపులు ప్రేరేపించినా ఒప్పుకొనకపోతే మనమూ ఆశీర్వాదించబడతాము.

దేవుడు మిమ్మును ఆశీర్వదించును గాక.



**స్వర్ణదీపిక** టి.వి కార్యక్రమాలు; ఆరాధన టి.విలో ప్రతి శనివారం ఉదయం 10.00 నుండి 10.30 వరకు **ఆచార్య మత్తి నిర్మలానందగారు** వాక్యోపదేశము చేయుదురు. ప్రతి రెండవ శనివారం చిన్నపిల్లలకు ప్రత్యేక సందేశము. వినండి విశ్వసించండి ఇతరులకు తెలియజేయండి. ఆత్మీయాభివృద్ధి పొందండి.

వల్లూరి రాఘవరావు

# ప్రార్థనలో రహస్యం

ఒకసారి పొంగిపోతాం
మరోసారి కుంగిపోతాం
ఆలోచనలు వెల్లువెత్తితే
అనుభూతుల్లో మునిగిపోతాం
ఆ తలపు తలుపులు తెరిస్తే
ఆ మనసు మలుపులు తెలిస్తే
కొత్త ఉత్సాహం... కొంగొత్త
ఉత్తేజం
ఆ సరాగాల్నీ, సంగతుల్నీ
ఒకచోట చేరిస్తే
అదే...
మన హృదయాంతరంగం

**అ**తడు విపరీతమైన దాహంతో అల మటిస్తూ ఓ లోతైన బావి దగ్గరికి వచ్చాడు. అక్కడ ఉన్న బొక్కెన తీసుకొని బావిలోకి వేశాడు. మహాలోతైన బావి అది. చేతులు పడిపోయేలా నీళ్ళు తోడాడు. బొక్కెన పైకి లాగాడు. చుక్క నీరుంటే ఒట్టు. మళ్ళీ దాన్ని బావిలోకి వేశాడు. పైకి లాగాడు. అదే దృశ్యం! బొట్టు నీరైనా లేదు అందులో!! అప్పుడు చూశాడు బొక్కెనకేసి, ఆబొక్కెన నిండా చిల్లులే! తోడిన నీరు తోడినట్టు జారిపోయింది. సరిగ్గా మన పరిస్థితి ఇలాగే ఉంది. జీవన దాహంతో మనసు అనే బొక్కెనను ప్రపంచం అనే లోతైన నూతిలోకి హడావుడిగా జార్చేస్తాం. భ్రమలు, అనుమానాలు, వ్యసనాలు, అహంకారాలు, భయాలు అనే చిల్లులతో మనసు బొక్కెన పాడైపోయిన సంగతి అంత త్వరగా గ్రహించం. నీళ్ళు లేవని బావినీ, మంచిలేదని లోకాన్నీ నిందిస్తాం. చివరకు పొడారిన ఎడారిలా రగిలిపోతూ మిగిలిపోతాం.

మనసు బాగా లేకపోవడానికి కారణం నిశ్చయంగా మనమే! మనసనేది ఓ వాహనం అది మనని ఓ గమ్యం దిశగా తీసుకెళుతుంది. మీ గమ్యాన్ని బట్టి మీ వాహనపు పరుగు మారుతుంది. కొన్నిసార్లు అది విమానం అవుతుంది. కొన్ని సార్లు బస్సు అవుతుంది. కొన్నిసార్లు ఓడ అవుతుంది. ఏగమ్యమూ, ఆశయమూ లేనివాళ్ళు విమానం రెక్కలు కత్తిరించి, బస్సుకు బిగించి పరిగెడతారు. వాళ్ళది వేరే కథ. మనసనేది అతి శక్తివంతమైన యంత్రం. దాన్ని దుర్వినియోగం చేసుకొనేకొద్దీ జీవన యానంలో గతుకుల ప్రయాణం తప్పదు. మనసనేది అత్యంత వేగంతో తిరిగే మహాయంత్రం. ఈ వేగాన్ని కొన్నిసార్లు నియంత్రించకతప్పదు. ఏదైనా ఓ వస్తువును పరిశీలనగా చూస్తున్నప్పుడు మనసు వేగం తగ్గుతుందనేది మనకు అనుభవమే. ఏవైనా ప్రార్థన పదాలు పదే పదే పునరుక్తి చేయడం వల్ల కూడా జరిగేది ఇదే! మహిమ అనేది, ప్రార్థన తాలూకు పదాలు, వాటి అర్థాలలోలేదు. మనసు నెమ్మదించడంలో ఉంది.

దైవం, ప్రార్థన అనే కాన్సెప్టు పుట్టింది ఇక్కడే! మనసు వేగానికి సడన్‌బ్రేక్ వేయడమే పిచ్చితనం అంటే!! ప్రార్థన, ధ్యానం, నిశ్శబ్దం అనేవి యాక్సిలేటర్లే కానీ బ్రేకులు కావు. మనసు బండిని భద్రంగా నడపడమే స్వీయజ్ఞానం. దీనికి గురువులు ఉండరు. ఎవరికి వారే ప్రాక్టీస్ చేయాల్సిన సైకలాజికల్ డ్రయివ్ ఇది. నిర్దుష్టమైన ప్రార్థనలతో ఏకాగ్రత వహిస్తే మనసు వేగం తగ్గి ప్రాపంచిక వాస్తవం కనిపిస్తుంది.

ప్రపంచమనే రహదారిపై మనసు వాహనాలు పరస్పరం ఢీకొని, హత్యలూ, ఆత్మహత్యలనే ప్రమాదాలు చేస్తున్నాయి. డాట్‌కామ్ చదువులూ, డాలర్ల వెంట పరుగులూ, కరోడ్‌పతి వెంపర్లాటలూ, ఇంటర్నెట్ ప్రేమలూ, ఇ-మెయిల్ పలకరింపుల మధ్య పరుగు పెడుతున్న ఈ తరం, రోజులో కనీసం పదినిముషాలైనా మనసుకు కాస్తంత విశ్రాంతిని ఇవ్వాలి. నాస్తికులైతే కాసేపు ఏకోరికా, ఆలోచనా చొరబడని నిశ్శబ్దాన్నీ, ఆస్తికులైతే ఏదేవిరింపూ, ఏప్రయోజనం ఆశించని స్థితిలో ప్రార్థన చేయాలి.

ఇది ఎవరినో ఉద్ధరించడానికి కాదు. మన గాయాలకు మనమే మందు వేసుకోవాలి. మనసు ప్రశాతంగా ఉండటమే జీవితానికి గొప్పవరం. అదే అసలైన సంపద! ★



వ్యాసం

# క్రైస్తవ సంఘ క్రమశిక్షణ



రెవ.కె.జాన్ మోజెస్

క్రైస్తవ సంఘాలలో క్రమశిక్షణారాహిత్యం పెచ్చు పెరిగిపోతుంది. సంఘాలలో సరైన బోధ కరువైంది. మనుష్యులు కల్పించిన చట్టాల ద్వారా సంఘాలలో క్రమశిక్షణ తేవాలని చాలామంది ప్రయత్నిస్తున్నారు. ఏది వాక్యానుసారమైనదో సంఘసభ్యులు తేల్చుకోలేకపోతున్నారు. పరిశుద్ధగ్రంథంలో నిర్దేశించబడిన సూత్రాలమేరకు మన జీవితాలు కొనసాగించబడాలి.

క్రైస్తవ సంఘానికి దేవుడు కొన్ని పేర్లు యిచ్చాడు. "క్రీస్తుశరీరం" "దేవుని ఆలయం" "పరిశుద్ధుల సమూహము" క్రమశిక్షణ అంటే ఒక వ్యక్తి ఏదైనా తప్పుచేసినప్పుడు సరిదిద్దడం. అవసరమైతే తర్ఫీదు యివ్వాలి. బోధ చెయ్యకుండా ఏ సంఘం కూడా దేవుడు కోరుకున్న విధంగా



వుండలేదు. 2 తిమోతి 2:2లో పౌలు తిమోతికి రాస్తూ "అనేక మంది సాక్షుల సమక్షంలో నేను చెప్పిన విషయాలు నీవు విన్నావు. వాటిని ఇతరులకు బోధించగల నమ్మకమైన మనుష్యులకు అప్పగించు" అని హెచ్చరించాడు.

అలాగే శిష్యులకు యేసయ్యకూడా "నేను మీకాజ్ఞాపించిన వన్నీ వారికి ఉపదేశించండి" అన్నారు. క్రైస్తవునికి క్రైస్తవ జీవితమంటే ఏమిటో ముందు తెలిసికొని వుండాలి. భక్తపౌలు ఎఫెసులో వున్న సంఘాన్ని ప్రార్థనలో జ్ఞాపకం చేసుకుంటూ "మీ మనోనేత్రాలు వెలుగొందాలనీ, తద్వారా ఆయన దేనికోసం మిమ్ముల్ని పిలిచాడో దాని ఆశాభావం మీరు తెలుసుకోవాలని నా ప్రార్థన" అంటూ అభ్యర్థిస్తున్నాడు.

క్రైస్తవ జీవితానికి పునాదిరాయి క్రీస్తు. క్రైస్తవుడిగా బ్రతకడం అంటే క్రీస్తుకోసం జీవించటం. సంఘ సిద్ధాంతాలకు కట్టుబడి వుండటం క్రైస్తవ జీవితం కాదు. కాని క్రీస్తుకు లోబడి వుండటం, హెచ్చరిక చేయడానికి సంఘ కట్టుబాట్లు ప్రభావం వుంటుందేమో కాని, అంతకంటే దేవుని వాక్కు చేత ప్రభావితం కావాలి.

క్రైస్తవ జీవితమంటే ఏమిటో, ఎలా జీవించాలో ఈ విషయంలో బైబిలు ఏమి చెబుతుందో దైవ సేవకులు వాక్యాన్ని పరిశోధించి సంఘంలో బోధించాలి. సేవకుడు దైవిక సూత్రాలతోనే కాక, జీవన విధానాలలో అవినాభావ సంబంధం కలిగి వుండాలి. దేవుని వాక్యము క్రైస్తవ జీవితం గురించి ఇలా చెబుతుంది. "మీరు నిరపరాధులును, నిష్కళంకులును, నిందారహితులును, దేవుని కుమారులను అగునట్లు సణుగులును, సంశయములును మాని సమస్త కార్యములను చేయండి. అట్టి జనముల మధ్య మీరు జీవవాక్యము చేత పట్టుకొని లోకమందు జ్యోతులవలె కనబడుచున్నారు.

చాలామంది ఈ రోజుల్లో దేశానికి, ప్రభుత్వానికి క్రమశిక్షణ కావాలంటారు గాని, వ్యక్తిగతంగా క్రీస్తుకోరిన జీవనవిధానం వారిలో మచ్చుకైనా కనిపించదు. చట్టం ప్రకారం శిక్షించడానికి, తీర్పు చెప్పడానికి న్యాయసూత్రాలలాగా దైవిక సూత్రాలు వుంటే చాలదు. సంఘం, విశ్వాసులు తమ దైనందిన జీవితంలో క్రైస్తవుడిగా జీవించడానికి సహాయం చెయ్యాలి. క్రైస్తవ జీవితంలోని ఒడుదుడుకులు, బలహీనతలు సహోదర ప్రేమతో మటుమాయమవుతాయి. సంఘమంతా క్రమశిక్షణకు లోబడి, ఆధ్యాత్మిక పంథాలో సభ్యులను నడిపిస్తూ సంఘకాపరి కనిపెడుతూ, బోధిస్తూ, లోపాలను సవరిస్తూ వుండాలి.

క్రైస్తవుడి మనసు, శరీరం దైవవాక్కు, దైవాత్మలో ప్రభావితం కావాలి. పవిత్రాత్మ ఆధీనంలో వుండాలి. లోక సంబంధమైన మనుష్యులపై పెత్తనం చేసే లోకాశ మొదలైనవి క్రైస్తవుని ఏలకూడదు. వాటికి దూరంగా వుంటూ పవిత్ర జీవితం జీవించాలి. ఫిలిప్పి 4:8 ప్రకారం ఈ లోక సంబంధమైన కోరికలను అదుపులో పెట్టుకొని విశ్వాసుల పరిశుద్ధంగా దేవునికి అనుకూలంగా వుండే బ్రతుకు బ్రతకాలి. "సోదరులారా, ఏవి నిజమైనవో, ఘనమైనవో, న్యాయమైనవో, శుద్ధమైనవో, అందమైనవో, మంచి పేరు గలవో వాటిని తలపోస్తూ వుండండి.

క్రియాత్మక క్రైస్తవజీవితానికి ఓ వ్యక్తి శరీర అవయవాల్లో కూడా ఐక్యత వుండాలి. చాలామంది ఈ రోజుల్లో ఆదివారం నాడు మాత్రమే క్రైస్తవులుగా కనిపిస్తారు. వారంలో మిగిలిన ఆరురోజులు దేవుడితో మాకు పనేలేదన్నట్లు బ్రతుకుతారు. ఆదివారం నాడు బైబిలు భాష మాట్లాడుతారు. మిగతా రోజుల్లో ప్రపంచభాషలో సంభాషిస్తారు.

దేవుని వాక్యానికి విధేయత కానివాడు, సంఘంలో దేవుని వాక్కు ద్వారా వచ్చే క్రమశిక్షణకు కూడా లోబడడు. దేవుని వాక్యంపై

ఆధారపడి దాన్ని అనుభవిస్తూ, అనుసరించే క్రైస్తవుడే సంఘ పురోభివృద్ధికి తోడ్పడగలడు.

సంఘంలో క్రమశిక్షణ అర్థవంతం, ప్రయోజకత్వం కావాలంటే సంఘీభావం ఎంతైనా అవసరం. సంఘంలో ఐకమత్యం తగ్గుముఖం పడితే, పాపాన్ని ఖండించడానికి కూడా ఆ సంఘం వెనుకంజ వేస్తుంది. సంఘంలో విశ్వాస ప్రమాణాన్ననుసరించి క్రీస్తులో ఐక్యత కలిగించాల్సిన బాధ్యత దేవుని సేవకులపై వుంది. సంఘం బెంబేలు పడిపోయే పసిపిల్లాడిలాగా వుండకుండా దేవుని కుమారుడైన క్రీస్తు రొమ్మున ఆనుకునే అనుభవానికి రావాలి.

రాయబారి పౌలు ఎఫెసులో వున్న సంఘాన్ని వుద్దేశించి ఈ మాటలు రాస్తున్నాడు ఈవిధంగా మనమందరమూ నమ్మకంలోనూ, దేవుని కుమారుణ్ణి గురించిన భావంలోనూ ఏకీభావం పొంది, ఆధ్యాత్మికంగా ఎదిగి, క్రీస్తులో వున్న సంపూర్ణస్థాయి అందుకునే వరకూ యిలా జరగాలనే ఆయన ఉద్దేశం. ప్రేమతో సత్యం పలుకుతూ క్రీస్తుశరీరంలో భాగాలైన మనం అన్ని విషయాల్లో ఎదగాలి. క్రీస్తేశిరస్సు. ఆశిరస్సు నుంచి శరీరమంతా అన్నికీళ్లచేత ఏకమై చక్కగా అమర్చబడి వుంది. శరీరంలోని ప్రతిభాగం సరిగా పనిచేస్తుంటే శరీరం పెంపొందుతూ ప్రేమతో ప్రవర్థిల్లుతుంది. (ఎఫెసీ 4:12-16)

సంఘం ద్వారా కూడా తీర్పు వుంటుంది. ఈ విషయాన్ని రాయబారి పౌలు 1కొరింధి 5:13లో 2కొరింధి 2:6లో "అలాంటి వాని మీద మీలో అధిక సంఖ్యాకులు విధించిన శిక్ష చాలు" అంటున్నాడు. ఇది న్యాయ సింహాసనం నుండి వచ్చిన తీర్పుకాదు గాని సిలువనుండి జరిగిన తీర్పు. దేవుని వాక్యానికి, పవిత్రాత్మకు విధేయత చూపుతూ, ప్రభువును ప్రేమిస్తూ, అంతర్వాణి నిర్మలంగా వుండే సోదరులు సంఘ క్రమశిక్షణ పాటించేటప్పుడు లోకానుసారులతో చేతులు కలపలేరు. దేవుడు పరిశుద్ధుడు గనుక సంఘం కూడా పవిత్రంగా వుంటుంది. పవిత్రత లేకుండా ప్రభువును ఎవరూ చూడలేరు. జీవిత సమస్యల్లో తలమునకలవుతున్నప్పుడు సంఘసభ్యుల్ని హెచ్చరించే అధికారం సంఘానికి వుందని, దానికి లోబడడానికి సభ్యులు సంసిద్ధంగా వుండాలి.

సంఘమంతా ఒకే క్రమంలో నడుచుకోవాలని పవిత్రాత్ముని కోరిక. సంఘం మనుగడలో తటస్థించే ఏ సంఘటననైనా పవిత్రాత్ముని సాయంతో వాక్య వెలుగులో మాత్రమే అన్వయించుకోవాలి. పవిత్రీకరించబడిన సంఘం లోకంలో గొప్ప సాక్ష్యం యివ్వగలదు. ఆ సంఘంలో హృదయ పరివర్తన చెందిన వాళ్ళు అనేకులు చేరుతూ వుంటారు.

సంఘం దేవుని వాక్యానికి విధేయత చూపుతూ పవిత్రాత్మలో యేసయ్య పక్షంగా తీసుకునే ఏ చర్య అయినా లోపలను, బయటను అభివృద్ధి చెందుతుంది. దేవునికి స్తోత్రం!!!

**కవిత**

# నీవు వస్తావని

**భూ**మి కంపించి పోతూంది
పాపభారంతో
ఆకాశ మహాకాశాల్లో
ఎన్నెన్నో సూచనలు
గ్రహాలు దగ్గరయిపోతున్నాయి,
ఢీకొనడానికి సిద్ధంగా;
ఓజోనుపొర చిరిగి పోతుంది
ప్రకృతిలోని పచ్చదనం తరిగిపోతూంటే!
క్లోనింగు కణాల తయారీలో,
తల మునకలవుతున్న నేటి మేధావి
నీవు సృజించిన ఈ మానవుడు
నీ సృష్టి రహస్యాన్నే పరిహసిస్తున్నాడు
రాజ్యాల పునాదులు కదిలిపోతున్నాయి
సరిహద్దులేమో సవాలు చేస్తున్నాయి
ఏలికలు ఏకమవుతున్నారు
ఆలోచనలు చేస్తున్నారు
కాని-శాంతి కపోతాలు కనుచూపులో లేవు;
సమాధానపు చిరునవ్వులెక్కడాలేవు
ప్రకృతి అలసిపోయింది
'నాసిక శాశ్వత విశ్రాంతి కావాలంటూంది'
"ప్రభువైన యేసూ! రమ్ము



అంటూ 'ప్రకటన' కారుడు పిలుస్తున్నాడు
అవును ప్రభూ!
నీవు రావాలి; త్వరగా రావాలని
మరల వస్తావని
ఎదురు చూస్తున్నాము
నీరాక కోసమే
మా యీ నిరీక్షణ!
మా యీ ప్రార్థన!!

- బి. ప్రేమ లీలారావ్

# జగమెరిగిన బాపడు



గుంటూరు జిల్లా. ఊరు గోవిందపురం. కులం మధ్వ బ్రాహ్మణుడు(కరణాలు). ఇంటి పేరు రాయసం. కీర్తి ప్రతిష్టలు క్రైస్తవ్యంలో.

రమారమి 30ఏళ్ళ క్రిందట ఆంధ్రప్రదేశ్‌లో రేడియోకి మంచిగిరాకి. ఉదయం పూట ఉషశ్రీ, రాత్రిపూట ఆర్.ఆర్.కె. రెండూ వివిధ ఆధ్యాత్మిక ప్రబోధాలని విశిధపరచే ప్రత్యేక వైవిధ్యంతో కూడిన రెండు గొంతులు. ఉషశ్రీగారు రామాయణం బోధిస్తే, ఆర్.ఆర్.కె.గారు విశ్వవాణిద్వారా బైబిల్ భోధించేవారు. తద్వారా ఆంధ్రప్రదేశ్ ఎల్లలు దాటిన తెలుగు క్రైస్తవుడు సైతం మరువలేని గొంతు రాయసం రాధాకృష్ణగారి గొంతు. బహుషా ఆంధ్రదేశంలోని అన్ని జిల్లాలు, అన్ని గ్రామాల్లో వివిధ క్రైస్తవ సభల్లో పాల్గొని తన ఎనభై రెండేళ్ళ వయస్సు వరకు సువార్త ప్రకటించిన దైవజనులు ఆర్.ఆర్.కె.మూర్తిగారు. మూర్తిగారు పదాడంబరంలేని అచ్చ తెలుగుభాషలో క్రైస్తవ ప్రబోధాలు చేసి క్రైస్తవేత్తరులైన అగ్రకులాల వారినెందరినో కరుణామయుని ఆధ్యాత్మిక చింతనలోకి నడిపించారు. ఒక్కోమారు వ్యంగం, హాస్యం, పదునైన చురకత్తుల్లాంటి పదజాలంతో క్రైస్తవ విపరీతాల్ని ఎండగట్టే ప్రయత్నం చేసేవారు. మంచి మార్గదర్శి, ఉత్తమ దైవజనుడు, బైబిల్ అనువాదకుడు, ఎన్నో భక్తి కీర్తనల రచయిత. తెలుగు క్రైస్తవుల గుండెల్లో చెరిగిపోని ముద్రవేసుకున్న ఉద్ధండ క్రైస్తవుడు మన ఆర్.ఆర్.కె. మూర్తిగారు.

- సంపాదకుడు

## అతిభక్తి

చిన్నప్పటినుంచి అతిదేవతా భక్తిలో పెరిగాను. శంకరాచార్యుని స్తోత్రశ్లోకాలు నాకు కంఠతావచ్చు. నా బాల్య స్నేహితుడు నాగేశంతో కలిసి చిన్నప్పుడు ఆడుకునేవాడిని. తపస్సు చేయటం, దేవుడు సాక్షాత్కరించటం ఇలాంటి ఆటలు మా కిష్టం. రావణుడి శివస్తోత్రం ఏకబిగిని వల్లించేవాడిని. మమ్ముల్ను చూచి మా అమ్మగారు ఆశ్చర్యపొయ్యేది.

గోవిందపురంలో మా యింటికి ఎదురుగా ఓ నంబి కుటుంబం ఉండేది. ఎక్కువగా వాళ్ళ యింట్లో వుండేవాడిని. చదువు అంతగా కష్టపడకుండా సునాయాసంగా నాకు వచ్చింది. అయినా చదువు మీద శ్రద్ధ లేదు. కొన్నాళ్ళు రెవిన్యూ డిపార్టుమెంటులో ఉద్యోగం చేశాను. అదీ వదిలేశాను. ఎక్కడా నిలకడలేదు. మానసికంగా అసంతృప్తి. ఆత్మ శాంతి లేదు. శివానంద సరస్వతి రచించిన వేదాంత గ్రంధాలు ఎన్నెన్నో చదివాను.

## విద్యాభ్యాసం

నేను నరసరావు పేట హైస్కూల్లో చదువుకుంటున్నప్పుడు నతనయేలు అనే క్రైస్తవుల అబ్బాయితో స్నేహమైంది. అతడికి కవిత్వం పిచ్చి ఎక్కువ. యేసు ప్రభువు చెప్పిన ఉపమానాలు, ఆయన ప్రబోధాలను పద్యాల్లో రాసి తెచ్చేవాడు. నేను సరిచేసి పెట్టేవాడిని. నాకు నతనయేలు మంచి స్నేహితుడు కాని అతడి మతం - నాకు అసహ్యం, అయినా అతడి ఎదుట నేనేమీ విమర్శించేవాడిని కాదు.

## అనారోగ్యం

సరే, నేను ఇంటర్మీడియట్ చదువుతూ మానేసి, ఆరోగ్య కారణాన్ని బట్టి కాకినాడలో మా అన్నయ్య దగ్గరికి వెళ్ళాను. ఆయన ఫారెస్టు డిపార్టుమెంటులో ఉద్యోగం చేసేవాడు. మా పెద్దక్కయ్య బాల్య వితంతువు. మా అన్నయ్య దగ్గరే వుండేది. నేనూ అక్కడే ఉంటూ వుండగా నేనూహించని ఓ సంఘటన జరిగింది. సూత్రాల శేషగిరిరావుగారని ఒకాయన మా యింటికి వచ్చాడు. ఆయన మధ్వబ్రాహ్మణుడు. విదేశీయులకు తెలుగుభాష నేర్పుతున్నారు. పాశ్చాత్య మిషనరీల మధ్య ఆయనకు మంచి పేరుంది. గొప్ప ఉపాధ్యాయుడు.

## మిషనరీల స్నేహం

మాటల సందర్భంలో శేషగిరిరావు నా విషయం ప్రస్తావించాడు. తనకు అసిస్టెంటుగా మిషనరీలకు తెలుగు నేర్పేందుకు నన్ను పెట్టుకుంటానన్నాడు. నేను సరే అన్నాను. మా అన్నయ్య ఒప్పుకున్నాడు. తెల్లదొరలకు తెలుగు నేర్పుతూ కాకినాడ, రామచంద్రాపురం, ఊటి, కొడైకెనాలు ప్రాంతాలన్నీ తిరిగాను. వారికి తెలుగు నేర్పటం నా పని, వ్యాకరణం నేర్పాలి. తెలుగులో వారితో సంభాషణ చేస్తూ వుండాలి. యోహాను సువార్త నాకివ్వబడిన వాచక పుస్తకం.

ఆ చిన్న పుస్తకం చదివాను. అంతగా యిష్టం లేకపోయినా, ఉద్యోగం కోసం బలవంతాన చదివాను. మొదట అందులో భాష విలక్షణంగా వున్నట్లు తోచింది. ఇంగ్లీషులో యోహాను సువార్త చదివి దాన్ని తెలుగులో

సరిపోల్చుకొని అర్థం చేసుకున్నాను. ప్రతి వచనం చదివి భాషాపరంగా ప్రతిపదమూ విడదీసి వ్యాకరణం నేర్పుతూ వుంటే దొరలు ఆశ్చర్యపోయారు. ఒక దొర నాతో అన్నాడు, "యువకుడివి మంచి అనుభవమున్న ఉపాధ్యాయుడిలాగా యోహాను సువార్తలోని పాఠాలు మాకు నేర్పుతున్నావు, అభివృద్ధిలోకి వస్తావు." మరో దొర నన్ను ఏకాంతంగా చిక్కించుకొని "నీవు చదివి చెబుతున్నావే, ఈ యోహాను సువార్తనే గనుక నీవు నమ్మితే ,తెలుగుదేశంలో మేటి బోధకుడి వవుతావు! దేవుడు నిన్ను దీవిస్తాడు" అన్నాడు.



ఆరార్కే గారి కుటుంబ సభ్యులు

## ప్రవచనం

కొందరు దొరలు నన్ను 'సెమినరీకి పంపిస్తాము వెడతావా?' అనడిగారు. నేను నవ్వి 'చివరికి నేను క్రైస్తవబోధకుణ్ణా అయ్యేది' అన్నాను. అయితే దేవుని సంకల్పంలో నేను బోధకుణ్ణే. మరో దొర ప్రవచనం చెప్పాడు గూడా. 'ఒకానొక రోజున నీవు సువార్తను ప్రకటించే గొప్ప ప్రసంగీకుడివవుతావు.' నిజం-ఆ ప్రవచనమే నెరవేరింది.

యోహాను సువార్తను ఎన్నో వందల సార్లు చదివాను. మిషనరీల చేత చదివించాను. అందులో ఏ అధ్యాయంలో ఏముందో నాకు తెలుసు. కాని యేసుక్రీస్తు నా రక్షకుడు. ప్రభువు కాదు! క్రైస్తవ్యం నాకక్కర్లేదు. క్రీస్తుకు నేను వ్యతిరేకినేమీ కాను. అనే వేదాంతం కల్పించుకున్నాను. క్రీస్తును నా హృదయంలోకి రానివ్వకుండా నా ఊహలను సమర్థించుకోవటానికి ఎన్నెన్నో తార్కిక వాదనలను తయారు చేసుకున్నాను. యేసుక్రీస్తు ఒక్కడే దేవుడు కాడు. ఏ దేవుడిని నమ్మినా ఒక్కటే. దేవుళ్ళ మధ్య పోటీ ఏమిటి? ఏ దేవుడు గొప్పవాడు అని మనకెందుకీవాదం? అందరూ ఒకటే అనుకుంటే సరిపోతుందిలే అనుకున్నాను. మతాల మార్పిడి తప్పు, అని మిషనరీలతో వాదించాను. దేవుని అవతారాలెన్నెన్నో! యేసుక్రీస్తు ఒక అవతారం అనేంత వరకూ వచ్చాను. మిషనెరీలు నన్నెంతో ప్రేమించారు. నేనెంత విమర్శించినా ఏమీ అనేవారు కారు.

వారి దగ్గర వున్న పుస్తకాలెన్నో చదివాను. తద్వారా జ్ఞానం వృద్ధి అవుతుంది అనుకున్నాను. యేసును అంగీకరించి క్రైస్తవుణ్ణి అవుతానని నేను కలలో గూడా ఊహించలేదు. కానీ దేవుని సంకల్పం నా పట్ల మరోలా వుంది. మిషనెరీలు వేలకొలది మైళ్ళు వచ్చి భాషనేర్చుకొని ఇక్కడ ప్రజలకు యేసుక్రీస్తు సువార్త బోధిస్తున్నారే? వీరి దీక్ష ప్రశంసనీయం అనుకున్నాను. అప్పుడప్పుడు నాకనిపించేది, ఎందుకని వీరెప్పుడూ ఊరి బయట నిమ్నజాతుల మధ్యే వుండిపోతారు? అది నాకు అర్థం కాలేదు. యేసు అందరికీ ప్రభువంటూ, నిమ్నకులస్తుల మధ్యే వుండి పని చేస్తారేమిటి? అని అడగాలనిపించేది గాని ఎవరినీ ఆ ప్రశ్న అడగలేదు.

## సంఘర్షణ

నాలో అనిర్వచనీయమైన సంఘర్షణ మహబూబ్‌నగర్‌లో వుండగా మొదలైంది. హెచ్.జి.క్రాన్ అనే మిషనరీతో నాకు సన్నిహిత సహవాసం వుండేది. ఆయనా, నేను ప్రతిరోజూ గంటల తరబడి ఆధ్యాత్మిక విషయాలు చర్చించుకొనే వాళ్ళం. ఆయనతో నా సంభాషణ నాకు గొప్ప ఆశీర్వాదంగా పరిణమించింది. జటిలమైన థియాలజీ సత్యాలు కరతలామలక మయ్యాయి.

## మిషన్ కాంపౌండ్ రాజకీయాలు

మిషనరీలెందరికో తెలుగు నేర్పాను. వారిని తెలుగు పరీక్షలకు సిద్ధపరిచాను. వారికి సంభాషణ, వ్యాకరణం నేర్పాను. యోహాను సువార్తలోని సారాంశమంతా వారికి నేర్పి, వారి చేత మాట్లాడించాను. మిషను కాంపౌండులోనే కాపురమున్నాము.

ఆ కాంపౌండ్‌లో ఒక మిషనరీ, అతని చుట్టురా కొన్ని క్రైస్తవ కుటుంబాలు, ఒక బడి, ఒక గుడి, ఆసుపత్రి, మిషనరీ చుట్టూ ఉపగ్రహాలు కొన్ని తిరుగుతూ వుంటాయి. మిషను కాంపౌండు రాజకీయాలు ఒక పట్టాన ఎవరికీ అంతుపట్టవు. మిషనరీ ఆసరా చూసుకొని కొందరు అధికారం చెలాయించటం, ఒకరి మీద ఒకరు మిషనరీకి చాడీలు చెప్పటం ఇదంతా చూస్తువుంటే నాకంతా అయోమయంగా కనిపించింది. అయినా క్రైస్తవ సందేశం నా హృదయాన్ని ఆకట్టుకుంది. అయినా క్రైస్తవులను సానుభూతితో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. పరాయి దేశం నుంచి వచ్చిన మిషనరీ ఊరికి దూరంగా ఓ బంగళా కట్టుకుంటాడు. అతడికి పనివారు కావాలి. వంట పని, తోట పని చెయ్యడానికి కొన్ని కుటుంబాలు కాంపౌండులో నివాస మేర్పరచుకొని వుంటాయి. తరువాత మిషను సంస్థలో పనిచేసే ఉపాధ్యాయులు, నర్సులు, డాక్టర్లు అదే కాంపౌండులో కాపురముంటారు. నేను వారి మధ్య కొంతకాలం వున్నాను.

## వాక్య పఠన

నారాయణ పేటలో కొన్నాళ్ళు కుటుంబంతో వున్నాను. దేవుని వాక్యమనే బైబిలును సునిశితంగా పఠించాను. ఆలోచిస్తూ వున్నాను. ఎన్నో వ్యాఖ్యానాలు చూచాను. బైబిలు మామూలు పుస్తకం కాదని, అందులో శక్తిభరితమైన సత్యం వుందని గ్రహించడానికి కొన్ని సంవత్సరాల కాలం పట్టింది. నారాయణ పేటలో 'క్రాన్' అనే మిషనరీకి తెలుగు నేర్పుతూ వున్నాను. ఆ ఊరు ఆర్యసమాజ కేంద్రం. అక్కడ వుంటూ వుండగా, నాలో అనిర్వచనీయమైన పరివర్తన అంచెల వారీగా వచ్చింది.

## పరివర్తన

క్రైస్తవుల బలహీనతలను తీవ్రంగా విమర్శించే నాలో వారి పట్ల ప్రేమ, సానుభూతి కలగసాగాయి. గ్రామీణ బోధకులతో గంటల తరబడి గడిపేవాడిని. వారు చెప్పేదంతా ఓపికగా వినేవాడిని. వారికి

నాకు గాఢస్నేహం ఏర్పడింది. వారి అమాయకతను, క్రీస్తునందలి ప్రేమను గుర్తించాను. నైతికంగా బలహీనులే అయినా క్రీస్తునీతిని నమ్ముకున్న ఈ ప్రజలపై నాకు ఆదరాభిమానాలు కలగజొచ్చాయి.

బంధువులు, బలగమూ నన్ను హేళన చేస్తారు. నిమ్నజాతులలో కలిసిపోయానని ఆడిపోసుకుంటారు. వారితో కలిసిపోతే తప్పేమిటి? రాజకీయాలోనైతే ఇలాంటి త్యాగానికి గొప్ప పేరొస్తుంది. కానీ క్రీస్తు విషయంలో ఇది ఒక నిందగా పరిణమిస్తుంది. ఎందరో రాజకీయ నాయకులు నిమ్నజాతులలో తిరిగి గొప్ప నాయకులయ్యారు. కానీ క్రీస్తు కోసం ఇది నాకు మోయవలసిన సిలువ అయింది. అయితే మటుకేం? క్రీస్తు కోసం నిమ్నజాతివాణ్ణే అవుతాను. అందరూ నన్ను అలాగే విమర్శించనియ్యి. అదే నాకు ఆత్మానందం. ఆత్మశాంతి. సరిగ్గా ఇప్పటికి 55సంవత్సరాలు. 1955వ సంవత్సరం. ఆరాత్రి నా జీవితంలో మరుపురానిది. అంతరాంతరాలలో చెప్పశక్యం కాని వ్యధ మొదలైంది. క్రీస్తు కోసం శిబిరం వెలుపలికి వెళ్ళి నింద భరించడానికి నా ఆత్మ భయపడుతోంది. గజగజ వణికిపొయ్యాను. నాలోని నవనాడులు కుంగిపోయాయి. పడకలో అటూ యిటూ పొర్లాడాను. అర్ధరాత్రి భరించరాని శిరోవేదన మొదలైంది. అలాగే కునుకు పట్టింది. అది స్వాప్నిక అవస్థ. నాలోని మనిషితో నేనే తర్కానికి ఉపక్రమించాను.

## నాలో నేను

**'నువ్వు యేసుకు విద్యార్థివి, శిష్యుడివి కావు'**
**'ఎందుకు కాను? జ్ఞాన సముపార్జన చాలదా'**
**చాలదు. శిష్యుడు గురువు కాడిని మొయ్యాలి'**
**'శిష్యుడు కావాలంటే అంత వెల చెల్లించాల్సిందేనా?**
**'అది నావల్ల కాదు'**
**'వెల చెల్లించనిదే శ్రేష్టమైంది దొరకదు'**

ఈ విధంగా నేను మనసులోని మనసుతో ఎంతో రభసనడ్డాను. ఎటూపాల్పోవటం లేదు. క్రైస్తవ్యంలో ఆకర్షణీయమైంది ఏదీ లేదు. కానీ జాగ్రత్తగా వెతికితే బైబిలులో క్రీస్తు సాక్షాత్కరిస్తాడు! మతపుదిబ్బలో క్రీస్తును పూడ్చిపెట్టారు. అందుకే నాబోటి వారికి క్రీస్తును వెదకటం ప్రయాస అయిపోయింది. దీనికి బాధ్యులు క్రైస్తవ మతస్థులే అని నేను ఘంటా కంఠంతో చెబుతున్నాను.

## మతంకాదు జీవం

మనుష్యులకు మతం కాదు, జీవ మివ్వటానికి యేసు వచ్చాడు. నేటి అణుయుగంలో మతాలన్నీ మృతకళేబరాలు. క్రీస్తు సజీవుడు. సమకాలీనుడు. మతాతీతుడు. మత ప్రమేయంలేని క్రీస్తు నాకు కావాలి. ఆయన్నే నేనారాధిస్తాను. అదే ఉత్కంఠ తీవ్రంగా నాలోబయల్దేరింది. ఎలాగైతేనేం ప్రభువు కృపను బట్టి చివరికి తీర్మానం చేసుకోగలిగాను. 'ఏది ఏమైనా సరే యేసూ, నువ్వే నారక్షకుడివి ప్రభువు.' అంటూ నిర్దిష్టంగా చెప్పేసి లేచాను. ఉలిక్కిపడ్డాను. నా అనుభూతినంతా మళ్ళీ పునర్విమర్శ చేసి చూసుకున్నాను.


కొడుకు, కోడలితో ఆరార్కె గారు

## సాక్షాత్కారం

ఆ మరునాటి రాత్రి నా కంటిపొరలు రాలిపోయినట్లు దర్శనం కలిగింది. ప్రభువు సాక్షాత్కారం పొందాను. గలతీ 2:20 నా హృదయ గుహలో మారుమోగింది. 'నేను క్రీస్తుతో కూడా సిలువ వేయబడి వున్నాను. ఇకను జీవించేవాణ్ణి నేను కాదు. క్రీస్తు నాయందు జీవిస్తున్నాడు. ఇప్పుడు ఈ శరీరంలో నేను జీవించే జీవితం నన్ను ప్రేమించి నా కోసమై తనను తాను అప్పగించుకున్న దేవుని కుమారునియందలి విశ్వాసం వల్లనే జీవిస్తున్నాను.

(గలతీ 2:20 నేను క్రీస్తుతో కూడా సిలువవేయడియున్నాను. ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తు నాయందు జీవించుచున్నాడు)

## కర్మ విముక్తి

ఈ వచనం నాకు ఆశీర్వచనమైంది. ఇందులో చావు బతుకుల అంతరార్థం నాకు బయలుపడింది. నేను క్రీస్తు నందు ఉన్నాను. ఆయనతో సంయుక్తమయ్యాను. అంచేత ఆయనతో సిలువ వెయ్యబడిన అనుభూతి నాకు ప్రాప్తించింది. పాపినైన నేనే క్రీస్తుతో సంయుక్తం కావటానికి ఆయన్ను అంగీకరించటం కృప. ఇది నా పాప కర్మకు విముక్తి, నా స్వార్థనికి మరణం. నేను లేను. క్రీస్తు నన్ను ఆక్రమించుకున్నాడు. ఇది నా జీవితం కాదు. క్రీస్తులో నాలో వుండి జీవితం ప్రసాదించాడు. నేను-నేను కాను. నాలోని క్రీస్తు తన జీవితాన్ని నాలో జీవిస్తూ ఉన్నాడు, చరిత్రలోని క్రీస్తు నా అనుభూతిలోకి అవతరించాడు. సిలువ వేయబడి తిరిగి జన్మించాను. ఈ సత్యాన్ని నేను మననం చేసుకుంటున్న కొద్దీ నామీద నాకే కాఠిన్యం కలిగింది.

## పాప రేఖాగణితం

నాకున్న స్వార్థం మీద అసహ్య విద్వేషాలు కలిగాయి. నాలో మంచిదేది కనిపించలేదు. క్రీస్తు నాలోకి వచ్చిన బిందువు వరకు నా గత జీవితమంతా ఎడతెగని ఒక పాప రేఖ. పాపపు పొడిగింపు. నా 30 సంవత్సరాల జీవితం పాపమే. క్రీస్తులేని నా జీవిత భాగమంతా పాపం. అప్పుడు సిలువ సందర్శనం చేసి సిలువ మీద క్రీస్తుకు చేతులు జోడించి ప్రప్రథమంగా నమస్కరించాను.



కోడలు శ్రీమతి ఆర్ గిరిజ, కుమారుడు శ్రీ ఆర్ పృధ్వీరాజ్, ఆచార్య ఆరార్కే గారు, మనుమరాళ్ళు కుమారి నవ్య, శ్రీమతి కావ్య

## ఆధ్యాత్మిక జన్మం

1955 సంవత్సరం సెప్టెంబర్ 26 నా ఆధ్యాత్మిక జన్మదినం. నేను నాతల్లి గర్భవాసాన పుట్టినప్పుడు పాపిని. మొదట పుట్టుకదినం చెప్పే తీర్పు ఇదే. అయితే ఈ రెండో జన్మదినం నా పాప విముక్తిని ప్రచురిస్తోంది. క్రీస్తే నా విమోచకుడు. ఇది విజయం. నాలోని సంఘర్షణ అంతరించింది. నాకు ఇప్పుడు అంతా కొత్తే. అదే రోజు హెన్రీ క్రాన్ అనే సోదరుడికి టెలిగ్రాం ఇచ్చాను. ఆయన వచ్చాడు. 'నేను క్రీస్తును నమ్ముకున్నాను. హృదయపూర్వకంగా ఆయనను విశ్వసిస్తున్నాను. దీనికి ఎలాంటి పరిణామం వచ్చినా వెనుదిరిగేది లేదు. నాకు బాప్తిస్మం ఇవ్వండి. అన్నాను. 'ఇది అంతా ప్రభువు మహిమే. నిన్న మేము నీ గురించి ప్రార్థించాము' అన్నాడు.

## బాప్తిస్మం

'ఎందుకు నీకు బాప్తిస్మం?' అనడిగాడు.

క్రీస్తు నా ఆధ్యాత్మిక భర్త. ఆయన మాట వినాలి. నమ్మి బాప్తిస్మం పొందమన్నాడు. ఆయనతో నా ప్రయాణంలో ఇది మొదటి మజలి. అన్నాను. ఆ రోజు వర్షం భోరున కురుస్తోంది. లెక్కచెయ్యక అనుకొన్న సమయానికి కొందరు బోధకులు వెంటరాగా నారాయణ పేటలో ఓ పెద్ద బావి వద్ద బాప్తిస్మం దీక్షతీసుకున్నాను. నాలో ఆత్మ తీవ్రత కలిగింది. క్రీస్తును పూర్తిగా అనుభవించటం కోసం నా హృదయం తహతహ చెందింది. నేను ప్రభువులో సంయుక్తతా స్థితి పొందాను.

## విశ్వాస ఫలితం

విశ్వాసానికి నాలో సత్వర ఫలితం కలిగింది. ఆత్మ నన్ను క్రీస్తు శరీరంలోకి ప్రవేశ పెట్టాడు. ఇది దివ్యానుభూతి.ఆయన వాగ్దానాలు నాలో నెరవేరుతున్నాయి. నూతన జన్మ. పరిశుద్ధాత్మ నాలోకి రావటం, ముద్రించ బడటం, పరిశుద్ధాత్మ, బాప్తిస్మం ఇవన్నీ పరిశుద్ధాత్మ నింపుదలలో సేవకు నన్ను ప్రేరేపించాయి.

## నాభార్య

నా భార్య వరలక్ష్మి విషయం ఇక్కడ క్లుప్తంగా చెపుతాను. ఆమె కూడా శ్రోతీయ కుటుంబం నుంచి వచ్చింది. నేను ప్రభువును విశ్వసించిన తరువాత 4 సంవత్సరాలకు గానీ ఆమె మనసు మారలేదు. ఎన్నో అభ్యంతరాలు ఆమెలో ముప్పిరిగొని వున్నాయి.

విగ్రహారాధన, సాంప్రదాయపు కటకటకాలలో నుంచి వెలికిరావటం అంత సులభం కాదు. కానీ దేవుని ఆత్మ ఆమెలో పాపాన్ని గురించి, తీర్పును గురించి, నీతిని గురించి ఒప్పుదల కలిగించాడు. యోహాను 3:36 ద్వారా ఆమె రక్షణ పొందింది. నాకు వ్యతిరేకంగా ఉన్న తన వైఖరిని మార్చుకొని ప్రభువుకు విధేయత చూపి హైదరాబాదు నగరంలో బాప్తిస్మం తీసుకొని సేవలో నాకు సాటియైన సహాయం అయింది. (యోహాను 3:36 కుమారుని యందు విశ్వాసముంచువాడే నిత్యజీవముగలవాడు)

మేము ఎన్నో ప్రాంతాలు పర్యటించాము. మహబూబ్‌నగర్‌లో ఉండి రేడియో సేవ ప్రారంభించాము. నాతో పాటు సేవ చేసింది. ఎందరో హిందూ స్త్రీలతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపి వారిని క్రీస్తు దగ్గరికి తెచ్చింది. క్రీస్తును బట్టి కలిగిన అనేక కష్టాలలో నాతో నిలిచి నాకు భాగస్వామిగా నిలిచినందుకు దేవునికి సర్వదా కృతజ్ఞుడిని.

## విజయ సోపానం

దేవుడు మమ్ములను సేవలో విజయం నుంచి అత్యధిక విజయానికి తీసుకువెడుతూ వచ్చాడు. పరిస్థితులను బట్టి దేవుని ఆజ్ఞ మేరకు మహబూబ్‌నగర్ నుండి కర్నూలుకు అక్కడ నుండి గుంటూరుకు తరలి వచ్చాము. 1969వ సంవత్సరంలో మహబూబ్‌నగర్ కల్వరి సంఘంలో నేను సేవకై అభిషేకించబడ్డాను.

## సేవా దర్శనం

గుంటూరులో వుండగా హిందూ సోదరుల మధ్య సేవ చేయడానికి గొప్ప దర్శనం ప్రభువు చూపించాడు. రోమా 9:3 పదే పదే నాకు జ్ఞాపకం రాసాగింది. దేహ సంబంధులైన నా సోదరుల కోసం నేనేంచేయాలి? అనే ప్రశ్న ఎదురైంది. నా సమీప బంధువులందరిలో క్రీస్తును పైకెత్తుతాను. ఆయనే అనేకులను ఆకర్షించుకుంటాడు, అని సేవా దీక్షపూనాను. బ్రాహ్మణం క్రీస్తుకు దూరంగా వుండిపోవటం నాకు ఎముకలు విరచినంత బాధ కలిగిస్తోంది. ఇంతటి ఆధ్యాత్మిక సంపత్తు క్రీస్తులో వుంటే లేనిపోని అపోహలతో క్రీస్తును తిరస్కరించడం సబబుకాదు.

## యజ్ఞోపవీతం

నేను యేసు క్రీస్తును స్వకీయ రక్షకుడుగా ప్రభువుగా అంగీకరించిన రోజున ఈ పద్యం నా డైరిలో రాసుకున్నాను. అదే రోజు నా జందెం తీసివేశాను. ఉపనయనం రోజున నేర్చుకున్న సంధ్యావందనానికి స్వస్తి చెప్పాను.

## క్రీస్తు శరీరం

'నాదు యజ్ఞోపవీతమే నీదు సిలువ
ఆత్మ విప్లవ గీత మనర్గళంబు
నాకు సంధ్యాస్తుతీ వందనంబు దేవ!

ఇప్పుడు నాకు 85 సంవత్సరాల వయసు. నా జీవితంలో మొదటి 30సంవత్సరాలు క్రీస్తు పూర్వం. రెండో భాగం మా కుటుంబంలో క్రీస్తు శకం నాతోనే మొదలైందనిపిస్తోంది.

ఒకసారి మా బంధువుల్లో ఒకాయన 'ఒరేయ్, హిందూమతం ఎందుకురా వదిలావు? అందులో ఏదయినా లోపం ఉందనుకుంటే నాకు చేతనయితే సంస్కరించి మార్చు' అన్నాడు. దానికి జవాబు 'నేను మార్చగలిగింది నాకెందుకు? నన్ను మార్చే క్రీస్తు నాకు కావాలి.'అన్నాను.

# జ్ఞాపకాలు

## రేడియో సేవ

ఆత్మ నింపుదల పదే పదే నా సేవా జీవితంలో నాకు విజయ పరంపరలను చేకూర్చింది. 15 సంవత్సరాలు నేను రేడియోలో అవిరళ కృషిచేసి సువార్త ప్రకటించాను. పరలోక రాజ్యం రానురాను బహు సమీపమనిపిస్తోంది. ఎన్నో పాటలు రాశాను. ఆదికాండం మొదలుకొని ప్రకటన గ్రంథం వరకు ఒక్క వచనం కూడా విడువకుండా దేవుని సంకల్పం ఉన్నది ఉన్నట్టు బోధించాను. దూషణభూషణ తిరస్కారాదులను ప్రజలవద్ద నుండి పొందాను. కొన్నిటిని నేనెన్నడూ లెక్క చేయలేదు. ఎన్నెన్నో ప్రాంతాలు పర్యటించాను. కొన్ని చోట్ల అవమానానికి గురయ్యాను. క్రీస్తు పాదాల చెంత నిరాడంబరంగా జీవించటం నేర్చుకుంటున్నాను. ఇహ లోకంలో యేసు తప్ప నాకేమీ అక్కర్లేదు. ఆకాశంలో ఆయన తప్ప మరెవరున్నారు? యుద్ధ రంగంలో పోరాడి ప్రభువిచ్చిన బలాన్ని బలహీనతలో బయలు పర్చడానికి ప్రయత్నించాను. నా రచన పరిచర్యలో భాగమైన స్పందన మాసపత్రికను నా ఆధ్యాత్మిక కుమారుడు దేవసహాయం (దేవా) కొనసాగిస్తున్నాడు.

## సేవ ఫలితం

దేవుడు మా సేవను ఎంతగానో ఆశీర్వదించాడు. మా అక్కగారు తన జీవితచరమ దశలో ప్రభువుకు సమర్పించి పరమపదించింది. మా బంధువుల రక్షణకోసం అహర్నిశలు పట్టువిడువక ప్రార్థిస్తున్నాము. దేవుని కృప మా పట్ల ఎంతగానో విస్తరించింది. రేడియో సేవకు ప్రతిస్పందనగా గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలలో కొన్ని సంఘాలు ఏర్పడ్డాయి. మిషనెరీల వల్ల చివరి దినాల్లో భేదాభిప్రాయాలు వచ్చాయి. మొదటనుంచీ పాశ్చాత్య ద్రవ్యాన్ని ఉచ్ఛిష్టంగా భావించాను. అదే దీక్ష తుదివరకూ దేవుని కృపచేత కొనసాగింది. అన్ని క్రైస్తవ శాఖలతో అరమరికలు లేకుండా ప్రేమ పూర్వకమైన సహవాసం అనుభవించాను. క్రైస్తవ ప్రేమను ఎంతో ఎక్కువగా చవి చూచాను. ఇప్పుడు నా వయస్సు 85 ఏండ్లు. దేవుని కృపను పుణికి పుచ్చుకున్న నిండుదనం నాలో వుంది.

## బైబిలనువాదం

లివింగ్ బైబిలు వారి ఆధ్వర్యంలో 'పరిశుద్ధ బైబిలు' అనువాదానికి దేవుడు నన్ను సాధనంగా వినియోగించుకున్నాడు. న్యూ ఇంటర్నేషనల్ వర్షన్ అనువాదంలో నేను ఒక భాగం కావటం ప్రభువు కృపా విశేషమే! దేవుడు ఏ విషయంలోనూ నాకు తక్కువ చేయలేదు. గుంటూరు పట్టణంలో నా స్వంతజిల్లా కేంద్రంలో దేవుడు తన సేవలో మమ్ముల్నెంతో హెచ్చించాడు. ప్రవక్త స్వదేశంలో ఘనత పొందాడని ఉంది. కాని దేవుడు మమ్ములను తన సేవలో గుంటూరులో ఎంతో హెచ్చించాడు. ఎందరెందరికో బాప్తిస్మాలిచ్చాను. పెండ్లిండ్లు చేయించాను. కర్నూలులో ఉండగా మేము పొందిన అనుభవాలు మరపురానివి. దావీదురాజు తాను మొదట పోగొట్టుకున్నదంతా తిరిగి సంపాదించుకున్నట్లు నేను అప్పుడు పోగొట్టుకున్న నా బంధువుల్ని తిరిగి సంపాదించుకునే దశాబ్దంలో ఇప్పుడున్నాను. దేవునికి స్తోత్రం. ★

# అభినవ మోషే మన ఆరార్కే




ఒక అవిరళ సువార్త జ్యోతి ఆరిపోయింది
ఒక ఆంధ్రక్రైస్తవ స్వర్ణ కుసుమం రాలిపోయింది
విశ్వవాణి క్రైస్తవ శ్రోతల గుండెల్లో మారుమ్రోగిన ఆ గళం
మూగవోయింది.
యేసుతో టీ.వి.లోకి పోదామా అంటూ టెలివిజన్ ద్వారా
వాక్యామృతాన్ని కురిపించిన ఆ మూర్తిమత్వం
కరిగిపోయింది
యాభైయారేళ్ళ సుదీర్ఘ సువార్త ప్రహసనం ఇక లేదు...ఇక రాదు...
గ్రామ, గ్రామానికి, గుండె గుండెకి క్రీస్తును అందించిన
మహాబోధకుడు.......
ఆచార్య ఆరార్కే మూర్తి.....
ఆ పేరులోనే యిమిడుంది పరిపూర్ణ కీర్తి
అనుక్షణం పుస్తకాల పురుగై
అనునిత్యం బైబిల్ పారాయణుడై
ఆధ్యాత్మిక లోతుల్ని తరచి తరచి చూచిన విజ్ఞానగని
ఆత్మల రక్షణ వేట ఆయన చేపట్టిన పని
ప్రభువు ఎన్నుకొన్న అభినవ మోషే
వారు పలికే మాటలు కొంచెం తమాషే
మాట మాటల్లో చెణుకులు, ఛలోక్తులు
డైరక్టుగా గుండెల్లో గుచ్చుకొనే తుపాకి గుళ్ళు
నిరంతరం సువార్త పరిచర్య
ఆచార్య ఆరార్కే గారి దిన చర్య
దైవత్వాన్నార్జించిన ఋషి
క్రీస్తును తన క్రియల్లో చూపించే మహర్షి
ఆయన జీవితంలో ఎక్కడుంది ఖుషి?
ఒక్క ఆత్మ రక్షణ పొందినా చాలనుకొనే అభిలాషి
ధన వ్యామోహం లేని ఈ మహా మానిషి
మరణం.....దానికి లేదు కారణం
పుట్టడం ఎంత సత్యమో
గిట్టడం అంతకు మించిన నగ్నసత్యం
మన మట్టుకు దుఃఖమే మిగిలిన స్వాస్థ్యం
కాని మనం నిరీక్షణ కలిగుండడం ప్రాముఖ్యం
ఆరార్కే గారిది మంచి పోరాటం
కడముట్టించిన పరుగు పందెం
నిలకడగా కాపాడుకొన్న విశ్వాసం
నీతి కిరీటాన్నందుకొంటున్న క్రైస్తవ్యం

– చిట్టెం మరియదాస్



★

# విశ్వవిఖ్యాత - విలియం కేరి

శరీరరీతిగా ఉంగరాలజుట్టు, సుందర వదనం, శరీర దారుఢ్యం కలిగిన ఆజానుబాహుడు, చెప్పులు బాగుచేసుకొనే ఓ బీద బాప్టిస్టు. అతడే విశ్వ విఖ్యాత విలియం కేరి. కేరి దేవుని ప్రార్థించి నిర్దిష్టమైన దర్శనాన్ని, జీవిత లక్ష్యాన్ని గలిగిన దైవ జనుడు. ఈ మహనీయుడు 1761 ఆగష్టు 17న ఇంగ్లాండ్ దేశంలోని నార్తంటన్ షైర్ అనే రాష్ట్రంలో జన్మించాడు.

ఇంగ్లీషు బాప్టిస్టు సంఘ సభ్యుడు, దేవుని పిలుపు పొందిన అభిషేకించబడిన దైవ భక్తుడు. ముందు కేరి ఆంగ్లికన్ సంఘానికి చెందినవాడు. ఓ చిన్న సంఘకాపరి ఉపాధ్యాయుడు ఆర్థిక పరిస్థితులను బట్టి ఒక చెప్పుల షాపులో పని చేసేవాడుగా ఉండేవాడు. 1872 మే మాసం 30న నాటింగ్‌హాం అనే స్థలంలో జరిగిన బాప్టిస్టు అసోసియేషన్ సభలో "దేవుని నుండి గొప్ప కార్యాలకై ఎదురు చూడాలి; దేవుని కోసం గొప్ప కార్యాలు చేయాలి" అనే అంశంపై ఓ చారిత్రాత్మక ప్రసంగాన్నిచ్చాడు. ప్రసంగాన్ని వినిన వారికి గొప్ప కనువిప్పు కలిగింది. దీనికి ఫలితంగా అదే సంవత్సరం బాప్టిస్టు సొసైటి ఏర్పడింది. ఆనాటి కేరి ప్రసంగం అప్పటి నుండి ఇప్పటికి అంతే కాదు ప్రభువు వచ్చే వరకు సంఘాలను ఉత్తేజపరుస్తూనే ఉంటోంది.



అసాధ్యమైన ఏకార్యాన్నైన తన యందు విశ్వాసముంచిన వారి జీవితాలలో దేవుడు గొప్ప కార్యాలను జరిగిస్తాడనే ధృఢమైన నమ్మకం. కేరి హృదయాంతరంగంలో గాఢంగా నాటుకుని ఉంది. అంచేత అసాధ్యమైన మిషనరీ సేవను తలపెట్టాడు. అంధకారాన్ని నిలయం చేసికొనిన, రక్షణ సాహిత్యంలో ఉన్న అన్యదేశాలకు వెళ్ళి నిషేధాన్ని పారద్రోలే రక్షణ సువార్తను ప్రకటించాలనే నిర్ణయాన్ని కేరి చేసుకున్నాడు. లక్ష్య సాధనాన్ని అందుకు తగిన ఆర్థికబలం లేకపోయినను దానిని సాధించగల గుండెబలం, ఆత్మస్థైర్యం ఆయనలో నిండుగా ఉన్నాయి. అయితే ఆదిలోనే ఎదురు దెబ్బ తగిలింది. మరో సభలో అన్య దేశాలలో సువార్త సేవ అవసరాన్ని కేరి ప్రస్థావిస్తూ ఉండగా, తనకు బాప్తిస్మము ఇచ్చిన డా॥రైలాండ్ "కూర్చోవయ్యా యువకుడా దేవుడు అన్యులను మార్చాలనుకొన్నప్పుడు నీ సహాయం నా సహాయం లేకుండా ఆయనే చేయగలుగుతాడు" అని కేరిని నిరుత్సాహపరిచాడు. కేరి కొంత నిరాశపడిన తన లక్ష్యాన్ని మార్చుకోలేదు. తన ప్రయత్నాన్ని మానుకోలేదు.

మనం ఏపని చేయాలన్న తగిన సిద్ధపాటు ఉండాలి, అదే చేశాడు విలియం కేరి. తన దర్శనం యొక్క ఉద్దేశ్యమేమో, లక్ష్యసాధనకు ఏమేమి అవసరమో ముందుగానే ఆయన సిద్ధం చేసికొన్నాడు. మిషనరీలైన జొనతాను ఎడ్వర్డు, డేవిడ్ బ్రెయినార్డ్ మొదలగు వారి జీవిత చరిత్రలను అధ్యయనం చేశాడు. సముద్ర ప్రయాణం చేయవలసి ఉన్నది కనుక ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలను కనుగొనిన కెప్టెన్ కుక్ సముద్రయాన అనుభవాలను చదువుకొన్నాడు. స్వయంగా గ్రీకు, లాటిన్ భాషలపై గట్టి అధికారాన్ని సంపాదించుకున్నాడు. తాను పనిచేస్తున్న చెప్పుల షాపును ఒక గ్రంథాలయంగా కేరి మార్చినట్టు చరిత్ర చెపుతోంది. మరొక విచిత్రమైన పని చేశాడు. చర్మంతో ప్రపంచపటాన్ని తయారు చేసి అందులో తాను వెళ్ళ దలచుకున్న ఇండియాను గుర్తించి అవసరమైన భౌగోళిక జ్ఞానాన్ని కూడా సంపాదించుకొన్నాడు. తన సిద్ధపాటులో ఒక ప్రధానమైనది తాను రచించిన "The Enquiry" అనే గ్రంథం. ఈ గ్రంథంలో ఒక ఐదు అంశాలను పేర్కొన్నాడు. ఒకటి, మిషనరీ సేవ ఎందుకు చేయాలనే దానికి వేదాంతపరమైన భావాలు; రెండు, మిషనరీ సేవ ప్రారంభదశ నుండి జాన్ వెస్లికాలం వరకు ఉన్న మిషనరీ సేవ చరిత్ర; మూడు, ప్రపంచంలో ఉన్న ప్రతిదేశం విస్తీరణం, జనసంఖ్య, మతాలు అనే అంశాలతో కూడిన పట్టికలు (Statical Tables) నాలుగు మిషనరీ సేవలో ఎదుర్కొనే వివిధ సమస్యలు; ఐదు, మిషనరీ సేవకు ఒక మిషనరీ సొసైటి ఏర్పాటు అవసరత. ఈ గ్రంధం తర్వాత కాలంలో మిషనరీ సేవకు అవసరమైన గ్రంథంగా అంతర్జాతీయంగా అంగీకరించబడటం ముదావహం. నిర్దిష్టమైన దర్శనం, లక్ష్య సాధనకు అవసరమైన సిద్ధపాటు కలిగి మిషనరీ సేవకు ఎదురుచూస్తున్నారు కేరి. దేవుని చిత్తానుసారంగా బాప్టిస్టు మిషన్ సొసైటి విలియం కేరీని ఇండియాకు మిషనరీగా ఎన్నుకొనింది. తనతో పాటు గతంలో ఇండియాలో కొంత సువార్త సేవ చేసి తిరిగివచ్చిన వైద్యుడైన తామస్‌ను కూడా సొసైటీ ఎన్నుకొనడం జరిగింది. ప్రయాణాన్ని సమకట్టారు. వీడ్కోలులో డా॥ఫుల్లర్ ప్రోత్సాహకరమైన మాటలు పలికాడు. 1799 మార్చి 20న బయలుదేరి అదే సంవత్సరం జూన్ 13న ఉగ్గి తీరం చేరి ఆయా స్థలాల్లో సేవను జరిగించి కడకు కలకత్తాకు సమీపంలో ఉన్న సిరంపూర్‌ను తమ సేవాకేంద్రంగా ఎన్నుకొన్నాడు. ఓడ ప్రయాణం చూస్తు బెంగాల్ భాషను కేరి క్షుణ్ణంగా నేర్చుకున్నాడు. తర్వాత జాషువా మార్క్మన్, విలియం వార్డ్ అనే మిషనరీలు కేరితో చేరారు. ఈ ముగ్గురిని చరిత్రలో సిరంపూర్ త్రయం (Seremporetrio) అని అన్నారు.

బైబిలు గ్రంథాన్ని భాషాంతరం చేయాలనేది ఆయన ముఖ్య ఉద్దేశం. మొదట బెంగాలి, హింది భాషలలో తర్వాత ఆసియాకు చెందిన వివిధ భాషలలోనికి బైబిలును తర్జుమా చేయటానికి సమకట్టుకొన్నాడు. అందుకు అవసరమైన ఒక పాత అచ్చు యంత్రాన్ని తరువాత క్రొత్త దానిని సంపాదించుకొన్నాడు. కాగితం కోసం పేపర్ ప్రెస్‌ను, సిరాను తయారు చేసికోవటం మొదలగు వాటన్నింటిని సిద్ధం చేసికొన్నాడు. అందుకు అవసరమైన ఆర్థిక వనరులను కూడా సమకూర్చుకొన్నాడు. బెంగాలి, హింది భాషలతో పాటు సుమారు ముప్పై తొమ్మిది భాషలలోనికి బైబిలును పూర్తిగాను, పాక్షికంగాను తర్జుమా చేశాడు. బహుభాష పండితోత్తముడు. బెంగాల్ సంస్కృత భాషలలో నిష్ణాతుడయ్యాడు. సంస్కృత వ్యాకరణాన్ని సంస్కృత నిఘంటువును ఇంగ్లీషులోనికి భాషాంతరం చేశాడు. తన తరంలో బహు భాషా పండితుడుగా, భాషాంతర కర్తగా, రచయితగా జాతీయంగా అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులతో పాటు బహు బిరుదాంకితుడయ్యాడు.

క్రైస్తవ వాంఙ్మయంతో పాటు సువార్త సేవను జరిగించి సంఘాలను స్థాపించాడు. జ్ఞానార్జనమే, మానసిక వికాసానికి, దేశాభ్యుదయానికి విద్య మూలం. అందుకని వందకు పైగా జరిగేవి పాఠశాలలను, బోర్డింగీ పాఠశాలను, కళాశాలను స్థాపించి విశిష్ట విద్యా సేవలను అందించిన ఘనుడు కేరి. 1818లో సిరంపూర్ విశ్వ విద్యాలయాన్ని స్థాపించాడు. మతేతర విద్యతో పాటు క్రైస్తవ వేదాంత విద్యకు ఈ విశ్వవిద్యాలయం ప్రాధాన్యతను ఇచ్చింది. క్రైస్తవ వేదాంత విద్యను అందించటంలో ఈ విశ్వ విద్యాలయం విశ్వ ప్రఖ్యాతి గాంచింది అని చెప్పటంలో ఎట్టి సందేహం లేదు. వేలాది సంఖ్యలో మొక్కల్ని, వృక్షాల్ని పెంచి అగ్రో హార్టికల్చరిస్టు (Agro-Hortyculturist)గా పేరు గాంచాడు. కేరి ప్రోత్సాహంతో హార్టికల్చరల్ అండ్ అగ్రికల్చరల్ సొసైటి ( Horty Cultural&Agricultural Society) స్థాపించబడింది. ఇండియాలో సేవింగ్ బ్యాంక్ పద్ధతిని ప్రవేశపెట్టారు. సమాచార దర్పణం, ఫ్రెండ్ ఆఫ్ ఇండియా అనే పత్రికలను స్థాపించి వాటి ద్వారా ఆనాడు అనేకుల ప్రాణాలను అన్యాయంగా తీసికొంటున్న పైశాచిక ఆచారలైన సతీసహగమనం, చిన్న పిల్లలను బలి ఇవ్వటం, బాల్య వివాహాలు మొదలగు వాటిని నిర్మూలించిన ఘనత కేరికే దక్కుతుంది.

ప్రియులారా! విలియం కేరి జరిపించిన సేవాకార్యాలన్ని అసాధ్యాలుగా, మానవ ఊహకు అందనివిగా ఉన్నాయి. అయితే అవన్ని సుసాధ్యాలయ్యాయి. అందుకు విలియం కేరి దేవుని మారు కలిగి ఉన్న అచంచల భక్తి విశ్వాసాలు, నిర్దిష్టమైన దర్శనం, పరిపుష్టితో కూడిన సిద్ధపాటు, అఖండిత కృషి, పలుమారులు ప్రెస్ నాశనమైపోయిన భార్యకు మతి చపలం కలిగిన, కుమారుడు మరణమొందిన లక్ష్య సాధనంలో వెనుదిరగని తత్వం, పనిలో క్రమపద్ధతి, కాల సద్వినియోగం, త్యాగ సహిత జీవితం ఇంకా ఇంకా ఎన్నెన్నో సద్గుణాలు, అసాధ్యాలు సుసాధ్యాలుకు కారణాలు. మనం కూడా కేరి వలె జీవిత లక్ష్య సాధకులంగా ఉండగలిగే పరలోకమే భూలోకానికి దిగివస్తుంది. అందుకు ప్రతి ఒక్కరం ప్రయత్నిద్దాం. ప్రార్థిద్దాం.

**రెవ. డా॥ రావెల జోసఫ్**

# పిచ్చోడు



ప్రతి రాతిలో శిల్పాన్ని వెతికే కన్నులున్న నీవు
నీ ప్రతి మాటను ఉలిగా మార్చావు,
చెక్కటం ప్రారంభించి మనిషికి నొప్పినే మిగిల్చావు
కాలం కలిసి రాక వల్లకాడు పిలిస్తే ఒంటరిగానే వెళ్ళిపోయావు!

నీ చిరిగిన జోలెను జాలితో మళ్లీ మళ్లీ కుడితే,
పిచ్చి గులక రాళ్ళను నింపి
గురి చూసి గుండెకే విసిరావు
అదేమంటే దేవుని వాక్యం ఇంతే అన్నావు
కాళీ జోలెను మిగిల్చి కన్నీళ్ళు విదిల్చి వెళ్ళావు!

దేవుడు ఇలాగే దేవుడిలాగేనా అని ప్రతిబింబాన్ని
పోల్చుకోవాలనుకున్నప్పుడు నిరాశతో మా రూపాన్నే
చూపించావు నిశి రాత్రి నిప్పుల కొలిమిలో కాలి
పైకి లేచే ధూప మాయా దర్పణంలో మనుజుణ్ణి
దైవజనుడుగా చూపావు !

ముహూర్తం తెలియని పెళ్లి కోసం ఎదురుచూస్తూ
దేవుడే నా వరుడు అన్నావు !
మరణంతో కొత్త కాపురం మొదలని చెబుతూ
మేమంతా ప్రేక్షకులమేనని తేల్చేసావు
అక్కడ జరిగే ముచ్చట గదిలోనే పరలోక గవిని లోనే కదా మరి !!

నిన్ను ఒప్పింప మెప్పింప మనసు గెలువ
మార్చ ప్రయత్నించి లోకం నీ ముందు
ఓడిపోయి దేవుడి పిచ్చోడిగా ముద్ర వేసింది
చచ్చిపోయావని తెలిసి శ్వాస పీల్చుకొంది !

**– వి.బి.యస్. ప్రసాద్**

# పుల్లా ఫ్రాంక్లిన్‌గారి ఆశయ సాధనలో
# ఫ్రాంక్లిన్ పుల్లా ఫౌండేషన్

**(జూలై 31వ ఫ్రాంక్లిన్ పుల్లా గారి వర్ధంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం)**

ఫ్రాంక్లిన్ పుల్లాగారు 1932 సెప్టెంబర్ 4న పుట్టిన క్రైస్తవ ఉపాధ్యాయుడు. కరీంనగర్ జిల్లా స్టేషన్ ఉప్పల్ వీరి స్వగ్రామం. వీరు ప్రాథమిక విద్యను హన్మకొండ బాప్టిస్ట్ స్కూల్ నందు, హైస్కూలు విద్యను ప్రెస్టన్ ఇన్‌స్టిట్యూట్ నందు అభ్యసించారు. గుంటూరు ఆంధ్రాక్రిస్టియన్ కాలేజ్‌లో ఇంటర్‌మీడియట్, డిగ్రీలను పూర్తి చేసారు. వరంగల్ జిల్లా



నుండి ప్రప్రధమంగా విదేశాలకు వెళ్ళి విద్యనార్జించిన వ్యక్తులలో ఫ్రాంక్లిన్ గారు ఒకరు. అమెరికాలోని పెన్సిల్వేనియాలోని బక్‌నిల్ యూనివర్సిటీ నుండి ఇంగ్లీష్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పట్టానందుకొన్నారు ఫ్రాంక్లిన్ గారు.

దేశ విదేశాలలో ఎన్నో ప్రాంతాలను సందర్శించి విద్యాపరంగా, క్రైస్తవ సేవాపరంగా విశిష్ట జ్ఞానసముపార్జన చేసారు ఫ్రాంక్లిన్ గారు. వీరు ఉపాధ్యాయులుగా 35 సంవత్సరాల సుదీర్ఘ సేవలందించడమేకాక, క్రైస్తవ పరిచర్య యెడల అందునా గ్రామీణ సువార్తీకరణ యెడల విశేషమైన ఆసక్తితో వారి సేవలనందించారు. అమెరికా నుండి వీరు స్వదేశం వచ్చే నాటికి – చిన్నతనంలో తాను ప్రాథమిక విద్యనభ్యసించిన బాప్టిస్ట్ పాఠశాల మూతపడడంతో ఎంతో వేదనపడి, ప్రార్థించి, తన శక్తియుక్తులను క్రోఢీకరించి తిరిగి ఆ పాఠశాల పేరిట పునరుద్ధరించారు. 18 సంవత్సరాలపాటు తన చేతులమీదుగా ఈ పాఠశాలను నడిపి, అభివృద్ధి పరచి అనంతరం హన్మకొండ సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్‌కి అప్పగించారు. ఈ స్కూలు ప్రస్తుతం హైస్కూలుగా పరిణతి చెంది అనేక మందికి విద్యా దానం చేస్తున్నది.

అనంతరం బక్ నిల్ ప్రైమరీ స్కూల్ పేరున వరంగల్‌లో మరొక ప్రాథమిక పాఠశాలను నెలకొల్పి ప్రాథమిక విద్య యెడల తన ఆసక్తిని నిరూపించుకొన్నారు. ఎడ్యుకేషన్ యెడల, రూరల్ ఇవాంజిలిజమ్ యెడల వారికున్న ఆశయాలు, స్వప్నాలు మహోన్నతమైనవి. వీరికి ఆరాధన టీ.వి. ఛైర్మన్ పాల్ దేవప్రియం ప్రథమ పుత్రుడు కాగా మరో ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ బిడ్డలనందరినీ పి.జీ. వరకూ చదివించారంటే విద్య యెడల, క్రైస్తవ సేవా పరిచర్య యెడల వీరికున్న ఆసక్తి మనకు ప్రస్ఫుట మౌతుంది. ఫ్రాంక్లిన్ గారు 2009 జూలై 31న ప్రభువు పిలుపునందుకొని నిత్య సంతోష ప్రవేశం చేశారు. వీరి ఆశయాలు, స్వప్నాలు నిజం చేయాలనే సంకల్పంతో వారి కుమారుడు పాల్ దేవప్రియం ఆరాధన టీ.వి. ని స్థాపించి, ఫ్రాంక్లిన్ పుల్లా ఫౌండేషన్ నెలకొల్పి వాటి ద్వారా ఎన్నెన్నో సేవా కార్యక్రమాలను చేపట్టారు.

గ్రామీణ ప్రాంతాలకు ఆరాధన టీ.వి. ద్వారా సువార్త అందించడం, ఫ్రాంక్లిన్ టెలీ బైబిల్ కాలేజ్ ద్వారా గ్రామీణ సువార్తీకరణ యెడల ఆసక్తి గలవారికి బైబిల్ తర్ఫీదునివ్వడం ద్వారా రూరల్ ఇవాంజిలిజమ్‌ను ప్రోత్సహించడం మొదలైన అనేక సేవా కార్యక్రమాలను చేస్తూ ముందుకు కొనసాగుతున్నారు.



**శ్రీమతి ఫ్రాంక్లిన్ పుల్లా గారి ఆరోగ్యం కొరకు ప్రార్థించండి**

# ఫ్రాంక్లిన్ టెలీ బైబిల్ కాలేజ్

## రిజిస్ట్రేషన్‌కు ఆహ్వానం

ఆరాధన
ARADANA TV

ఫ్రాంక్లిన్ పుల్లా ఫౌండేషన్, ఆరాధన టి.వి. ద్వారా అందిస్తున్న ఎఫ్.టి.బి.సి. (ఫ్రాంక్లిన్ టెలీ బైబిల్ కాలేజ్) రాబోయే విద్యా సంవత్సరానికి ఆసక్తిగల అభ్యర్థులనుండి ధరఖాస్తులను ఆహ్వానిస్తుంది.

**ఏ విద్యార్హత లేకున్నా, ఏ వయస్సు వారైనా,**
**ఏ డినామినేషన్ వారైనా, స్త్రీలైనా, పురుషులైనా**

మీమీ ప్రాంతాలలో లేదా మారుమూల ప్రాంతాలలో సువార్త అందించాలనే ఆసక్తి ఉంటే మీ ఇండ్లవద్దనే ఉండి ఆరాధన టి.వి.లో ఎఫ్.టి.బి.సి(ఫ్రాంక్లిన్ టెలీ బైబిల్ కాలేజ్) కార్యక్రమాలను చూస్తూ ఈ కోర్సు చేయవచ్చు.

**బేచిలర్ ఆఫ్ క్రిస్టియన్ మినిస్ట్రీలో ఒక్క సంవత్సరం కోర్స్ కొరకు 16 ఆగష్టు 2011 నుండి క్లాసులు ప్రారంభమౌతున్నాయి.**



ఇతర వివరాలకు:
బ్రదర్.వి.కె. హెన్రీ, **900077493**
ఫ్రాంక్లిన్ టెలీ బైబిల్ కాలేజ్, ప్లాట్ నెం. **5,205**, అక్బర్ రోడ్, సిఖ్ విలేజ్, సికింద్రాబాద్-**500009**
చిరునామాలో గాని, లేదా ఆరాధన టి.వి. వెబ్‌సైట్‌లో గాని సంప్రదించండి.

# ఆరాధన టి.వి. కార్యక్రమాలు

| Aradana Exclusive Programs | Frequency | Time |
|---|---|---|
| Ushodayam | Daily (3 minutes only) | 5.30, 6.00, 6.30am |
| Subhakankshalu | Daily | 12 Midnight & 9.00am |
| Amrutha Bandam | Daily | 5.30 & 9.30am |
| Health Show | Sunday | 12.30pm |
| Chinni Chinni Aradana | Sunday | 1.00 pm |
| Parichayalu / Church History/Animuthyalu | Sunday | 1.30pm |
| United Christian Voice | Sunday | 2.00pm |
| Probe | Sunday | 4.30pm |
| Zindagi Forever, Mumbai | Saturday | 11.00pm |
| Live Show with Bro.Praveen | First Sundays only | 2.30 pm |
| Franklin Tele-Bible Classes | Monday to Friday | 1.30 PM & 11.00 pm |

2nd batch classes starting from 16th August 2011

| Speakers / Programs | Frequency | Time |
|---|---|---|
| Rev.William Carey | Sunday | 6.00am |
| Rev.RRK Murthy | Wed'day | 6.00am |
| Rev.G.Samuel, Hyd | Saturday | 6.00am |
| Sis.Jecintha Rani | Sunday | 6.30am |
| Rev.Sanjay Vempati | Monday | 6.30am |
| Bishop Santha Vardan, Guntur | Tuesday | 6.30am |
| Rev.Prem Kumar Babu | Wednesday | 6.30am |
| Rev.Paul Thangaiah, Bangalore | Thursday | 6.30am |
| Dr.Stephen Charles, Kurnool | Friday | 6.30am |
| Dr.Emmanuel Subash | Saturday | 6.30am |
| Dr. Stephen Paul, Vizag | Sunday | 7.00 am |
| Bishop KR Singh | Monday | 7.00am |
| Dr.Stephen Charles, Kurnool | Tuesday | 7.00am |
| Dr.Sushruth Pradhan | Wednesday | 7.00am |
| Rev.Moses Choudary | Thursday | 7.00 am |
| Berecah Dwani, Hyderabad | Friday | 7.00am |
| Rev.Shanthi Kiran, Zaheerabad | Saturday | 7.00 am |
| Rev. Joseph Kishore | Sunday | 7.30am |
| Rev.Jyothi Raju | Monday | 7.30am |
| Prof. Sam, Vizag | Tuesday | 7.30AM |
| Rev.Bret Mccasland, USA | Wednesday | 7.30 am |
| Sis. Karunasri | Thursday | 7.30 am |
| Rev.Deewan Kumar, Hyderabad | Friday | 7.30am |
| Bro.Anil Kumar | Saturday | 7.30 am |
| Time for Change, USA | Sunday & Friday | 8.00 am |
| Bishop Daniel Kalyanapu, Kazipet | Monday | 8.00 am |
| Sis. Rajashree, Hyderabad | Tuesday | 8.00am |
| Rev.Gripson | Wednesday | 8.00am |
| Rev. Solomon Sampath Kumar | Thursday | 8.00 am |
| Rev.Joshua Gootam, Kakinada | Saturday | 8.00 am |
| Rev.Samuel Patta, Hyderabad | Daily (except Sunday) | 8:30 AM |
| SwarnaDeepika, V'wada | Daily (except Sunday) | 10.00Am |
| Rev.Isaac, Wgl | Monday | 10.30am |
| SwarnaDeepika, V'wada | Tuesday | 10.30am |
| SwarnaDeepika, V'wada | Thursday | 10.30am |
| Rev.Zion Samuel | Friday | 10.30am |
| Radio Santec, Germany | Sunday | 11:00am |
| Bro.M.Mani Babu | Monday | 11.00am |
| Rev.P.Vijay Kumar, Kakinada | Wednesday | 11.00am |
| Dr.Luke | Thursday | 11.00am |
| Bro.Vadoni Luke | Saturday | 11.00am |
| Sis.Merlyn Patta, Hyderabad | Wed & Sat'day | 12 noon |
| Rev. V.S Prasad | Saturday | 1:30 PM |
| Sis. Joy Cherian, Hyderabad | Daily (except Sun) | 2.00pm |
| Sis. Alice Ponnuswamy | Tuesday | 2.30 pm |
| Sis.Leela Chandy | Wed, Thursday & Sat'day | 2.30pm |
| Sis.Esther Rani | Friday | 2.30pm |
| Sis. Havilah Onyx | Wednesday | 3.00pm |
| Rev.John Carter, USA | Saturday | 3:00 PM |
| Sis.Ruth Jeremiah | Monday | 3.30 pm |
| Sis. Uma Devi, Hyderabad | Tuesday | 3.30 pm |
| Sis.Suvarna Devadanam, Hyd | Wednesday | 3.30pm |
| Sis.Rajashree | Thursday | 3.30 pm |
| Sis Salomi, Hyderabad | Friday | 3.30pm |
| Rev.P.George | Monday | 4.00pm |
| Rev.Visvasa Rao, Ravulapalem | Wednesday | 4.00 pm |
| Bro.Gopal | Friday | 4.00 pm |
| Vishwavani-Bible Class | Saturday | 4.00 PM |
| Rev.Yanamala Isaac | Tuesday | 4.30pm |
| Rev.S.Joseph | Thursday | 4.30 pm |
| Sis.Bhagyalatha | Friday | 4.30pm |
| Rev.Johnson Mett, Hyderabad | Saturday | 4:30 PM |
| Dr.Shouri Babu | Sunday | 5.00 pm |
| Sis. Amshumathi Mary | Monday | 5.00pm |
| Rev.Joshua K, Rajamundry | Wednesday | 5.00 pm |
| Bro.Rajawardhan | Thursday & Friday | 5.00pm |
| Father Bala Shoury Reddy | Saturday | 5.00pm |
| Dr.A.John | Sunday | 5.30 pm |
| Dr.Azariah | Monday | 5.30pm |
| Pastor John Sunder | Tuesday | 5.30 pm |
| Symphony, Hyderabad | Wednesday | 5.30 PM |
| Rev.J.Prasada Rao | Thursday | 5.30 PM |
| Rev.Devadanam | Friday | 5.30 pm |
| Bishop Joab Lohara | Saturday | 5.30pm |
| Rev. Charles Stanley. USA | Sunday | 6.00pm |
| Rev. Barnabas Sajja, Gudiwada | Monday | 6.00pm |
| Bro. Immanuel, Vuyyuru | Tuesday | 6.00pm |
| Dr.Ananda Stira, Trichy | Wednesday | 6.00 pm |
| Dr. L. Immanuel, Nandyal | Thursday | 6.00pm |
| Rev.Ashish Raichur | Friday | 6.00pm |
| Rev. Jaipaul Alli, Vizag | Saturday | 6.00pm |
| Rev. Samuel Kiran J, Guntur | Sunday | 6.30pm |
| Bro.P.Isaac | Monday | 6.30 PM |
| Bro.Sudhir Kumar, Kadapa | Tuesday | 6.30 PM |
| Dr. Thomas, Rajamundry | Wednesday | 6.30pm |
| Rev.Joshua Pattabhi | Thursday | 6.30pm |
| Rev. Kurian, Kazipet | Friday | 6.30pm |
| Bro.M.Bhasker | Saturday | 6.30pm |
| Bro.Judson Abraham | Monday to Friday | 7.00 pm |
| Rev.Vijay Kumar, Kakinada | Saturday | 7.00pm |
| Bro.Anil Kumar | Sunday | 7.00pm |
| Bro. P. Joshi, Hyderabad | Daily | 7.30pm |
| Dr. N. Jayapaul, Chennai | Daily | 8.00 pm |
| Dr. John Wesley, Rajamundry | Sunday | 8.30pm |
| Dr. Isaiah, Bitragunta | Monday | 8.30pm |
| Rev. T. D Prasanna Kumar, Kadapa | Tuesday | 8.30pm |
| Rev.Samuel Patta, Hyderabad | Wednesday | 8.30pm |
| Vishwavani | Thursday | 8.30pm |
| Bishop John Lazarus, Rajamundry | Friday | 8.30pm |
| Bro.Joshua Jude | Saturday | 8.30pm |
| Dr. Satish Kumar, Hyderabad | Daily | 9.00pm |
| Jesus Calls, Chennai | Daily | 9.30pm |
| Bro. G. Vincent, Hyderabad | Sunday | 10.00pm |
| Bro. Upender, Hyderabad | Monday | 10.00pm |
| Bro. Praveen, Bellampalli | Tuesday | 10.00pm |
| Bro. Samuel David, V'wada | Wednesday | 10.00pm |
| Rev.G.Samuel, Hyd | Thursday | 10.00pm |
| Bro.Yesanna | Friday | 10.00pm |
| Rev.Ch.Devadas, Kadapa | Saturday | 10.00pm |
| Rev.Dr.Suvartha Raju | Sunday | 10.30pm |
| Rev.George Sambhathini | Monday | 10.30pm |
| Rev.Matthew Kuruvilla | Tuesday | 10.30pm |
| Rev.Brian Houston, Hill Song | Wednesday | 10.30pm |
| Rev.Paul Jeevaratnam | Thursday | 10.30pm |
| Bro. Rambabu, Bellary | Friday | 10.30pm |
| Bro.Samuel Karmoji | Saturday | 10.30 pm |